₹ 10/-

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి - 9 పక్షపత్రిక సంచిక - 20

అక్టోబర్ 16-31, 2018



నేర రాజకీయాలు రోగ లక్షణం మాత్రమే

కూకట్‌పల్లి ఓటరు జాబితాల్లో 16-21 శాతం తప్పులు

అవినీతి అధికారులకు 'అచ్ఛేదిన్'

## ఈ సారైనా ఫిరాయించరని, మన ఓటును గౌరవిస్తారని గ్యారంటీ ఉందా?



## ఓటరు జాబితాలపై ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా సర్వే

హైదరాబాద్ కూకట్‌పల్లి అసెంబ్లీ సెగ్మెంట్‌లో ఓటరు జాబితాలపై సర్వే చేస్తున్న ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ఎఫ్‌డీఆర్) పరిశోధకులు, లోక్‌సత్తా నేతలు







## ఓటు నమోదుపై లోక్‌సత్తా, యువసత్తా ప్రజాచైతన్య కార్యక్రమాలు

ఓటరుగా నమోదు చేసుకోవటంతోపాటు అవగాహనతో ఓటును సద్వినియోగం చేసుకోవాలని సూర్యాపేటలో లోక్‌సత్తా పార్టీ, విజయనగరంలో యువసత్తా నేతలు నిర్వహించిన ప్రచార కార్యక్రమాలు

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక

అక్టోబర్ 16-31, 2018 సంపుటి - 2 సంచిక - 20

## కార్టూన్ కార్నర్




ఎన్నికల ఖర్చు కోసం భూములు, ఆస్తులు.. అమ్మి తెచ్చావా.. లోపల ఆయన స్విస్ బ్యాంక్ వివరాలు చూపిస్తున్నాడు లే..!

## లోపలి పేజీల్లో...

ఈసారైనా ఫిరాయించరని మన ఓటును........... 5
ప్రజలే కూటమి కట్టాలి - ఎజెండాపై పార్టీల........ 11
కూకట్‌పల్లి ఓటరు జాబితాల్లో 16-21 శాతం... 12
ప్రజాస్వామ్య ప్రస్థానంలో మేలుమలుపు............. 13
ప్రజాస్వామ్య ప్రక్షాళనకు అరుదైన అవకాశం.........16
అవనీతి అధికారులకు 'అచ్ఛేదిన్'...................... 19
ప్రతిభను దూరం పెట్టిన ప్రతిష్ట........................ 22
పోలవరం ప్రధాన కాంట్రాక్టర్‌కి అనుచిత.......... 25
'ఆపరేషన్ కుట్టనాడ్'... యువ తెలుగు ఐఏఎస్.... 29
లోక్‌సత్తా భావజాలం దిక్సూచిలానే ............... 31
(మీడియాలో) 'కీ' కామెంట్లు !........................ 32
గిట్టుబాటు ధర కల్పించటం కూడా చేతగాని..... 34

## సంపాదక వర్గం

**డా॥ జయప్రకాష్ నారాయణ్**
*ప్రధాన సంపాదకులు*

బండారు రామ్మోహన్‌రావు
డా॥ ఆలూరి విజయలక్ష్మి
కె.వి.కుటుంబరావు

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ప్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ – 500 082

**ఫోన్ : 040-23310288**
**ఫోన్ / ఫ్యాక్స్ : 040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

*జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం:* **040-23311816**

*విడి ప్రతి : రు. 10 ,*
*ఏడాది చందా : రు. 200*
*మూడేళ్ళ చందా : రు. 500*

*చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836,* **SBI** *పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.*

IFSC No: SBIN0020072

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |


♦ ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి

# నేర రాజకీయాలు రోగలక్షణం మాత్రమే



తీవ్రమైన క్రిమినల్ కేసుల్లో అభియోగాలు ఎదుర్కొంటున్నవారు ఎన్నికల్లో పోటీ చేయకుండా నిరోధించే చట్టాన్ని ఇకనైనా తీసుకురండి.. అంటూ సుప్రీంకోర్టు ఇటీవల పార్లమెంటుకు బాధ్యతను గుర్తుచేసింది. ఈ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన సూచనల్ని పటిష్టంగా అమలు చేస్తామని ఎన్నికల సంఘం చెప్పుకుంటోందిగానీ.. కోర్టు కొత్తగా ఇచ్చిన చెప్పుకోదగిన సూచనలేవీ లేవు! నేరచరిత్ర మీద అభ్యర్థులు, పార్టీలు మీడియాలో ప్రకటనలివ్వాలని, పార్టీలు నేరస్తులకు టికెట్లివ్వకూడదని న్యాయస్థానం చెప్పింది. కానీ, మళ్లీ గెలిచే అవకాశాలు.. నిజాయతీపరులైన అభ్యర్థులకు 6శాతమే ఉంటే, నేరచరిత్రులలకు 18శాతం ఉంటున్నాయని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. కాబట్టి కేవలం ప్రకటనల ప్రచారం వల్ల ప్రయోజనం పెద్దగా కనిపించకపోవచ్చు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తమ నేరాలు, ఆస్తులు తదితర వివరాలన్నిటినీ ఇవ్వాలని లోక్‌సత్తా చేసిన కృషి వల్ల 2002లోనే సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. తెలుగునాట పోటీ చేస్తున్న అభ్యర్థుల్లో నేరచరిత్రుల వివరాలను 1999 ఎన్నికల్లో లోక్‌సత్తా విడుదల చేసింది. ఈ నేపథ్యంలో కొందరు మిత్రులు ప్రజాస్వామ్య సంస్కరణల సంఘం (ఏడీఆర్) అనే పేరుతో ఢిల్లీ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. నేరచరితుల వివరాలను తెలుసుకునే హక్కు ప్రజలకుందని, వాటిని సేకరించి ప్రజల ముందు పెట్టే బాధ్యత ఎన్నికల సంఘానిదని, ఆ విధంగా ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని ఆ దరఖాస్తులో కోరారు. అందుకు ఆధారంగా ప్రధానంగా 'లోక్‌సత్తా' ఎన్నికల నిఘా ఉద్యమంలో విడుదల చేసిన నేరచరితుల జాబితాను, అందుకు అనుసరించిన ప్రమాణాలను, పద్ధతులను కోర్టులో సాక్ష్యంగా అందజేశారు. ఆ వాదనలు విన్నాక ఢిల్లీ హైకోర్టు 2000 నవంబరు 2న.. అభ్యర్థుల నేరచరిత్రను, వారి వ్యక్తిగత, కుటుంబ ఆస్తిపాస్తుల వివరాలను, వారి అర్హతల సమాచారాన్ని సేకరించి ప్రజల ముందు ఉంచాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశిస్తూ తీర్పునిచ్చింది. ఆ తీర్పుపైన కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పీలు చేసింది. అభ్యర్థుల వివరాలను ప్రజల ముందు పెడితే వారి వ్యక్తిగత హక్కులకు భంగం కలుగుతుందన్న కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వ వాదనకు ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ కూడా వత్తాసు పలికింది. కానీ సుప్రీంకోర్టు వారి వాదనలను కొట్టిపారేసింది. వివరాల్ని ప్రజల ముందుంచాల్సిందేనని 2002లో ఓ చరిత్రాత్మకమయిన తీర్పునిచ్చింది. ఆ తర్వాత కూడా సుప్రీంకోర్టు తీర్పును నిర్వీర్యం చేసేందుకు ఆర్డినెన్స్ రూపంలో ప్రభుత్వం ప్రయత్నించింది. లోక్‌సత్తా ఆధ్వర్యంలో ప్రజాస్వామ్యవాదులు పార్టీలకతీతంగా అప్పటి రాష్ట్రపతి అబ్దుల్‌కలాంను కలిసి విషయాన్ని వివరించగా, ఆయన ఆర్డినెన్స్‌పై సంతకం చేయకుండా తిప్పిపంపారు. అయినా కూడా పాలకులు లెక్కచేయలేదు. ఆర్డినెన్స్‌ను ఆమోదించాల్సిందేనని మంత్రివర్గం తిరిగి రాష్ట్రపతికి పంపటంతో మరో మార్గం లేక ఆయన ఆమోదించారు. కొద్దిపాటి మార్పులతో దాన్నే పార్లమెంటులో చట్టంగా చేశారు. తిరిగి లోక్‌సత్తా సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ప్రజల్లో ఈ విషయంపై అవగాహన పెంచుతూ సమీకరిస్తూనే న్యాయపోరాటం చేసింది. ఈ నేపథ్యంలో 2003లో సుప్రీంకోర్టు తీర్పునిస్తూ, అభ్యర్థుల వివరాలను తెలుసుకునే హక్కు ప్రజలకుందని, దాన్ని చట్టబద్ధం చేయాలని విస్పష్టంగా ఆదేశించింది. అయితే, అభ్యర్థుల నేరచరిత్ర, ఇతర వివరాలు తెలియటం.. ప్రజల్లో, రాజకీయ వ్యవస్థల్లో ప్రజాస్వామిక చైతన్యాన్ని పెంచటంలో ఓ మైలురాయేగానీ దీనివల్ల అద్భుతాలు జరుగుతాయనుకోవద్దని ఆరోజే చెప్పాను. ఈ విజయం వల్ల కొంతమేర నేరస్తులను రాజకీయాల్లో కట్టడి చేయగలిగామనటంలో సందేహం లేదు. బహిరంగంగా నేరస్తులకు టికెట్లిచ్చే తెగింపు పార్టీల్లో కొంత తగ్గింది. కానీ దీంతోపాటే చేయాల్సిన ఇతర కొన్ని సంస్కరణలు కాగితాలు దాటక పోవడంతో నేరరాజకీయాలను ఏమీ చేయలేమనే పరిస్థితి మళ్లీ నెలకొంటోంది. ఫిరాయింపులులాగానే నేరరాజకీయాలు కూడా జబ్బు లక్షణాలే తప్ప అసలు జబ్బు కాదు. జబ్బుకు వైద్యం చేయకుండా లక్షణాలకే పరిమితమైతే ఆశించిన మార్పు రాదు. మనదేశంలో చట్టబద్ధ పాలన నూటికి 20 మార్కుల స్థాయిలోనే ఉండడం వల్ల, నేరస్తులకు పెద్ద మార్కెట్ కొనసాగుతోంది. సమర్థుడైన నేరస్తుడిని సమాజం ఆదరిస్తూ ఓ స్థాయిని కూడా కల్పిస్తోంది. నేరాల దర్యాప్తులో రాజకీయ జోక్యంతో రాజకీయాలు నేరస్తులను అయస్కాంతంలా ఆకర్షిస్తున్నాయి. అనుచరుల నుంచి ఏకంగా నేతల అవతారాల్ని ధరించే దాకా రాజకీయాల్లో నేరస్తుల సంఖ్య పెరిగిపోతోంది. వీరిపై పొరపాటున సాక్ష్యాలు బలంగా ఉన్నా కూడా.. కోర్టుల్లో కేసులు ఎప్పటికి తేలతాయో, అప్పటి దాకా సాక్ష్యాలు ఎలా ఉంటాయో తెలీదు. ఇంకో పక్కన.. ఒక్క ఓటు తక్కువ వచ్చినా ఓడిపోయినట్టే అనే మన ఎఫ్‌పీటీపీ ఎన్నికల వ్యవస్థ, స్థానికంగా ప్రజలతో సంబంధం లేకుండా అంతా పైస్థాయిలో కేంద్రీకృతమైన పాలనా వ్యవస్థల వల్ల- నిధులు దండడడానికి, ఏదోకరకంగా ఓట్లు సంపాదించడానికి, ప్రభుత్వ కార్యాలయాల్లో దళారీ పాత్ర పోషించడానికీ నేరరాజకీయ సంస్కృతి బాగా అక్కరకొస్తోంది. 'ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు చేసిపెట్టటం + మధ్యవర్తిత్వ సెటిల్‌మెంట్లు + ప్రైవేటు రక్షణ + ఓట్ల కొనుగోలు = ఎన్నికల్లో గెలుపు అవకాశాలు' అనే ఫార్ములా నేరచరిత్రులకు అభినవ రాబిన్‌హుడ్ ఇమేజ్‌తో రాజకీయాల్లో అవకాశం కల్పిస్తున్నాయి. 2014లో 56 కోట్ల మంది ప్రజలు 9,00,000 పోలింగ్ స్టేషన్లలో వేసిన ఓటు ద్వారా ఎన్నికైన 542 మంది ఎంపీలలో 34శాతం మంది నేరారోపణలు ఎదుర్కొన్నవారేనని గణాంకాలు చెబుతున్నాయి. 2014లో గెలిచిన ఎంపీలలో 20శాతానికిపైగా ఎదుర్కొంటున్న ఆరోపణలు హత్యాప్రయత్నం, దొంగతనం వంటి తీవ్ర నేరాలకు సంబంధించినవి. బీజేపీ, కాంగ్రెస్ తేడాలేకుండా అన్ని పార్టీలవారూ ఇందులో ఉన్నారు. ఎన్నికలలో గెలుపు ఓట్ల శాతం తగ్గుతున్న కొద్దీ పార్టీల్లో నేరస్తులకు (ఎమ్మెల్యేల్లో కూడా) డిమాండ్ పెరుగుతోంది. దీనివల్ల అవినీతి, నల్లడబ్బు పాతుకుపోతున్నాయి. ఒక్కసారి ప్రజాప్రతినిధిగా ఎన్నికయ్యాక ఆదాయం పెరగనివారు అరుదని, శాసనసభ్యుల సరాసరి ఆదాయం 222శాతం పెరిగిందని 2013లో వెలువడిన ఓ అధ్యయనం తెలిపింది. వీటిలో వేటినీ సుప్రీంకోర్టు తాజా తీర్పులో ప్రస్తావించలేదు. చట్టబద్ధపాలన సక్రమంగా అమలుచేయటం (మనదేశంలో కుటుంబ వ్యవస్థ బలహీనపడుతున్న నేపథ్యంలో ఈ అవసరం ఇంకా పెరుగుతోంది), ప్రభుత్వ కార్యాలయాల్లో 'పౌర సేవల' చట్టాన్ని తీసుకురావటం, స్థానిక ప్రభుత్వాలకు సాధికారత, త్వరితగతిన న్యాయం అందించటానికి స్థానిక కోర్టుల ఏర్పాటు, దర్యాప్తు వ్యవస్థల్ని పటిష్టం చేయటం, జడ్జీల సంఖ్యను పెంచటం, రాష్ట్రాల్లో ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక, దామాషా ఎన్నికల పద్ధతి కోసం చర్యలు తీసుకోకుండా కేవలం నేరరాజకీయాల గురించి మాట్లాడుకుని ఉపయోగం లేదు. ఈ సంస్కరణలకు పెద్ద ఖర్చు కూడా అవదు. కావలసిందల్లా రాజకీయ సంకల్పం, సమాజంలో అవగాహన.



# ఈసారైనా ఫిరాయించరని, మన ఓటును గౌరవిస్తారని గ్యారంటీ ఉందా?

**ఓటు విలువ గురించి దేశవిదేశాల రాజనీతిజ్ఞులు ఎన్నోసార్లు ఎన్నో రకాలుగా మనకు తెలియజెప్పారు, చెప్తున్నారు. ఓటు విలువ ఇంకా మనలో చాలామందికి పూర్తిగా తెలియకపోయినా.. ఓటనేది మన చేతిలోని ఓ విలువైన అవకాశం అని మాత్రం అర్థమవుతోంది. మరి మనం వేసిన ఓటుతో గెలిచిన అభ్యర్థి వేరే పార్టీలోకి ఫిరాయిస్తే మనకెంత ఓటమి భావన కలుగుతుంది? నక్సలైట్లు ఏం చేస్తున్నారు? పార్టీల్ని ఫిరాయించిన, అవినీతికి పాల్పడిన రాజకీయ నేతలను కాల్చి పారేయొచ్చుగా?.. అని ఒకోసారి మనలో ఆవేశం వస్తుంటుంది. ఇటీవల ఏపీలో అరకు ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావును కాల్చి చంపే ముందు మావోయిస్టులు కూడా అదే రకంగా మాట్లాడారట. 'పార్టీ ఫిరాయించి తీసుకున్న కోట్ల రూపాయలు చాలలేదా ఇంకా గిరిజనుల బతకులతో చెలగాట మాడుతున్నావు?' అని అడిగారట. అప్పుడప్పుడు ఆవేశంతో అనుకుంటుంటాం కానీ.. హత్యలు, తుపాకీ పాలన పరిష్కారం కాదని మనకు తెలుసు. అందుకే ప్రాక్టికల్‌గా ఆలోచిద్దాం. ఫిరాయింపుల్ని అడ్డు కునేందుకు, మన ఓటుకున్న విలువను కాపాడుకునేందుకు.. కనీసం కొన్ని పరిష్కారాలనైనా 2018-19 ఎన్నికల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల్లో డిమాండ్‌గా చేసుకుందాం.**

మహాత్మాగాంధీ 'భారతీయత అనే ఒక సంస్కృతిని' నూతన భరతజాతిగా మలచారు. స్వాతంత్ర్యం తేవడం కంటే కూడా జాతి నిర్మాణ నాయకత్వ సామర్థ్యమే గాంధీజీకి చిరస్థాయి నందించింది. కానీ భరతజాతి గతానికి-భవిష్యత్తు లక్ష్యాలకు మధ్య వారధి నిర్మాణంలో మాత్రం జాతీయోద్యమ కాలం నుండీ సరైన అడుగులు పడలేదు. ఆ తర్వాతి తరంలో అసలు ఆ దృష్టే కరవైంది. ఇదే ఈవేళున్న సంక్షోభాలకు మూలకారణంగా మారింది.

ఉన్న సమాజానికి - రాజ్యాంగ విలువలకు మధ్య ఉన్న అగాధాన్ని పూడ్చే ప్రయత్నం చేయకుండా.. రాజ్యాంగాన్ని కూడా అవాంఛనీయ సామాజిక ధోరణుల స్థాయికి దిగజార్చే ప్రయత్నం చేసే రాజకీయం కొనసాగుతోంది. ప్రపంచీకరణలోనైనా, ప్రజాస్వామ్యం లోనైనా బోలెడంత స్వేచ్ఛ కనిపిస్తుంది. కానీ కొన్ని రకాల వ్యవస్థీకృత ఏర్పాట్లు లేకుంటే.. ఈ స్వేచ్ఛ కాస్తా దోపిడీ పెట్టుబడి దారులకు, వంశపారంపర్య, అవినీతి రాజకీయ నేతలకు, నియంతృత్వ పాలకులకు అందివచ్చిన అవకాశంగా మారుతుంది, ప్రజలను నిస్సహాయులుగా, యాచకులు గా కొనసాగిస్తూంటుంది. ఇలా రాజ్యాంగాన్ని తనకు నచ్చినట్టు ఉపయోగించుకునే ఒక సన్నివేశమే ఇప్పుడు తెలంగాణలో ముందస్తు ఎన్నికల రూపంలో కనిపిస్తోంది.




ఇంకా దాదాపు తొమ్మిది మాసాలు అధికారంలో కొనసాగే అవకాశం ఉండగానే, తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు శాసనసభను రద్దు చేసి ఎన్నికలకు సిద్ధమని ప్రకటించారు. రద్దు చేయటమే కాదు.. ఒకేసారి 105 మంది అభ్యర్థులను

కూడా ప్రకటించి ఎన్నికల ప్రచారానికి భేరీ కూడా మోగించారు. అంతా ముఖ్యమంత్రి అనుకున్నట్టు, అంతకుముందే కొన్ని పత్రికలు ప్రచురించినట్టే జరిగింది.

సెప్టెంబర్ 6, 2018న కేసీఆర్ మంత్రివర్గ సమావేశాన్ని ఏర్పాటు చేసి ఏకవాక్యంతో ఐదు నిమిషాల్లో అసెంబ్లీని రద్దు చేసేసి వెంటనే రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్‌కు సమాచారం అందజేశారు. కేసీఆర్ తిరుగు ప్రయాణంలో ఉండగానే గవర్నర్ కార్యాలయం ఆయన్ను ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా ప్రకటించేసింది. ఈ కార్యాకారణ సంబంధం అర్థంకాక షాక్ తిన్న పలువురు తేరుకోకముందే.. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కేసీఆర్ మరిన్ని షాకులిచ్చారు. ఎన్నికల సంఘం అధికారులతో ముందే మాట్లాడేశానని, ఎన్నికలు ఫలానా టైంలోనే జరుగు తాయని తేల్చిచెప్పేశారు. ఉత్కంఠతో లైవ్ చూస్తున్న ప్రజానీకం కంటే ముందస్తు గురించిన లీకులు కాస్త ఎక్కువగా తెలిసిన పాత్రికేయులకు కూడా 'అసలు ముందస్తు ఎన్నికలు ఎందుకు జరుగుతున్నాయి?' అనే ప్రశ్నకు సరైన సమాధానం దొరకలేదు. కేంద్రంలో బోలెడంత పాత్ర పోషించాలి, 2019లో లోక్‌సభతోపాటే ఎన్నికలకు వెళితే, 2018 చివర్లో జరిగే కొన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో పుంజుకునే అవకాశమున్న కాంగ్రెస్ తెలంగాణలో మరింత బలపడే అవకాశం ఉంటుంది, మోదీ పట్ల వ్యతిరేకత తనకు చుట్టు కుంటుంది, రాష్ట్రంలో కుమారుడు కేటీఆర్‌ను ముఖ్యమంత్రిగా స్థిరపరిచాక కేంద్రానికి వెళ్లటానికి వీలుగా 2018లోనే అసెంబ్లీ ఎన్నికల పార్ట్‌ని పూర్తి చేసేయటం మేలు.. అని కేసీఆర్ భావించినట్టు స్పష్టంగానే కనిపిస్తోంది. కానీ ఇందులో ప్రజాప్రయోజనమేమీ పెద్దగా లేదు గదా? ఈ రకమైన కారణంతో ముందుగా ఎన్నికలకు వెళ్తున్నామని ప్రజలకు చెప్పలేరు గదా? పైగా.. రాష్ట్రంలో ప్రగతి అద్భుతంగా ఉందని, తాను చేయించిన డజనుకుపైగా సర్వేల్లో తమ పార్టీ వందకు తక్కువ కాకుండా స్థానాలను గెలుచుకుంటుందని కూడా కేసీఆర్ ప్రకటించేశారు. అందుకే.. ముందస్తు ఎన్నికలకు కారణమేంటో చెప్పండని రిపోర్టర్లు ప్రశ్నించారు. లైవ్ ముందున్న ప్రజలు కూడా ఊపిరి బిగబట్టి చూశారు. కానీ ప్రతిపక్షాల తీరు పట్ల విసుగొచ్చి వారిని వదిలించుకోవడానికే 'కమాన్, ఎన్నికల్లో తేల్చుకుందాం' అని ముందస్తుకు వెళ్తున్నామని టీఆర్ఎస్ అధినేత చెప్పారు. దీంతో, అక్కడున్న సీనియర్ జర్నలిస్టులు బుర్ర గోక్కోవాల్సి వచ్చింది. కొంచెం గ్యాపిచ్చి, మళ్లీ అడిగారు. అసెంబ్లీని ఇన్ని నెలల ముందుగా ఎందుకు రద్దుచేశారు?.. వారి మీద కస్సుబుస్సులాడుతూ, కోప్పడుతూ తాను చెన్నారెడ్డి, ఎన్టీఆర్‌ల కంటే హేమాహేమీననే అభిప్రాయాన్ని చెప్పు కోవడానికే ప్రాధాన్యతనిచ్చారు తప్ప.. అసెంబ్లీని ముందస్తుగా ఎందుకు రద్దు చేశారు అనే విషయాన్ని మాత్రం కేసీఆర్ విప్పిచెప్పలేదు. జమిలి ఎన్నికలకు మద్దతిస్తున్నానని చెప్పిన నోటితోనే.. అసెంబ్లీకి ముందస్తు ఎన్నికలు జరపాలని సిఫారసు చేశారు. కాస్త ఆలస్యంగా, కొంత ఖర్చు ఎక్కువగా మోపు చేసేట్టే అయినా.. కేసీఆర్ మనోభావాలను గౌరవిస్తున్నట్టే ఎన్నికల సంఘం తేదీల్ని ప్రకటించింది. నాలుగు రాష్ట్రాల ఎన్నికల షెడ్యూల్‌లో భాగంగా డిసెంబర్ 7న తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలను ప్రకటించింది.

చట్టసభలను ముందుగా రద్దు చేయటమేమీ రాజ్యాంగ విరుద్ధం కాదు. అంతకుముందు అలా చేసినవాళ్లున్నారు. ఇతరత్రా కొన్ని సందర్భాలను అలా ఉంచితే, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1984లో నాదెండ్ల భాస్కరరావు వెన్నుపోటు తర్వాత తిరిగి ముఖ్యమంత్రి పదవిలోకి వచ్చిన ఎన్టీరామారావు సభలోని కాలుష్యాన్ని వదిలించుకునేందుకు ముందస్తు ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. నవంబర్‌లో సభ రద్దుకు సిఫార్సు చేశారు. డిసెంబరులో జరిగే లోక్‌సభ ఎన్నికలతోపాటు కాకుండా 1985 మార్చిలో అసెంబ్లీ ఎన్నికలు జరపాలని కోరారు. ఆ తర్వాత 1989లోనూ ఎన్టీఆర్ ముందస్తుకు వెళ్లారు. 2002లో గుజరాత్ ముఖ్యమంత్రిగా నరేంద్రమోదీ, 2003లో తనపై అలిపిరి దాడి నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,

**తొలి తెలంగాణ శాసనసభ విశేషాలు**

గడువుకు ముందే రద్దయిన తొలి తెలంగాణ శాసనసభ విశేషాలివీ..

సభ సమావేశమైన రోజులు: 126

ఆమోదించిన బిల్లులు: 71

ఆమోదించినా ఆమోదం పొందని బిల్లులు: 2

(రిజర్వేషన్ల పెంపు, గూండా నిరోధక చట్టంలో సవరణల బిల్లు)

తీర్మానాలు: 21

ఆర్డినెన్స్‌లు: 25

సభలో ప్రవేశపెట్టిన పత్రాలు: 95

గవర్నర్ ప్రసంగం: 5 సార్లు

బడ్జెట్: 5 సార్లు ప్రవేశపెట్టారు

సభ జరిగిన సెషన్లు: 11

సభ సమావేశమైంది: 13 సార్లు



భారత్ వెలిగిపోతోంది అనే నినాదంతో ప్రధాని వాజ్‌పేయి ముందస్తు ఎన్నికలకు సభలను రద్దు చేశారు. గెలుపోటములను పక్కనపెడితే, కొన్ని బలమైన కారణాలను ఆయా నేతలు ముందస్తుకు చూపటానికి ప్రయత్నించారు. అవి నిజంగా బలమైన కారణాలా అన్నది కూడా చర్చనీయాంశం కావచ్చు. కానీ కనీసం ప్రజలకు సరైన కారణం చెప్పాలని ఆలోచన, వారికి ఆ రకంగా కనిపించాలనే ప్రయత్నమూ మాత్రం జరిగాయి. కానీ కేసీఆర్ మాత్రం ఆ దిశగా ఏమాత్రం ప్రయత్నం చేయలేదు. ఒకే ప్రశ్నను అంతమంది జర్నలిస్టులు వరుసగా ఎందుకు అడుగుతున్నారు అనే ఆలోచన కూడా లేకుండా అందరినీ ఆయన గదమాయించి నోళ్లు మూయించారు. ప్రతిపక్షాలు 200కి పైగా కేసుల్ని నమోదు చేశాయి, నిజాయతీని నిరూపించుకునేందుకే ప్రభుత్వాన్ని రద్దు చేసి ఎన్నికలకు వెళ్లామని.. కోర్టులో చెప్పిన కారణం కూడా కొబ్బరి చెట్టు ఎందుకు ఎక్కావంటే దూడ మేత కోసం చందానే ఉంది. 2019లో దాదాపు 20 లక్షల మంది కొత్త ఓటర్లు నమోదయ్యే అవకాశమున్నా, కొన్ని ముఖ్యమైన బిల్లులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నా.. ముందస్తుకు కనీసం ఒక సహేతుక ప్రజాప్రయోజకర కారణాన్ని చెప్పే ప్రయత్నం కూడా కేసీఆర్ చేయలేదు. 'ఇది నాయకులు, పార్టీల గొప్పతనానికి, ఆధిపత్యానికి సంబంధించిన విషయం కాదు, ప్రజాస్వామ్య మనుగడకు సంబంధించిన విషయం' అనే రాజకీయ, పౌర బాధ్యతను ఆయన పూర్తిగా విస్మరించారు.

ఎన్నికల బరి విషయానికొస్తే, కేసీఆర్‌కుండే వ్యూహాలు ఉంటాయి. ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉన్నవారిని సైతం తాను గెలిపించగలననే నమ్మకంతో ఆయన దాదాపుగా సిట్టింగ్ ఎమ్మెల్యే లందరికీ టికెట్లిచ్చారు. ప్రతిపక్షాల టికెట్లు ఖరారయ్యాక, టీఆర్ఎస్ తాజా అభ్యర్థులుగా ఉన్న తాజా మాజీ ఎమ్మెల్యేల్లో ప్రజావ్యతిరేకత మూట కట్టుకున్నవారిని మార్చే అవకాశాలున్నాని కొందరు మీడియా విశ్లేషకులు ఊహాగానం చేస్తున్నారు. మరోవైపు, భారీ ప్రచారానికి కావలసిన మీడియా సహా అన్ని వనరుల్ని, హంగుల్ని కేసీఆర్ సమకూర్చు కున్నారు. ప్రతిపక్షాలు మరీ బలపడేలోగానే ఎన్నికల్లో లబ్ధి పొంది అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియను ముగించేయవచ్చు అనే అంచనా ఆయనలో కనిపిస్తోంది. తెలంగాణ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా చంద్రబాబు లేఖలు, ఓటుకు కోట్లు కేసు వంటి అంశాలను కూడా ఆయన పార్టీ ప్రచారంలో ఉపయోగించుకుంటోంది. ఎక్కడా చట్టధిక్కారం లేకుండా అన్నీ జరుగుతున్నట్టు కనిపిస్తున్నాయి.. కానీ 'ముందస్తు ఎన్నికలు ఎందుకు?' అనే మౌలిక ప్రశ్నకు జవాబు పట్ల ప్రజలు అంత సంతృప్తికరంగా లేరు.

తెలంగాణను సాధించటంలో కేసీఆర్‌దే ప్రధానకృషి అనటంపై ప్రజల్లో ఎలాంటి సందేహం లేదు. అలాగే రాష్ట్రం వచ్చాక విద్వేషాల్ని రెచ్చగొట్టకుండా సామరస్యాన్ని పెంచటంలో కూడా ఆయన విజ్ఞతతో వ్యవహరించారు. దేశంలోని ఏ ఇతర ముఖ్యమంత్రితో పోల్చినా జనరంజకమైన రీతిలో తాయిలాల పథకాల్ని అమలు చేశారు. ఇన్ని జిలుగులతో యావత్ తెలంగాణలోనే అత్యంత ఆకర్షణీయ నాయకుడిగా కేసీఆర్ వెలుగొందుతున్నా కూడా.. ఆయన్ను ఏకపక్షంగా తిరిగి గెలిపించటానికి జనం సిద్ధంగా లేరు. శాసనసభ రద్దుకు ముందు బిగ్‌బ్యాంగ్ కర్టెన్ రైజర్‌లా ఆర్‌టీసీ బస్సుల్ని ఉపయోగించి, తలసరి రూ.500కు తక్కువ కాకుండా డబ్బులిచ్చి (ఆర్‌టీసీ సిబ్బందికి కూడా) మరీ జనసమీకరణ చేసి నిర్వహించిన కొంగర్‌కలాన్ సభ ఆశించినంత విజయవంతం కాకపోవటం దగ్గర మొదలైన సంకేతాలు ఇప్పుడు ఇంకా పెరుగుతున్నాయి. కేసీఆర్ ముఖ్యమంత్రిత్వం పట్ల ప్రజల్లో మరీ వ్యతిరేకత లేకపోయినా, ఎమ్మెల్యేలందరినీ కూడా తనను చూసే గెలిపించాలంటే ఆమోదించే స్థాయిలో మాత్రం సాను కూలత లేదు. 'సింహం సింగిల్‌గానే వస్తుంది', 'ఢిల్లీ హైకమాండా? తెలంగాణ లోనే ముఖ్యమంత్రి నిర్ణయమా?' వంటి డైలాగులు కూడా ఆశించినంత పేలటం లేదు. అందుకేనేమో, ఆయన ఇటీవల తిరిగి అస్తిత్వ రాజకీయాల్లోకి జారిపోతూ సభల్లో పరుషభాషను ఉపయోగిస్తున్నారు. బీజేపీయేతర, కాంగ్రెసేతర కూటమిలో చంద్రబాబునూ చేర్చుకుంటానన్న నోటితోనే.. చంద్రబాబును ఆంధ్రా రాక్షసిగా నిందిస్తున్నారు. ఓటుకు కోట్లు కేసుపై ఇన్నేళ్లుగా రెండు కళ్లూ మూసుకుని, ఇప్పుడు మూడో కన్ను తెరుస్తానని బెదిరిస్తున్నారు. పోలవరం ముంపు మండలాలను ఏపీలో కలపటానికి తానే సమ్మతం తెలిపానని మరచిపోయి, నాలుగేళ్లు దాటాక ఇప్పుడు మళ్లీ నిప్పులు చిమ్మే ప్రయత్నం చేస్తున్నారు. ఇదేదో అప్రయత్నంగా జరుగుతున్నది కాదు. ఒక రాజకీయ విశ్లేషకుడు వ్యాఖ్యానించినట్టు, చంద్రబాబు, కేసీఆర్ సహజ రాజకీయ మిత్రులు. తెలుగుదేశంతో కలవటం వల్ల కాంగ్రెస్‌కు వచ్చే లాభాన్ని దెబ్బ తీయటానికి కేసీఆర్ ఇప్పుడు వ్యూహాత్మక దాడి మొదలుపెట్టారంతే. ప్రత్యర్థిగా బలమైన కాంగ్రెస్‌ను కాకుండా, చంద్రబాబునే చూపటం ద్వారా గత ఎన్నికల్లోలాగానే లాభపడాలని కేసీఆర్ చూస్తున్నారు. మరోపక్క దీంతోపాటే, ప్రతిపక్ష కూటమి ఇచ్చే తాయిలాల్ని కూడా అధిగమించటానికి ఆరాట పడుతున్నారు.

తన పాలన మీదే ప్రజలు ప్రధానంగా తీర్పునిస్తారన్న విషయాన్ని విస్మరించి.. తెలంగాణ ఉద్యమ సమయంలోలా ఆంధ్రా వర్సెస్ తెలంగాణ విభేదాలను తెస్తూ చంద్రబాబు, మహాకూటమి టార్గెట్‌గా కేసీఆర్ మొదలుపెట్టిన ప్రచారం కొంత రిన్కుతో కూడుకున్నదే. ఇక్కడకు వలసవచ్చిన ఆంధ్రావాళ్లంతా తమను తాము తెలంగాణవారుగానే భావించుకోవాలని కేసీఆర్ సూచిస్తున్నారు. తమ మూలాలున్న ఆంధ్ర ప్రాంతం, తాము

ఉంటున్న హైదరాబాద్/తెలంగాణ కూడా తమకు సమానంగా విలువైనవే అని భావించే మెజారిటీ ప్రజానీకం కేసీఆర్ ఎత్తుగడకు ఎలా ప్రతిస్పందిస్తారో చూడాలి. కేసీఆర్ దాడికి జనస్పందనైతే ఇంకా గుంభనంగానే ఉంది. కూటమి ప్రచారం కూడా ముమ్మరమైతేగానీ స్పష్టత రాకపోవచ్చు. మరోవైపు, కేసీఆర్ వెనుక ప్రధాని మోదీయే ఉన్నారన్న ప్రచారంతో ఆయన తిట్లను ఉపయోగించుకుని ఏపీలో కూడా లబ్ధి పొందాలని చంద్రబాబు పావులు కదుపుతున్నారు. ఏపీ ఎన్నికల ముందు మోదీ సృష్టించే అవరోధాలను అంచనా వేయటానికి తెలంగాణ ముందస్తు ఒక రిహార్సల్‌లా టీడీపీకి ఉపయోగపడవచ్చు.

వచ్చే ఎన్నికల్లో అలా విషయంలేని వేడి పుట్టించేందుకు నేతలు చేస్తున్న ప్రయత్నాలకు ప్రజల్లో స్పందన ఏమేరకు ఉంటుందో ఇప్పుడే చెప్పలేం. ఈ నేపథ్యంలో.. తనకున్న గెలుపు అవకాశాల్ని, అనుకూలతల్ని కాపాడుకునో, ప్రతిపక్షాల బలహీనతలను ఉపయోగించుకునో, మరో రకమైన ఎత్తుగడ వేసో, ఇంకో రకంగా ప్రయత్నించో కూడా కేసీఆర్ మెజారిటీని లేదా ఆశించిన స్థాయిలో సీట్లను సంపాదించకపోతే ఏమవుతుంది?

మళ్లీ కథ మొదటికొస్తుంది.

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత తెలంగాణ శాసనసభ 2014 జూన్ 9న తొలిసారిగా సమావేశమైంది. ఆనాటి సభలో తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) సభ్యుల సంఖ్య 63. కానీ 2018లో సభ రద్దయ్యే నాటికి ఆ పార్టీకున్న బలం 90. వీరంతా ఎక్కడ్నుంచి వచ్చారు? రెండు ఉప ఎన్నికల్లో (నారాయణ్‌ఖేడ్, పాలేరు) కాంగ్రెస్ సీట్ల నుంచి ఇద్దరు టీఆర్ఎస్ అభ్యర్థులు గెలుపొందారు. ఇక మిగిలినవారంతా ఇతర పార్టీల నుంచి ఫిరాయించినవారే.

తెలుగుదేశం పార్టీ నుంచి ఎన్నికైన 15 మందిలో 12 మంది టీఆర్ఎస్‌లో చేరారు. వైకాపా నుంచి ముగ్గురు తెరాసలో చేరారు. బీఎస్పీ నుంచి గెలిచిన ఇద్దరు తెరాసలో చేరారు. చేరారు.. అనే కంటే ప్రలోభాలతోనో, బెదిరింపులతోనో చేర్చుకున్నారు అనటం సమంజసంగా ఉంటుంది. ఈ చేరికల్లో ఎక్కడా తెలంగాణ ప్రయోజనాలుగానీ, సైద్ధాంతిక అంశాలుగానీ కనిపించవు. ఈ ఫిరాయింపుల దెబ్బకి వైకాపా, బీఎస్పీ తెలంగాణ అసెంబ్లీలో తమ ప్రాతినిధ్యాన్నే కోల్పోయాయి.

ఎన్నికల అనంతరం తొలి సభాసమావేశంలో 9 పార్టీలకు ప్రాతినిధ్యం ఉండగా, ఇప్పుడు కేవలం 7 పార్టీలకే ఉంది. సీపీఐ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ తెరాసలో చేరినా సీపీఐ ఎమ్మెల్యేగానే సభలో కొనసాగారు. కాంగ్రెస్ నుంచి ఎన్నికైన ఏడుగురు ఎమ్మెల్యేలు చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, కాలే యాదయ్య, రెడ్యా నాయక్, విఠల్‌రెడ్డి, ఎన్.భాస్కరరావు, కోరం కనకయ్య, పువ్వాడ అజయ్ కుమార్‌లు కూడా తెరాసకు మద్దతు తెలిపారు. ఇలా, తొలుత 63 మంది సభ్యులున్న టీఆర్ఎస్‌కు సభ రద్దయ్యే సమయానికి 90 మంది సభ్యులయ్యారు. పార్టీ ఫిరాయించిన కొందరికి మంత్రిపదవులు లభించగా, ఇంకొందరికి ఇంకో రూపంలో తాయిలాలు అందాయన్నది బహిరంగ రహస్యం. రేపు ఎన్నికల్లో టీఆర్ఎస్ తగిన మెజారిటీ రాకపోతే (ఆశించిన స్థానాలు రాకున్నా కూడా).. మళ్లీ కేసీఆర్ ఇదే తంతును పునరావృతం చేయటానికి ప్రయత్నిస్తారు.

ఈ విషయాన్ని కేటీఆర్ ఇప్పటికే ఒక ప్రముఖ పత్రిక ఇంటర్వ్యూలో ప్రకటించేశారు కూడా. ఫిరాయింపులతో ప్రతిపక్ష పార్టీలను బలహీనపరచటం రాజకీయాల్లో మామూలే అని ఆయన చెప్పుకొచ్చారు. తాము బలహీన పరుస్తున్నది ప్రతిపక్షాలను కాదని, అంతకంటే ముందు ప్రజాస్వామ్యాన్నని కేసీఆర్, కేటీఆర్, వారి పార్టీ గుర్తించటం లేదు. ఒక పార్టీ గుర్తు మీద ఎన్నికల్లో ఓటు అడిగి, గెలిచి, మరో పార్టీలో చేరటం అనేది ఏ రకంగా సమర్థనీయం? ఇలా మారినవారి మీద చర్య తీసుకునే అధికారం ఉన్న స్పీకర్.. బాధ్యతని, విలువల్ని పూర్తిగా గాలికొదిలేయటంతో అధికార క్రీడలో ఫిరాయింపులు సాధారణ రాజకీయంగా తయారవుతోంది. ఫిరాయింపులపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని, పార్టీ మారినవారిని అనర్హులుగా ప్రకటించాలని రాజ్యసభ చైర్మన్ హోదాలో ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు చెప్పినా, తాను స్వయంగా కొందరి మీద చర్యలు తీసుకుని కొద్దిపాటి ప్రయత్నం చేసి చూపినా.. (ఆయన్ను గెలిపించిన బీజేపీ పాలిత రాష్ట్రాల్లో సహా) స్పందన లేదు. 2019 ఎన్నికల తర్వాత కూడా తెలంగాణలో ఫిరాయింపులు అడ్డూఆపూ లేకుండా కొనసాగుతుందనే సంకేతాన్నే ఈ పరిణామాలన్నీ ఇస్తున్నాయి. ఒకవేళ టీఆర్ఎస్‌ని ఓడించి, ప్రత్యర్థుల్లో బలంగా కనిపిస్తున్న కాంగ్రెస్‌ని గెలిపిస్తే?.. తగిన మెజారిటీ రాకున్నా, ఆశించిన సీట్లు రాకున్నా కాంగ్రెస్ (కూటమి) కూడా టీఆర్ఎస్ తరహాలోనే ఫిరాయింపులను ప్రోత్సహిస్తుందనటంలో ఎటువంటి సందేహమూ లేదు.

అసలు దేశంలో ఫిరాయింపుల జాడ్యానికి బీజం వేసిందే కాంగ్రెస్ పార్టీ (చాలా సందర్భాల్లో హర్యానా ఈ ఫిరాయింపులకు కేంద్రబిందువు– ఢిల్లీకి పక్కనుండటం వల్ల. ఆ తర్వాత దేశమంతా విస్తరించింది. 1982లో భజన్‌లాల్ హర్యానాలో జనతా ప్లాట్‌ఫాం మీద ఎన్నికయ్యారు. కానీ ఆ తర్వాత ఇందిరాగాంధీ గెలవగానే ఆయనతోపాటు మొత్తం పార్టీ మార్చేశారు. ఈదేశంలో అలా జరిగిన మొట్టమొదటి సంఘటన అది. ముఖ్యమంత్రితోపాటు అందరూ పార్టీ మార్చేశారు. వికృత రాజకీయం ఆరోజే మొదలైంది). అందునా

తెలంగాణలో ఉద్యమ పార్టీగా చెప్పుకునే టీఆర్ఎస్ ఫిరాయింపుల ఉదాహరణ ప్రబలంగా కనిపిస్తోంది. ఇక కప్పదాట్లను ప్రోత్సహించకుండా కాంగ్రెస్ ఆగుతుందా?

ఈ మధ్య ఇంకో రకం ట్రెండ్ కూడా మళ్లీ ఊపందుకుంటోంది. కర్ణాటకలోలా కొద్దిపాటి సీట్లతో మూడో స్థానంలో ఉన్నా కూడా అధికారంలోకి ఎందుకు రాకూడదని ఆలోచించే ధోరణి పార్టీల్లో మొదలైంది. ఇదే ఆకాంక్షని హైదరాబాద్‌లో ఎంఐఎం నేత అక్బరుద్దీన్ బహిరంగంగా ప్రకటించారు ('నేను ఎమ్మెల్యేనయితే నేనే ముఖ్యమంత్రిని' అని గతంలో భజన్‌లాల్ ప్రకటించారు). అలాగే టీఆర్ఎస్, కాంగ్రెస్‌కు మధ్య హోరాహోరీగా పోరు ఉంటుందన్న అంచనాల నేపథ్యంలో, అధికార పార్టీ 'లోపాయికారీ' తోడ్పాటుతో కాసిని సీట్లను సంపాదించుకోగలిగితే.. కింగ్‌లా వ్యవహరించవచ్చని బీజేపీ వాళ్లు కూడా లెక్కలేసుకుంటున్నట్టు సమాచారం. ఇది కూడా ఫిరాయింపులను నిర్లజ్జగా ప్రోత్సహించే పరిణామమే అవుతుంది.

ఇది ఒక్క తెలంగాణకే కాదు, ఆంధ్రప్రదేశ్‌లోనూ పెద్ద జాడ్యంగా మారింది.

రాష్ట్ర విభజన జరిగాక, తెలంగాణలో ఫిరాయింపుల్ని ప్రోత్సహిస్తున్నారనే కారణంగా ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు మీద తొలుత కేసీఆర్ కత్తులు దూశారు. ఈ నేపథ్యంలోనే ఓటుకు కోట్లు కేసు బైటపడింది. చంద్రబాబు బూచిని చూపి ఆ తర్వాత కేసీఆర్ ఫిరాయింపుల్ని ప్రారంభించారు. తొలుత కేసీఆర్‌ను తీవ్ర పదజాలంతో విమర్శించిన చంద్రబాబు.. ఆ తర్వాత తానూ అదే బాట పట్టారు. ఏపీలో ప్రస్తుతానికి అధికారికంగా 23 మంది ప్రతిపక్ష వైకాపా ఎమ్మెల్యేల్ని అధికార తెదేపాలోకి లాక్కున్నారు. అయినా తెలంగాణలోలానే స్పీకర్‌లో స్పందన లేదు. రానున్న ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్‌తో కలిసి మహాకూటమిలో భాగమైన చంద్రబాబు.. అవసరమైతే మళ్లీ తన పొరుగు రాష్ట్రంలో ఫిరాయింపుల్ని యథేచ్ఛగా ప్రోత్సహిస్తారనటంలో సందేహం లేదు.

ఈ రకంగా ఎన్నికల్లో ఏదోకరకంగా గెలవటం, గెలిచాక ఏదోకరకంగా అధికారంలోకి రావటం, అధికారంలోకి వచ్చాక ఏదోకరకంగా ఇతర పార్టీల ఎమ్మెల్యేలను లాక్కోవటం.. అనే రాజకీయ క్రీడకు ఆమోదాన్ని పెంచే ప్రయత్నాలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో మనం ఓటు వేయాలనుకుంటున్న పార్టీ ఎమ్మెల్యే అదే పార్టీలో కొనసాగుతారని గ్యారంటీ ఏమైనా ఉందా? అలా గ్యారంటీ లేనప్పుడు ఆ ఎన్నిక గురించి మనం ఎందుకు అంత హైరానాపడటం? పార్టీల మధ్య యుద్ధాన్ని మనం ఎందుకు పట్టించుకోవటం?..

ఒక్కసారి ఆలోచన చేయండి. పార్టీల ఫిరాయింపుల్ని మనం ఆపలేనప్పుడు, ఏ పార్టీ ఎమ్మెల్యే అయినా చివరికి అధికార పార్టీ ఎమ్మెల్యేగానే మారుతున్నప్పుడు.. ఇక మన ఓటుకు, ప్రజాస్వామ్యానికి విలువేంటి? మన బతుకుల్ని బాగు చేసుకోవటానికి మన చేతుల్లో ఉన్న ఆయుధం ఓటే అయినప్పుడు.. ఆ ఆయుధాన్ని ఎవరి మీద ప్రయోగించినా చివరికి అధికార పార్టీ మెడలో హారంగా మారుతున్నప్పుడు, మన స్వేచ్ఛ, సార్వభౌమాధికారాలకు అర్థమేమిటి? ఇలాంటప్పుడు మన ముందున్న మార్గమేంటి?

రాజకీయానికి, మన జీవితానికి మధ్య సంబంధం లేకున్నా ఫర్వాలేదనుకుంటే, ఎన్నికల గురించి, పార్టీల గురించి పట్టించుకోవటం మానేయొచ్చు. కానీ గాంధీగారు చెప్పినట్టు, రాజకీయం మన జీవితంలోని దాదాపు ప్రతి అంశాన్నీ చుట్టుముట్టి ఉంది. రాజకీయాన్ని, పాలనను వదిలేయటమంటే, మన జీవితాలకే మనం నష్టం చేసుకున్నట్టవుతుంది. అందుకే ఫిరాయింపులకు మూలాల గురించి పట్టించుకుందాం, సరిచేయటంలో భాగమవుదాం.

ఈ వ్యాసంలో ప్రధానంగా అసెంబ్లీ ఎన్నికల గురించే ప్రస్తావించినా.. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఎమ్మెల్యేలు, ఎంపీలు అనే తేడా లేకుండా ఎడాపెడా పార్టీ ఫిరాయింపులు జరుగుతున్నాయి. ఇవి ఒక పెద్ద జబ్బుకు సంకేతాలు మాత్రమే. అసలు జబ్బు వేరే ఉంది. ఘాటు విమర్శలు, ఫిరాయింపులకు ప్రోత్సాహాన్నిస్తున్న 52వ రాజ్యాంగ సవరణ స్థానంలో లోక్‌సత్తా కృషి వల్ల వచ్చిన 91వ రాజ్యాంగ సవరణ.. ఆ జబ్బును నయం చేయటానికి సరిపోవటం లేదు. అందుకే ఇంకొన్ని బలమైన చర్యల మీద మనం దృష్టి సారించాలి.

ఫిరాయింపుల్ని అదుపు చేయడానికి నిర్ణయాధికారాన్ని స్పీకర్ చేతిలో నుంచి ఎన్నికల సంఘం చేతిలో పెట్టాలని లోక్‌సత్తా తొలుతే సూచించినా 91వ రాజ్యాంగ సవరణ సమయంలో రాజకీయ పార్టీలు అందుకు అంగీకరించలేదు. ఇప్పటికైనా ఆ పని చేయాలి. దీంతో పాటు, స్పీకర్ పదవిలో ఒకసారి నియమితమయ్యాక ఇక జీవితంలో ఏ పార్టీకీ చెందకపోవటం, స్పీకర్ పోటీ చేసే స్థానంలో ఏ పార్టీ అభ్యర్థులను పోటీకి నిలపకపోవడం వంటి ఏర్పాట్లు కొంత పనిచేస్తాయి.

మరోవైపు.. ఎన్నికల్లో అక్రమ డబ్బు ప్రవాహాన్ని కట్టడి చేయటం చాలా ముఖ్యం. ముఖ్యంగా రాజకీయ చైతన్యం ఎక్కువగా ఉండే రాష్ట్ర అసెంబ్లీల ఎన్నికల్లో! మన ఎన్నికల వ్యవస్థ ఉన్నకొద్దీ డబ్బు చుట్టూ తిరుగుతోంది. కేవలం డబ్బుతోనే ఎన్నికల్లో గెలవలేకపోయినా, డబ్బే ఎన్నికల్లో గెలుపునకు ఎంట్రీ పాయింట్ అనే పరిస్థితి దేశం మొత్తమ్మీదా ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో ఏపీ, తెలంగాణ ముందున్నాయి. ఎన్టీ రామారావును అప్రజాస్వామికంగా పదవీచ్యుతిడ్ని చేశాక తీవ్ర అభద్రతా భావంతో ఉన్న చంద్రబాబు

నాయుడు తన ముఖ్యమంత్రి పీఠాన్ని పటిష్టం చేసుకునే క్రమంలో ఎన్నికల్లో విచ్చలవిడి ధనప్రవాహానికి తెరతీశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉప ఎన్నికల నుంచి మొదలైన ఆ జాడ్యం రాష్ట్రం విడిపోయినా రాజకీయం మారకపోవటం తో రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ పెద్దఎత్తున కొనసాగుతూనే ఉంది. ఎమ్మెల్యేలను గుప్పెట్లో పెట్టుకోవడానికి ముఖ్యమంత్రులు శాసనసభ్యుల అరాచకాలను సహించటంతోపాటు అధికార పార్టీలోకి ఫిరాయింపుల్ని నిస్సిగ్గుగా ప్రోత్సహిస్తున్నారు. ముఖ్యమంత్రి ఎమ్మెల్యేల మీద ఆధారపడాల్సిన అవసరం లేకుండా చేసి.. ఆ పదవికి ప్రత్యక్ష ఎన్నికలను గనక నిర్వహిస్తే, ఫిరాయింపుల్ని కొంతమేర నియంత్రించచ్చు. ముఖ్యమంత్రిగా గెలవటానికి మరీ రూ.3,000 కోట్లు ఖర్చు చేయలేరు కాబట్టి ప్రత్యక్షంగా ఎన్నుకుంటే అవినీతికి కొంత కళ్లెం పడుతుంది. దీంతోపాటు ఎమ్మెల్యేలు శాసనసభను దాటి ప్రభుత్వ వ్యవహారాల్లో జోక్యం చేసుకునేందుకు వీలులేకుండా.. ప్రభుత్వ కార్యాలయాల్లో పౌర సేవల చట్టం, స్థానిక ప్రభుత్వాలకు సాధికారత తదితర ఏర్పాట్లను కూడా చేస్తే, ఫిరాయింపులు ఇంకొంత తగ్గుతాయి. ఒక్క ఓటు తక్కువ వచ్చినా ఓడిపోయినట్టే అనే ఎన్నికల వ్యవస్థలో అదనపు ఓట్ల కోసం డబ్బు వెదజల్లటాన్ని తగ్గించేందుకు దామాషా ఎన్నికల పద్ధతిని అమలు చేస్తే ప్రజలు తమ ఓటుకు కోల్పోయిన గౌరవాన్ని తిరిగి సంపాదించుకోగలుగుతారు.

ఒక్క నిమిషం.

ఫిరాయించిన ఎమ్మెల్యేలు చేస్తున్న కొన్ని వాదనల్ని కూడా ఇక్కడ మనం కొంత పట్టించుకోవాలి. ఒకరకంగా వారంతా విషవలయంలో కూరుకుపోయి ఉన్నారు. పార్టీలకు సిద్ధాంతాలున్నాయా, పాడా? ఏ పార్టీలోకి జంప్ అయితే ఏముంది?.. అని వారు దబాయి స్తున్నారు. ఇందులో కొంత వాస్తవం ఉన్నదని అంగీకరించాలి. తెదేపా, తెరాస, కాంగ్రెస్, వైసీపీ మధ్య ఏమైనా తేడా ఉందా? ఏ పార్టీలో ఉంటే ఏముంది?

అందుకే విధానాల్లో పార్టీల మధ్య తేడా ఉండేలా, ప్రత్యామ్నాయాలు స్పష్టంగా కనిపించేలా మార్పులు కావాలి.

మరోవైపు, పార్టీ అధినేతలు విప్ జారీ చేసి నియంతృత్వాన్ని చెలాయించటానికి వీల్లేకుండా.. పార్టీలోని నాయకుల భిన్నాభిప్రాయాలకు అవకాశం ఉండేలా పార్టీల్ని ప్రజాస్వామీకరించాలి. అవిశ్వాస, విశ్వాస తీర్మానాలు, బడ్జెట్ వంటి సందర్భాలను మినహాయించి మిగిలిన చోట్ల సభ్యులు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వినిపించే అవకాశాలుండేలా పార్టీల్ని ప్రక్షాళన చేయాలి.

ఇలా గొలుసుకట్టులా సంస్కరణలు జరిగినప్పుడు మాత్రమే.. సరైన అభ్యర్థులు ఎన్నికల్లో పోటీకి ముందుకొస్తారు, వారిలో భిన్నాభిప్రాయాలను పరిశీలించే అవకాశం ఓటర్లకు లభిస్తుంది, బేరీజు వేసుకుని సరైనవారిని ఎన్నుకో గలుగుతాం, మనం ఎన్నుకున్నవారు ఐదేళ్లపాటు అదే భావజాలానికి, అవే హామీలకు కట్టుబడి వ్యవహరిస్తారు, మన ఓటుకు విలువ ఉంటుంది. ఇవన్నీ ఆచరణ సాధ్యమైన సంస్కరణలని మాత్రం మనం స్పష్టంగా గుర్తుంచుకోవాలి.

మనముందున్న ఈ పరిష్కారాల్లో..

1) ఫిరాయింపులపై చర్యలు తీసుకునే అధికారం ఎన్నికల సంఘానికి ఇవ్వడం, ఒక్కసారి స్పీకర్‌గా ఎన్నికైన వ్యక్తి ఇక ఏ పార్టీకీ చెందకుండా ఉండడం వంటి ఏర్పాట్లు చేయడం

2) రాష్ట్రాల్లో ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక, దామాషా ఎన్నికల పద్ధతి అమలు చేయటం

3) ప్రభుత్వ కార్యాలయాల్లో ఎమ్మెల్యేల మనుషులు, వారి బ్రోకరేజీ అక్కర్లేకుండా పౌర సేవల చట్టం వంటి చర్యలు చేపట్టటం

4) స్థానిక ప్రభుత్వాలకు నిధులు, అధికారాలు బదిలీ చేయడం

5) పార్టీలకు సరైన విధానాలు, వాటి మధ్య ప్రత్యామ్నాయం, నేతలు తమ భిన్నాభిప్రాయలను స్వేచ్ఛగా వినిపించే అవకాశం ఉండేలా రాజకీయ పక్షాలలో అంతర్గత ప్రజాస్వామ్యాన్ని పెంపొందించడం

.. వేటినైనా మనం ఈసారి ఎన్నికల డిమాండ్‌గా చేస్తున్నామా? చేయకుండా ఫిరాయింపులు ఎలా పోతాయి?

నక్సలైట్లు ఏం చేస్తున్నారు? పార్టీల్ని ఫిరాయించిన, అవినీతికి పాల్పడిన రాజకీయ నేతలను కాల్చి పారేయొచ్చుగా? అని ఒకోసారి మనలో ఆవేశం వస్తుంటుంది. ఇటీవల ఏపీలో అరకు ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావును కాల్చి చంపే ముందు మావోయిస్టులు కూడా అదేరకంగా మాట్లాడారట. 'పార్టీ ఫిరాయించి తీసుకున్న కోట్ల రూపాయలు చాలలేదా? ఇంకా గిరిజనుల బతుకులతో చెలగాటమాడుతున్నావు?' అని అడిగారట. అప్పుడప్పుడూ ఆవేశంతో అనుకుంటుంటాంగానీ.. హత్యలు, తుపాకీ పాలన పరిష్కారం కాదని మనందరికీ తెలుసు. అందుకే ఫిరాయింపుల్ని అడ్డుకునేందుకు, మన ఓటుకున్న విలువను కాపాడు కునేందుకు.. పైన చెప్పుకున్న పరిష్కారాలలో కనీసం కొన్నిటినైనా 2018-19 ఎన్నికల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల్లో డిమాండ్‌గా చేసుకుందాం.

పౌర సేవల చట్టం, స్థానిక ప్రభుత్వాలకు సాధికారత.. అనే రెండు డిమాండ్లనైతే రాష్ట్రాల స్థాయిలోనే వెంటనే సాధించుకోవచ్చు. మిగతావాటి మీదా మనం గట్టిగా అడగటం మొదలెట్టాలి. ఈ ఎన్నికల్లో జాతీయ పార్టీలు కూడా ఉన్నాయి. నిర్దిష్ట పరిష్కారాలను కూడా చూపుతున్నాం కాబట్టి మనవేమీ సంశయించాల్సిన పన్లేదు. ఇలా తక్షణ, దీర్ఘకాలిక అనేక దృష్టితో మనం ఎన్నికల డిమాండ్లను రూపొందించుకుని క్రియాశీలంగా కదిలినప్పుడే ఫిరాయింపుల బారిన పడకుండా మన ఓటుకున్న విలువను పరిరక్షించుకోగలం. ◆

# ప్రజలే కూటమి కట్టాలి - ఎజెండాపై పార్టీల భరతం పట్టాలి

- బండారు రామ్మోహనరావు

తెలంగాణలో ముందస్తు అసెంబ్లీ ఎన్నికలకు తేదీ కూడా వచ్చేసింది. తొమ్మిది నెలల ముందుగానే ఎన్నికల కోలాహలం మొదలైంది. సహజంగా అధికారంలో ఉన్న పార్టీ అధికారం చివరి రోజు వరకూ వదులుకోవడానికి ఇష్టపడదు. ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న పార్టీలకు 'బస్తీమే సవాల్' విసురుతుంటాయి. కానీ తెలంగాణలో అధికార టీఆర్ఎస్ పార్టీ కొన్ని నెలల ముందుగానే అసెంబ్లీని రద్దు చేసి ఎమ్మెల్యేలందరినీ "తాజా మాజీలను" చేసింది. తొలిసారి ఎమ్మెల్యేలుగా ఎన్నికైనవారయితే, ఏడ్చేది ఒక్కటే తక్కువ. మొదటి 'బులపం' తీరకముందే మాజీలయ్యారు. మళ్లీ గెలుస్తారో, ఓడుతారో తెలియదు. వచ్చిన ఎమ్మెల్యే రాజయోగం కాస్తా కేసీఆర్ పుణ్యాన అర్థంతరంగా ముగిసింది. అధికార, ప్రతిపక్ష పార్టీల పాత్రల నిర్వహణ తారుమారైంది. సీన్ రివర్స్ అయింది. అధికారంలోంచి దిగిపొమ్మనే మాటనే కేసీఆర్ నిజం చేశారు. అసెంబ్లీ నుండి బహిష్కరించిన, సస్పెండయిన, పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలతోపాటు అందరినీ ఒకే గాటన కట్టి అసెంబ్లీ రద్దు చేసి 'ఖేల్ ఖతమ్ – దుకాణం బంద్' కాదు.. ఎన్నికల దుకాణం తెరిచారు. గవర్నర్ అధికారపక్ష సిఫార్సు మేరకు అసెంబ్లీని రద్దు చేస్తూ సంతకం చేశారు. ఎన్నికల వ్యవహారం ఎన్నికల కమిషన్ చేతిలోకి వెళ్లింది. వెళ్లిందే తడవుగా రద్దుకు ముందు కేసీఆర్ చెప్పినట్టుగానే ఆగమేఘాల మీద కేంద్ర ఎన్నికల సంఘం హైదరాబాద్ రావడం, ఎన్నికల వాయిదా కోరిన ప్రతిపక్షాల మాటను కొట్టిపారేసి ఎన్నికల ఓటరు లిస్టు సవరణకు కూడా ప్రకటించిన తేదీలు మార్చి షెడ్యూలును ముందుకు జరిపింది. ప్రతిపక్ష పార్టీలు హైకోర్టుకెళ్లి ఎన్నికలు ఆపమని పిటిషన్ వేస్తే, ఇదేం విడ్డూరం ఎన్నికలు జరపమనాలిగానీ ఆపమనడమేమిటని హైకోర్టు అందులో జోక్యం చేసుకోమంది. అది ఎన్నికల కమిషన్ పరిధిలోని అంశమంది. దింపుడుకళ్లం ఆశతో సుప్రీంకోర్టు గడపనూ తొక్కినా మళ్లీ బంతి హైకోర్టులోకే వచ్చిపడింది. నాలుగు రాష్ట్రాలతో పాటు తెలంగాణ అసెంబ్లీకి ఎన్నికల్ని ఈసీ ప్రకటించింది. డిసెంబర్ 7న ఎన్నికలు, 11న ఫలితాలు. దీంతో, ప్రతిపక్షపార్టీలు పొత్తులాటను తీవ్రతరం చేశాయి. కూటములు ఏర్పడుతున్నాయి. కాంగ్రెస్, టీడీపీ, సీపీఐ, తెలంగాణ జనసమితి (టీజేఎస్)లు పొత్తుకు ఒక ప్రాతిపదికను చర్చించాయి. సీట్ల పంపకం కోసం, ఆధిపత్యం కోసం సంప్రదింపులు జరుగుతున్నాయి. ఫ్రంట్‌కు ఆధిపత్యం ఎవరు వహించాలి అనేది కూడా ఒక ప్రశ్నే. పెద్దన్న పాత్ర కాంగ్రెస్‌దే అయినా, వ్యూహాత్మకంగా చిన్నన్న కోదండరాంకు పెద్దపాత్ర కల్పించే వ్యూహం రూపొందించారు.




ఇక బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్) పేరున మరో కూటమిని చిన్నాచితకా పార్టీలను కలుపుకొని ఏర్పాటు చేసి సీపీఎం పెద్దన్న పాత్రను పోషిస్తోంది. ఓటు ప్రజాస్వామ్యాన్ని నిరాకరిస్తూ, రాజ్యాంగాన్ని ధిక్కరిస్తూ నూతన ప్రజాస్వామిక విప్లవం పేరుతో ఇప్పటిదాకా ఎన్నికలను బహిష్కరిస్తున్న గద్దర్ కొత్త పార్టీ ద్వారా ఎన్నికల్లో పోటీ చేస్తానని ప్రకటించడం కొసమెరుపు. డెబ్బై ఏళ్ల వయసు వరకూ కనీసం ఓటు నమోదు చేసుకోని, ఒక్కసారి కూడా ఓటుహక్కు వినియోగించుకోని గద్దర్ మొదటిసారి తెలంగాణ రాష్ట్రంలో ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకున్నారు, బ్యాలెట్‌కే ఓటు వేశారు. బుల్లెట్ కాదు బ్యాలెట్ ద్వారానే సమాజాన్ని మార్చాలని ప్రకటించడం ఒక శుభపరిణామం. ఆయన ఏ పార్టీ ద్వారా పోటీ చేస్తారు, లేక ఉమ్మడి అభ్యర్థిగా స్వయంగా కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ అసెంబ్లీ నుండే (గద్దర్ స్వగ్రామం తుప్రాన్ గజ్వేల్ నియోజకవర్గంలో ఉంది) పోటీ చేస్తారా అనేది ఎన్నికల వెండితెరపై చూడాల్సిందే.

కాటికి కాళ్లు జాపే పండు ముదుసలులు కూడా ప్రజాస్వామ్యం కోసం పార్టీలు స్థాపిస్తున్నారు. యువతకే అధికారం అని సిగ్గుబిడియం లేకుండా ప్రకటనలిస్తున్నారు. కూటములు – ఎన్నికల పొత్తులతో రాజకీయ రణరంగం తెలంగాణలో బిజీగా ఉంది. ఎన్నికల మ్యానిఫెస్టోలు తయారవుతున్నాయి. అనుచిత ఉచితాలను పార్టీలు ప్రకటిస్తున్నాయి. ఒకడిని దించడమే మా పని అని, మరొకరిని అధికారంలోకి తీసుకురావడమే తరువాయి అని భీషణ ప్రతిజ్ఞలు చేస్తున్నాయి. మీరు ఇచ్చే ముష్టివరాలు కాదు మాకు కావాల్సింది.. మాకు కావాల్సింది విద్య, ఆరోగ్యం, ఉపాధి అని ప్రజలు పోరుబాట పట్టాలిప్పుడు. అవినీతి, లంచంలేని సుపరిపాలన కావాలని, వ్యవసాయం లాభసాటి కావాలని, పట్టణాలు, పల్లెల్లో నివాసయోగ్యమైన పరిస్థితులు కల్పించాలని ప్రజలే కూటమి కట్టాలి, పార్టీల భరతం పట్టాలి. ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభువులు కావాలి. ◆

# కూకట్‌పల్లి ఓటరు జాబితాల్లో 16–21 శాతం తప్పులు.. ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా శాంపిల్ సర్వేను వెల్లడించిన జేపీ

తెలంగాణలో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కూకట్‌పల్లి నియోజకవర్గ ఓటరు జాబితాల కచ్చితత్వంపై ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ఎఫ్‌డీఆర్)/లోక్‌సత్తా నిర్వహించిన శాంపిల్ సర్వేలో 16 నుంచి 21 శాతం దాకా తప్పులున్నట్టు వెల్లడైందని ఎఫ్‌డీఆర్ ప్రధాన కార్యదర్శి, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ తెలిపారు.

| Sample Verification of Electoral Rolls (2018) in KukatpallyAssembly Constituency (Medchal-Malkajgiri District) | | | | | | |
|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 |
| AC No/Part No. | No. of voters in the list | No. of voters verified | Additions required (percentage to verified voters) | Deletions required (% to verified voters) | Total variations (Additions + Deletions) Col. 4 + 5 | % of variations (Col6) to voters verified (Col 3) |
| 46/245 | 878 | 275 | 63 (22.9) | 75 (27) | 138 | 50.1 |
| 46/246 | 874 | 39 | 1 (2.5) | 3 (7.7) | 4 | 10.3 |
| 46/337 | 502 | 374 | 46(12.3) | 32(8.6) | 78 | 20.9 |
| 46/338 | 883 | 115 | 13(11.3) | 21(18.3) | 34 | 29.6 |
| 46/339 | 663 | 630 | 50 (7.9) | 43 (6.8) | 93 | 14.8 |
| 46/340 | 486 | 473 | 12(2.5) | 55(11.6) | 67 | 14.2 |
| 46/341 | 646 | 143 | 1 (0.6) | 24 (16.8) | 25 | 17.5 |
| 46/342 | 532 | 168 | 0 (0) | 19 (11.3) | 19 | 11.3 |
| **Total** | **5464** | **2217 (40.6%)** | **186 (8.4%)** | **272 (12.26%)** | **458** | **20.7** |

For more details visit www.fdrindia.org

ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా బృందం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కూకట్‌పల్లి అసెంబ్లీ సెగ్మెంట్‌లోని 8 పోలింగ్ బూత్‌ల పరిధిలో సర్వే చేశారని, ఇందులో 89.5 శాతం సర్వే చేసిన మూడు బూత్‌లలో 16.2 శాతం తప్పులుండగా.. 40.6 శాతం మేర సర్వే చేసిన మొత్తం ఎనిమిది బూత్‌లలో 20.7 శాతం మేర తప్పులున్నాయని జేపీ వెల్లడించారు.

"మూడు బూత్‌లలో మొత్తం 1651 మంది ఓటర్లు ఉండగా, ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా బృందం దాదాపు ప్రతి ఇంటికీ వెళ్లి 1477 మంది వివరాల్ని జాబితాలతో సరిచూశారు. ఈ 89.5 శాతంలో.. ఓటు హక్కుకు అర్హత ఉండీ జాబితాల్లో పేరు లేని వారు 108 మంది (7.3 శాతం) ఉన్నారు. గత ఎన్నికల్లో తాము ఓటు వేసినా ఈసారి తమ పేరును తొలగించారని వీరిలో సగంమందిదాకా ఫిర్యాదు చేశారు. మరోవైపు, తొలగించాల్సిన పేర్లు 130 (8.8 శాతం) ఉన్నాయి. ఇతర ప్రాంతాలకు ఇల్లు మారటం, చనిపోవటం, ఒకటికి మించి ఎక్కువ చోట్ల ఓటరుగా నమోదవటం వంటి కారణాల వల్ల ఆ పేర్లను తొలగించాల్సి ఉంది. మొత్తంగా చేరికలు, తొలగింపులు కలిపి 238 మంది (16.2 శాతం) ఓటర్లకు సంబంధించిన తప్పిదాలు ఈ మూడు బూత్‌ల పరిధిలోని జాబితాల్లో కనిపించాయి.

"మొత్తం ఎనిమిది బూత్‌లలో (పై మూడు బూత్‌లూ కలిపి) 5464 మంది ఓటర్లు ఉండగా, ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా బృందం 2217 మంది వివరాల్ని పరిశీలించింది. ఈ 40.6 శాతం ఓటర్లలో.. అర్హత ఉండీ ఓటు హక్కు లేనివారు 186 మంది (8.4 శాతం) ఉండగా, తొలగించాల్సిన పేర్లు 272 (12.26 శాతం) ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తంగా 458 అవకతవకలు (20.7 శాతం) ఉన్నాయి" అని జేపీ వివరించారు.

### నిర్లక్ష్యంతో మళ్లీ మొదటికి.. పోస్టాఫీసును నోడల్ ఏజన్సీ చేయటమే శాశ్వత పరిష్కారం

ఓటరు జాబితాల ప్రక్షాళన లక్ష్యంగా దేశంలోనే మొదటిసారిగా ఓటరు రిజిస్ట్రేషన్ ప్రక్రియలో లోపాలపై లోక్‌సత్తా 1999లో 56 గ్రామీణ, పట్టణ పోలింగ్ స్టేషన్ల పరిధిలో సర్వే ప్రారంభించిందని, అప్పట్లో జాబితాలో తమ పేరు ఉందో లేదో కూడా తెలుసుకునే వెసులుబాటు ప్రజలకు ఉండేది కాదని, దీనివల్ల అవకతవకలు పెద్దఎత్తున ఉండేవని జేపీ తెలిపారు. ఓటు విలువపై ప్రజల్లో చైతన్యాన్ని పెంచటంతోపాటు.. ఓటర్ల జాబితాలో తప్పుల్ని సవరించి తేలిగ్గా ఎప్పటికప్పుడు పేర్లు నమోదు చేసుకునే దిశగా లోక్‌సత్తా చేసిన ప్రయత్నం వల్ల పట్టణ ప్రాంతాల్లో తప్పులు 44.8 శాతం నుంచి 15.9 శాతానికి, గ్రామీణ ప్రాంతాల్లో 15 శాతం నుంచి 5 శాతానికి తగ్గాయన్నారు. 2004లో 110 రూరల్ పోలింగ్ స్టేషన్లలో, 2005లో సనత్‌నగర్ నియోజకవర్గంలోని మొత్తం 182 పోలింగ్ బూత్‌లలోనూ లోక్‌సత్తా చేసిన సర్వేలో ఈ మార్పు స్పష్టంగా కనిపించిందన్నారు. ఎన్నికల సంఘం కూడా ఈ పద్ధతిని దేశవ్యాప్తంగా అమలుచేసి ఓటర్ల నమోదును నిరంతర ప్రక్రియగా చేసిందని, దీనివల్ల సత్ఫలితాలు కనిపిస్తున్నా నిర్లక్ష్యం వల్ల పరిస్థితి మళ్లీ అధ్వాన్నమవుతోందని కూకట్‌పల్లిలోని శాంపిల్ సర్వేలు సూచిస్తున్నాయన్నారు. సాంకేతిక పరిజ్ఞానం ఉన్నా కూడా మెరుగైన ఫలితాల్ని సాధించలేకపోవటం తగదన్నారు. ప్రైవేటు వ్యక్తులకు ఓట్ల నమోదు పనిని అప్పగించి అధికారులు నిర్లక్ష్యం వహించటం తగదని, ఇంటింటి తనిఖీ చేసి తొలగింపులు, చేరికల్ని ధృవీకరించి తుది జాబితాను రూపొందించాలని అన్నారు. లోక్‌సత్తా ఎప్పటినుంచో సూచిస్తున్నట్టు.. ఓటరు జాబితాల్లో పేర్ల తొలగింపు, నమోదును నిరంతర ప్రక్రియ చేయటానికి స్థానిక పోస్టాఫీసుని శాశ్వత నోడల్ ఏజన్సీగా చేయాలని జయప్రకాష్ నారాయణ్ కోరారు. ◆

*(క్రిమినల్ కేసులున్నవారిని ఎన్నికల్లో నిషేధించే అంశంపై సుప్రీంకోర్టు సెప్టెంబర్ 25, 2018న ఇచ్చిన తీర్పుకి నేపథ్యాన్ని, అందులో లోక్‌సత్తా ప్రధాన పాత్ర పోషించిన వైనాన్ని కొత్తవారు కూడా స్పష్టంగా అర్థం చేసుకునేందుకు వీలుగా 2002, 2003లో లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జేపీ రాసిన ఈ రెండు వ్యాసాల్ని అందిస్తున్నాం.*

*తీవ్రమైన క్రిమినల్ కేసుల్లో అభియోగాలు ఎదుర్కొంటున్నవారిని ఎన్నికల్లో పోటీకి అనర్హులుగా ప్రకటించే విషయమై పార్లమెంటే చట్టం చేయాలని తాజా తీర్పులో సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. నేరమయ రాజకీయాలు ప్రజాస్వామ్యాన్ని మరింత ప్రమాదకరంగా మారకముందే చట్టసభ స్పందిస్తుందన్న విశ్వాసాన్ని అత్యున్నత న్యాయస్థానం వ్యక్తం చేసింది.*

*– లోక్‌సత్తా టైమ్స్ ఎడిటోరియల్ టీం).*

# ప్రజాస్వామ్య ప్రస్థానంలో మేలుమలుపు

**- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్**



ఈ నెల 2న సుప్రీంకోర్టు ఓ చరిత్రాత్మకమయిన తీర్పునిచ్చింది. ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థుల నేరచరిత్ర, వారి ఆస్తులు, అప్పులు, విద్యార్హతలు తెలుసుకునే హక్కు ప్రజలకు ఉందని సర్వోన్నత న్యాయస్థానం విస్పష్టంగా తేల్చిచెప్పింది. ఈ వివరాలను సేకరించి ప్రజల ముందు పెట్టే బాధ్యతను ఎన్నికల సంఘానికి అప్పగించింది. భారత ప్రజాస్వామ్య పరిణామంలో ఇదో ముందడుగు. ఈ కేసు పూర్వాపరాలు పరిశీలిస్తే మనమెన్నో పాఠాలు నేర్చుకోవచ్చు.

**ఎన్నికల నిఘా ప్రభావం**

1999 లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల సందర్భాన 'లోక్‌సత్తా' ఎన్నికల నిఘా ఉద్యమాన్ని చేపట్టింది. ఆ ఉద్యమంలో భాగంగా తొలిసారిగా అభ్యర్థుల నేరచరితను నిర్ధారించడానికి నిర్దిష్టమయిన ప్రాతిపదికలను రూపొందించింది. గతంలో కోర్టులో శిక్ష పడినా, ప్రాథమిక విచారణ తరవాత నేరారోపణ జరిగి న్యాయస్థానంలో విచారణ నడుస్తున్నా, రౌడీషీటరుగా లేదా హిస్టరీ షీటరుగా ఏ పోలీస్‌స్టేషన్‌లోనయినా నమోదయినా, అవినీతి కారణంగా ఉద్యోగం కోల్పోయినా, అక్రమార్జన చేసినట్లు దాఖలాలున్నా ఆ అభ్యర్థిని నేరచరితుడుగా పరిగణించడం సబబేనని 'లోక్‌సత్తా' భావించింది. నిష్ణాతులయిన న్యాయకోవిదులు, పరిపాలనాదక్షులు, ప్రజాస్వామ్య ఉద్యమకారులు, పాత్రికేయులు ఈ ప్రమాణాలను రూపొందించారు. ఈ ప్రాతిపదికపైన దేశ చరిత్రలోనే తొలిసారిగా ప్రజల భాగస్వామ్యంతో అభ్యర్థులలో నేరచరితుల వడపోత కార్యక్రమాన్ని 'లోక్‌సత్తా' చేపట్టింది. ప్రజలలో విస్తృత ప్రచారాన్ని కల్పించడంతోపాటు పార్టీలకు ముందుగానే కార్యక్రమ వివరాలను అందించడం జరిగింది. అయినా పార్టీలు ఖాతరు చేయకుండా అలవాటు ప్రకారం నేరచరితులను అభ్యర్థులుగా నిలిపాయి. దానితో వారి వివరాల సేకరణకు లోక్‌సత్తా బృహత్ యత్నమే చేసింది. అందుకు రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం ఏమాత్రం సహకరించలేదు.

విచారణలో ఉన్న కేసుల వివరాలను కూడా అందించడానికి పోలీసు శాఖ నిరాకరించింది. కొద్దిమంది చిత్తశుద్ధిగల అధికారులు రహస్యంగా సహకరించారు. పాత్రికేయులు, సామాన్య ప్రజలు ఇచ్చిన సమాచారాన్ని ఆధారంగా చేసుకుని, వాస్తవాలను బేరీజు వేసి 'లోక్‌సత్తా' 45 మంది అభ్యర్థుల నేరచరిత్రను ప్రకటించింది. ఆ ప్రకటనకు భిన్న వర్గాలు వివిధ రకాలుగా స్పందించాయి. ఓ ప్రధాన పార్టీ "లోక్‌సత్తా ఏమయినా కోర్టా?" అని ప్రశ్నించింది. మరో ప్రధాన పార్టీ "అసలు ఆ జాబితాకు విశ్వసనీయత లేద"ని కొట్టిపారేసే ప్రయత్నం చేసింది. ప్రజాస్వామ్యంలో సత్యానికి, ప్రజాభిప్రాయానికి చాలా విలువ ఉంది. ఆ జాబితా రూపొందించడానికి జరిగిన ప్రయత్నాన్ని ప్రస్తుతిస్తూ అన్ని వర్గాల ప్రజలు, పత్రికల నుంచి విశేషమైన స్పందన లభించింది. నేరచరిత్ర వివరాలను ఆధారాల సహా ప్రకటించడంతో బలమైన అభ్యర్థులు కూడా అవి వాస్తవాలు కాదని బుకాయించలేకపోయారు. ఆనాడు ఒకే ఒక

సహేతుకమయిన విమర్శ వినవచ్చింది. అదేమిటంటే మరో 10-15 మంది అభ్యర్థులు నేరచరితులయినా వారి పేర్లు ప్రకటించలేదని. దానికి ముందునుంచీ 'లోక్‌సత్తా' స్పష్టమయిన సమాధానం చెబుతూ వచ్చింది. నిర్దిష్టమయిన ఆధారాలుండి, నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం నేరచరితులుగా తేలినవారి జాబితాను మాత్రమే లోక్‌సత్తా ప్రకటించింది. జాబితాలో ఉన్నవారు కొందరు ఆ తరవాత కోర్టు తీర్పులో నిర్దోషులుగా తేలవచ్చు, లేదా నేరం చేసినట్లు రుజువు కాలేదని వారిని విడుదల చేయవచ్చు. కేవలం- వారి నేరచరిత్రకు ఆధారాలున్నాయని ప్రజా ఉద్యమాలు చెప్పగలవు కాని, వారు నేరం చేసినట్లు రుజువయిందని చెప్పలేవు. జాబితాలో లేనివారిలో కొందరికి నేరచరిత్ర ఉన్నా, ఆ ఆధారాలు దొరకని కారణంగా వారి పేర్లను ప్రకటించ లేకపోవచ్చు. ఆధారాలతో వివరాల నందజేస్తే, అవి వాస్తవమని తేలితే, వారిని నేరచరితులుగా ప్రకటించవచ్చు. ఆ బాధ్యత ఆరోపణలు చేసే వ్యక్తులది, పార్టీలది. ఈ ప్రయత్నంలోని నిష్పాక్షికత, చిత్తశుద్ధి ప్రజలకు స్పష్టంగా తెలిశాయి. రాష్ట్రంలో ప్రజల నుంచి నేరమయ రాజకీయానికి పెద్దయెత్తున వ్యతిరేక ఎదురయింది. దేశవ్యాప్తంగా ఎన్నికల నిఘా ఉద్యమానికి విస్తృత ప్రచారం లభించింది. ఆ నేపథ్యంలో కొందరు మిత్రులు ప్రజాస్వామ్య సంస్కరణల సంఘం (ఏడీఆర్) అనే పేరుతో ఢిల్లీ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. నేరచరితుల వివరాలను తెలుసుకునే హక్కు ప్రజలకుందని, వాటిని సేకరించి ప్రజల ముందు పెట్టే బాధ్యత ఎన్నికల సంఘానిదని, ఆ విధంగా ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని ఆ దరఖాస్తులో వేడుకున్నారు. అందుకు ఆధారంగా ప్రధానంగా 'లోక్‌సత్తా' ఎన్నికల నిఘా ఉద్యమంలో విడుదల చేసిన నేరచరితుల జాబితాను, అందుకు అనుసరించిన ప్రమాణాలను, పద్ధతులను కోర్టులో సాక్ష్యంగా అందజేశారు. ఆ వాదనలు విన్నాక ఢిల్లీ హైకోర్టు 2000 నవంబరు 2న.. అభ్యర్థుల నేరచరిత్రను, వారి వ్యక్తిగత, కుటుంబ ఆస్తిపాస్తుల వివరాలను, వారి అర్హతల సమాచారాన్ని సేకరించి ప్రజల ముందు ఉంచాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశిస్తూ తీర్పునిచ్చింది. ఆ తీర్పుపైన కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పీలు చేసింది. కాంగ్రెస్ పార్టీలాంటి ప్రధాన రాజకీయ పక్షాలు కేంద్ర ప్రభుత్వానికి వంత పలికాయి. అభ్యర్థుల వివరాలను ప్రజల ముందు పెడితే వారి వ్యక్తిగత హక్కులకు భంగం కలుగుతుందని వారంతా వాదించారు. సుప్రీంకోర్టు వారి వాదనలను కొట్టిపారేసింది. చివరికి మే 2న ఓ చరిత్రాత్మకమయిన తీర్పు వెలువడింది.

### తోడేళ్ల మధ్య పోరాటం

ఈ ఉదంతం మొత్తాన్ని పరిశీలిస్తే నాలుగు పాఠాలు మనకు తెలిసివస్తాయి. మొదటిది మన సమాజంలో అంతులేని నిస్పృహ కానవస్తోంది. పరిస్థితులను మార్చే ప్రయత్నం చేయక, ఎంతసేపటికి విమర్శలతో, గుండెలు బాదుకోవడంతో కాలం గడిపేస్తున్నాం. అలాకాక, నిర్దిష్ట లక్ష్యాలతో, నిష్పాక్షికతతో, స్పష్టమయిన పద్ధతులతో, పారదర్శకంగా పౌరసమాజం ఓపిగ్గా కృషి చేసే ఫలితాలు వచ్చి తీరతాయి. సుప్రీంకోర్టు తీర్పు కేవలం 'లోక్‌సత్తా' ఉద్యమం చేసిన ప్రయత్నం వల్ల, కొందరు మిత్రులు దాన్ని ఆసరాగా చేసుకుని కోర్టులో కేసు నడపటం వల్ల సాధ్యమయింది. మహాత్మాగాంధీ చెప్పినట్లుగా కొద్దిమంది పౌరులు అంతులేని ఆర్తితో, మొక్కవోని ధైర్యంతో, చిత్తశుద్ధితో ప్రయత్నం చేస్తే ప్రపంచాన్ని మార్చగలరు. నిరాశ వల్ల, నిస్పృహ వల్ల మనం సమస్యలో భాగమవుతాం కాని, పరిష్కారాన్ని సాధించలేం. ఎన్నికల నిఘా వల్ల, నేరచరితుల జాబితాలను బయటపెట్టడం వల్ల, ఆంధ్రప్రదేశ్ రాజకీయంలో కొంతమేరకు నేరచరితుల ప్రభావం తగ్గింది. ఇప్పటికే రాజకీయంలో బలపడి, తమ నేరచరిత్రను చెరిపివేసుకుని, నాయకులుగా స్థిరపడిన వారిని నిర్మూలించడం ఈ ప్రయత్నం వల్ల సాధ్యంకాలేదు. కాని నేరచరితులు కొత్తగా రాజకీయంలో ప్రవేశించడాన్ని నిరోధించగలిగాం. అలాంటి వ్యక్తులను అక్కున చేర్చుకుని, పార్టీ సభ్యత్వాన్నిచ్చి, ఎన్నికలలో పోటీకి నిలబెట్టాలన్న కోరిక ఉన్నా ప్రజలలో చులకనయిపోతామనే భయంతోను, బలమయిన పౌరసమాజం ప్రతిఘటిస్తుందన్న స్పృహతోను నేరస్తులను కొత్తగా రాజకీయంలోకి తీసుకోవడాన్ని ప్రధాన పార్టీలు నిలిపివేశాయి. ఆ విధంగా నేర రాజకీయం కొంతమేరకు తగ్గుముఖం పట్టింది. ఇది పౌరసమాజం సాధించిన ఘనవిజయం. అలాగే సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ తీర్పు కేవలం పౌరుల ప్రయత్నాల వల్ల సాధ్యమయిందే కానీ రాజకీయ నాయకుల సంకల్పం వల్ల కాదు. ఈ ఉదంతం నుంచి నేర్చు కోవలసిన రెండో గుణపాఠం రాజకీయ పార్టీల, ప్రభుత్వాల తీరుకు సంబంధించినది. ప్రస్తుతం పార్లమెంటు ఉభయసభలలో అధికార కూటమి, ప్రతిపక్షాలు హోరాహోరీగా పోరాడు తున్నాయి. గుజరాత్ సంఘటనలపై రెండు వర్గాలు నిగవట్లు పట్టు

కుంటున్నాయి. 'త్వంశుంఠ' అంటే 'త్వంశుంఠ' అని పరస్పర దూషణలకు పాల్పడుతున్నాయి. విచిత్రమేమంటే అభ్యర్థుల వివరాలను ప్రజల ముందు పెట్టడాన్ని కేంద్ర ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ నిర్లజ్జగా, బహిరంగంగా వ్యతిరేకించాయి. అంటే పార్టీల మధ్య పోరాటం కేవలం– ప్రజలను దోచుకునే అధికారం ఎవరికుండాలనే అంశాన్ని గురించి మాత్రమే. మనం ఈ విషయాన్ని గమనించక అమాయకంగా మోసపోతున్నాం. పార్టీల మధ్య పోరాటం మేకపిల్లను తినే హక్కు కోసం తోడేళ్ల మధ్య జరిగే పోరాటం లాంటిది. ప్రజాసంక్షేమం, ప్రజాస్వామ్య విలువలు, స్వచ్ఛమయిన ఎన్నికల ఆవశ్యకత ప్రధాన రాజకీయ పక్షాలకు పట్టడం లేదు. ఈ విషయాన్ని అర్థం చేసుకోలేక ఎందరో అమాయక పౌరులు పార్టీల పేరుతో జరుగుతున్న అధికార యజ్ఞంలో బలిపశువులవుతున్నారు. ఎందరో సామాన్యులు పార్టీలలో సాధారణ సభ్యులుగా ఉంటూ పల్లకీలు మోయడానికి సిద్ధమవుతున్నారు. ఏదో ఒకరకంగా ఎన్నికలలో విజయం సాధించడం కోసం, గెలిచాక అధికారాన్ని అడ్డదారి తొక్కి అయినా నిలుపుకోవడం కోసం, ఎన్నికలలో, రాజకీయాల్లో పెట్టుబడులు పెట్టి అంతకు పదింతలు రాబట్టుకోవటానికి మాత్రమే ప్రధాన రాజకీయ పార్టీలు ఉన్నాయి. అంతేకాని ప్రజలకు సేవ చేసేందుకు మాత్రం కాదు.


మనం నేర్చుకోవలసిన మూడో పాఠం మన ప్రజాస్వామ్యంలో రాజ్యాంగ బద్ధమయిన సంస్థల పాత్రను గురించి. చట్టసభ, ప్రభుత్వం, న్యాయవ్యవస్థ– ఈ మూడూ ప్రజల సేవ కోసం ఉన్నాయి. మూడింటికి నిర్దిష్టమయిన పాత్ర ఉంది. చట్టసభ పని చట్టాలను రూపొందించి ఆమోదించడం, ప్రభుత్వ చర్యలపైన నిఘా వేయడం, ప్రభుత్వం పని చట్టాలను నిష్పాక్షికంగా అమలు చేయడం, కొత్త చట్టాలను ప్రతిపాదించడం, పాలనా యంత్రాంగంతో సమర్థంగా, నిజాయతీగా పనిచేయించడం, విధానాలు రూపొందించడం. న్యాయవ్యవస్థ పని తగాదాలను పరిష్కరించడం, రాజ్యాంగానికి, చట్టాలకు భాష్యం చెప్పడం, న్యాయ నిర్ణయం చేయడం. రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా చట్టాలను తయారుచేయడంలో చట్టసభ సఫలీకృతం కానట్లయితే, ప్రజా సంక్షేమం దృష్ట్యా– రాజ్యాంగానికి లోబడి విధానాలను రూపొందించి అమలు చేయడం ప్రభుత్వ బాధ్యత. చట్టసభ, ప్రభుత్వం రెండూ ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడంలో విఫలమయితే ఏర్పడే ఖాళీని భర్తీ చేయడానికి న్యాయస్థానాలు జోక్యం చేసుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం దేశంలో జరుగుతున్నది అదే. ఎవరి పని వారు చేస్తే న్యాయస్థానం జోక్యం అవసరమయ్యేదే కాదు. ఈ మాటనే సుప్రీంకోర్టు మే 2 తీర్పులో విస్పష్టంగా చెప్పింది. తాత్కాలికంగా ఒకరి వైఫల్యాన్ని మరొకరు సరిదిద్దవచ్చు కాని అది శాశ్వత పరిష్కారం కాదు. రాజ్యాంగబద్ధమైన ప్రతి సంస్థ, వ్యవస్థ తన బాధ్యతను తాను నిర్వర్తించేలా ప్రజల నుంచి నిరంతర నిఘా, ఒత్తిడి ఉండాలి. లేకపోతే ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించలేం, స్వేచ్ఛను కాపాడుకోలేం.

### ఇల్లు అలకగానే పండుగ కాదు

ఇక నాలుగో పాఠం.. ఇదో చిన్న మెట్టు మాత్రమే. సుప్రీంకోర్టు తీర్పుతోనే రాజకీయంలో నేరచరితుల ప్రభావం అంతరిస్తుందని, ఎన్నికలు స్వేచ్ఛగా జరుగుతాయని, పాలన స్వచ్ఛంగా ఉంటుందని భావిస్తే పొరపాటు. ఈ తీర్పును ఎన్నికల సంఘం సమర్థంగా అమలు చేయాలి. పార్టీలు పూర్తిగా సహకరించాలి, సమాచారం ఓటర్లకు పూర్తిగా అందాలి, పత్రికలు దానికి బహుళ ప్రచారాన్నివ్వాలి, ఓటర్లు విజ్ఞతతో తీర్పునిచ్చి, నేరచరితుల్ని నిలబెడితే ఓటమి తప్పదన్న భయాన్ని పార్టీలలో కలిగించాలి. నేరచరితుల్ని నిషేధిస్తూ మరింత బలమైన చట్టం రావాలి. న్యాయ సంఘం, ఎన్నికల సంఘం, లోక్‌సత్తా ఉద్యమం, రాజ్యాంగ సమీక్ష సంఘం నిర్దిష్టమైన ప్రతిపాదనలను ఇందుకోసం రూపొందించాయి. ఈ చట్టం ఒక్కటే చాలదు. ఎన్నికలలో అక్రమార్జనకు, అధిక వ్యయానికి తెరపడాలి. అందుకు నిర్దిష్ట చట్టం కావాలి. ఈ అంశంపైన లోక్‌సత్తా ఉద్యమం సవివరమైన ప్రతిపాదనలను, నమూనాను రూపొందించి అన్ని పార్టీలకు, రాజ్యాంగ సంస్థలకు పంపింది. వాటి నుంచి ప్రతిస్పందన లేదు. ఒక్క ఎన్నికల తీరు మారడానికే ఇన్ని మార్పులు కావాలి. అంతకుమించి రాజ్య వ్యవస్థలోని లోపాలను సవరించాలంటే మరెన్నో నిర్దిష్ట పరిష్కారాలు కావాలి. ఇదో సుదూర ప్రయాణం. దీర్ఘకాలిక లక్ష్యాల్ని విస్మరించి తాత్కాలిక విజయాలకు సంబరపడితే ఫలితాలు సాధించలేం. లక్ష్యం ఎంత పెద్దదయినా ఆ మార్గంలో ప్రతి చిన్న మజిలీకి విలువ ఉంటుంది. మే 2న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఈ సుదూర ప్రయాణంలో ఓ మంచి మజిలీ, భారత ప్రజాస్వామ్య పరిణామక్రమంలో ఓ ఆహ్వానించదగ్గ సోపానం, మన రాజ్యవ్యవస్థ నైతిక పునరుజ్జీవనంలో ఓ గర్వించదగ్గ ఘట్టం.

*(జేపీ 'భవిష్యత్ భారతం' కాలమ్‌లో భాగంగా మే 6, 2002న ఈనాడులో ప్రచురితమైన వ్యాసం)* ◆

# ప్రజాస్వామ్య ప్రక్షాళనకు అరుదైన అవకాశం!



- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్

మార్చి 13న సుప్రీంకోర్టు వెలువరించిన చరిత్రాత్మకమైన తీర్పు ప్రజాస్వామ్య పరిణామక్రమంలో ఓ మైలురాయి. ఈ తీర్పు పూర్వాపరాలు ఆసక్తికరం. 2002 మే 2న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును, దానికి అనుగుణంగా ఎన్నికల సంఘం జారీ చేసిన ఆదేశాలను నిర్వీర్యం చేసే ఉద్దేశంతో భారత ప్రభుత్వం ఆగస్టులో ఓ ఆర్డినెన్సును జారీ చేసింది. ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థుల నేరచరిత్రను, వారి కుటుంబ సభ్యులందరి ఆర్థిక వివరాలను ప్రజల ముందుంచాలని, వాటిని తెలుసుకోవడం ప్రజల ప్రాథమిక హక్కు అని సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. అయితే అఖిలపక్ష సమావేశాలలో పార్టీలన్నీ దానిని వ్యతిరేకించాయి. ఆ తరువాత కొన్నాళ్లకు- కాంగ్రెస్ పార్టీ సుప్రీంకోర్టు తీర్పునకు మద్దతిస్తున్నట్టుగా ఓ ప్రకటన చేసింది. ఆర్డినెన్సును నిలువరించాల్సిందిగా రాష్ట్రపతికి విజ్ఞప్తి చేయడానికిగాని, నిర్ద్వంద్వంగా ఆర్డినెన్సును వ్యతిరేకించటానికిగాని కాంగ్రెస్ పార్టీ అంతగా చొరవ తీసుకోలేదు. ఆ ఆర్డినెన్సులో అభ్యర్థుల నేరచరిత్రను ప్రకటించే కొన్ని ఏర్పాట్లు చేశారుగాని, అభ్యర్థుల ఆర్థిక వివరాలను గురించి ప్రస్తావన మాత్రం లేదు. ఆ చట్టం నిర్దేశించిన మేరకు తప్ప, మరే వివరాలను ప్రకటించాల్సిన అవసరం లేదని, కోర్టు తీర్పులనుగాని, ఎన్నికల సంఘం ఆదేశాలనుగాని ఖాతరు చేయాల్సిన అవసరం లేదని ప్రతిపాదించారు. ఆగస్టు 16న 'లోక్‌సత్తా' ఆధ్వర్యంలో జాతీయ ఎన్నికల సంస్కరణల వేదిక పేరుతో దేశంలో పేరెన్నికగన్న చాలామంది పార్టీరహిత ప్రజాస్వామ్యవాదులు రాష్ట్రపతి అబ్దుల్ కలాంను కలిసి ఆ ఆర్డినెన్సు ప్రాథమిక హక్కులను ఉల్లంఘిస్తోందని, రాజ్యాంగంలో 13వ అధికరణ మేరకు అలాంటి చట్టం చేసే అధికారం పార్లమెంటుకు లేదని, కాబట్టి అది రాజ్యాంగ విరుద్ధమని నివేదించారు. రాజ్యాంగ విరుద్ధమైన చట్ట ప్రతిపాదన వచ్చినప్పుడు, దాన్ని మంత్రివర్గానికి పంపి పున:పరిశీలించమని కోరే అధికారం రాష్ట్రపతికి ఉంది. రాజ్యాంగంలో 74వ అధికరణ మేరకు మంత్రివర్గం తన సిఫారసును మళ్లీ పంపితే దాన్ని ఆమోదించటం మినహా రాష్ట్రపతికి గత్యంతరం లేదు. ఈ రాజ్యాంగపరమైన అంశాలను గమనించి, 143వ అధికరణం కింద సుప్రీంకోర్టు అభిప్రాయానికి నివేదించాల్సిందిగా మేమంతా ఆనాడు రాష్ట్రపతికి విజ్ఞప్తి చేశాం. సుప్రీంకోర్టు నిర్వచించిన ప్రాథమిక హక్కులను ఉల్లంఘిస్తున్న కారణంగాను, అది కేవలం సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును నిర్వీర్యం చేసేందుకు తయారయిన చట్టమయినందున, దాన్ని కోర్టుకు నివేదించటం భావ్యమని మేము భావించాం. అయితే రాష్ట్రపతి దాన్ని ఆగస్టు 22న ప్రభుత్వానికి తిప్పిపంపటం... కేంద్ర మంత్రివర్గం మళ్లీ సమావేశమై రాష్ట్రపతి సందేశాన్ని, ఆయన సూచనలను బేఖాతరు చేసి యధాతథంగా ఆర్డినెన్సును ఆమోదించాల్సిందిగా సిఫారసు చేయటం... వెంటనే ఆగస్టు 24న రాష్ట్రపతి దాన్ని చట్టంగా ఆమోదించటం జరిగాయి. దాన్నే ఆ తరవాత కొద్దిపాటి మార్పులతో పార్లమెంటు డిసెంబరులో ఆమోదించింది. ఆ పరిస్థితులలో ప్రజాస్వామ్యవాదుల ముందు ఆ చట్టాన్ని ప్రతిఘటించటానికి రెండు శాంతియుత మార్గాలున్నాయి. మొదటిది రాజ్యాంగ విరుద్ధమైన 33-బి సెక్షను చెల్లదని సుప్రీంకోర్టు ముందు వాదించటం. రెండోది ఓటర్లకు పూర్తి

సమాచారం తెలుసుకునే హక్కు ఉండాలని ప్రజాభిప్రాయాన్ని కూడగట్టడం. ఆ విధంగానే 'లోక్‌సత్తా' సుప్రీంకోర్టులో ఆ చట్టం రాజ్యాంగబద్ధతను ప్రశ్నిస్తూ పిటిషన్ దాఖలు చేసింది. మరో రెండు సంస్థలు కూడా ఆ వ్యాజ్యంలో పాలుపంచుకున్నాయి. సమావేశాలు, సంతకాల సేకరణ, ప్రదర్శనలు, ప్రజా బ్యాలెట్.. ఇలా వివిధ రీతులలో ఆర్డినెన్సుకు వ్యతిరేకంగా 'లోక్‌సత్తా' పెద్దఎత్తున ప్రజాభిప్రాయాన్ని సేకరించింది. ఓటర్లకు అభ్యర్థుల పూర్తి వివరాలు తెలపాలని ప్రజలలో 98 శాతం పైగా కోరారు. పత్రికలన్నీ ముక్తకంఠంతో ఆ చట్టాన్ని నిరసించాయి.

## పార్టీల సందేహాలు

ఆ చట్టంలోని 33-బి సెక్షన్ రాజ్యాంగంలోని 19 (1) అధికరణంలోని ప్రాథమిక హక్కులకు భంగకరమంటూ గతంలో వెలువరించిన తీర్పును అనుసరించి- అభ్యర్థులందరూ తమకు సంబంధించిన అన్ని వివరాలను విధిగా ప్రకటించాలని సుప్రీంకోర్టు ధర్మాసనం మార్చి 13న ఏకగ్రీవంగా తీర్పునిచ్చింది. ఈ తీర్పు పర్యవసానాన్ని గురించి ప్రజలలో స్పష్టమయిన అవగాహన అవసరం. ఈ తీర్పు ప్రకారం అభ్యర్థుల నేరచరిత్ర, వారి ఆర్థిక వివరాలు నామినేషన్ పత్రంతో పాటు ప్రజల ముందుంచాలి. సుప్రీంకోర్టు తీర్పు మేరకు అభ్యర్థులకు గతంలో పడ్డ శిక్షలు, వారిపై కోర్టులలో నేరారోపణ జరిగి విచారణలో ఉన్న కేసులు, అభియోగాలు మోపగా కోర్టు గుర్తించిన కేసులు- ఈ వివరాలన్నింటిని అఫిడవిట్ రూపంలో పొందుపరచాలి. అంటే కోర్టులో గుర్తింపు పొందిన కేసులకు మాత్రమే ఈ తీర్పు వర్తిస్తుంది కాని, కోర్టు గుర్తింపు లేకుండా కేవలం పోలీసులు పరిశోధన చేసే కేసులకు వర్తించదు. కేవలం ఏడాది కాలం, ఆపైన- శిక్ష పడ్డ వివరాలను, కోర్టులో నేరారోపణ జరిగి విచారణలో ఉండి రెండేళ్లు లేదా అంతకుమించి శిక్ష పడే అవకాశం ఉన్న కేసులుంటే వాటి వివరాలను మాత్రం అభ్యర్థులు ముందుగా ప్రకటించాలని చట్టంలో పేర్కొన్నారు. ఇప్పుడు ఈ తీర్పు వల్ల మిగిలిన కేసుల వివరాలు కూడా బహిర్గతం చేయాల్సి ఉంటుంది. చట్టంలో అభ్యర్థుల ఆర్థిక వివరాలను గురించిన ప్రస్తావన లేదు. కోర్టు తీర్పు ప్రకారం అభ్యర్థి, అతని భార్య, లేదా భర్త, కుటుంబ సభ్యులందరికి చెందిన ఆస్తులు, అప్పులు, ప్రభుత్వ ఆర్థిక సంస్థలకు చెల్లించవలసిన బకాయిల వివరాలను ప్రకటించాలి. ఆ మేరకు ఎన్నికల సంఘం రూపొందించిన అఫిడవిట్‌ను సమర్పించాలి. అభ్యర్థుల విద్యార్హతలను కూడా ప్రకటించాలి.

ఈ సమాచారాన్ని బయటపెట్టడాన్ని గురించి పార్టీలలో రెండు సందేహాలున్నాయి. మొదటిది, ఇలా బహిర్గతం చేయటం వల్ల పోటీ చేసే అవకాశం లేకుండా పోతుందనే అపోహ. కోర్టు తీర్పు కేవలం అభ్యర్థుల వివరాలను ఓటర్లకు తెలియజేసేందుకు ఉద్దేశించినది. మన ఇంటో పనిమనిషిని పెట్టుకునేముందు కూడా ఆ వ్యక్తి పూర్వాపరాలను తెలుసుకుంటాం. అలాంటప్పుడు మన తరపున ప్రతినిధి కాగోరే అభ్యర్థి వివరాలు తెలుసుకోవటం మన ప్రాథమిక హక్కుగా న్యాయస్థానం గుర్తించింది. అంతేగాని కోర్టులో కేసులు విచారణలో ఉన్నంత మాత్రాన అభ్యర్థిత్వాన్ని తిరస్కరించే హక్కు అధికారులకు ఉండదు. ప్రజా ప్రాతినిధ్య చట్టంలో 8వ సెక్షను ప్రకారం కొన్ని నిర్దిష్టమయిన నేరాలకు శిక్ష పడ్డవారు, లేదా ఏ నేరానికయినా రెండేళ్లు, లేదా అంతకుమించి జైలు శిక్ష పడ్డవారు ఆ నేరాలను బట్టి మూడేళ్ల నుంచి ఆరేళ్ల పాటు పోటీకి అనర్హులు. ఇప్పుడు కూడా పోటీకి అనర్హత విషయంలో ఆ చట్టమే వర్తిస్తుంది. అంతేగాని కేసుల వివరాలను ప్రకటించినంత మాత్రాన మాత్రమే అభ్యర్థులు పోటీకి అనర్హులు కారు. ఆర్థిక వివరాలు తెలుసుకోగోరటం కేవలం- ఏ మేరకు నిజంగా ఆస్తిపాస్తులను నిజాయతీగా ఆర్జించారు? ప్రకటించిన ఆస్తులకు, వాస్తవంగా అనుభవిస్తున్న వాటికి ఎంతవరకు పొంతన ఉంది? అక్రమార్జన ద్వారా పొందిన అప్రకటిత ఆస్తులున్నాయా?- ఈ ప్రశ్నలకు సమాధానాలు ప్రజలకు తెలియటం కోసం మాత్రమే. ఇక విద్యార్హతలు నిజానికి ఎన్నికల ప్రక్రియలో కీలకమైనవి కావు. అందుకే లోక్‌సత్తాగాని, ఇతర ప్రజాస్వామ్యవాదులుకాని విద్యార్హతల వివరాలను బయటపెట్టాల్సిందిగా కోరలేదు. గతంలో ఎన్నికల సంఘం సూచించిన మేరకు సుప్రీంకోర్టు తన తీర్పులో వాటిని పొందుపరిచింది. విద్యార్హతల వివరాలను బయటపెట్టడం వల్ల పెద్దగా ప్రయోజనం లేకపోయినా, ఆ వివరాలు ప్రజలకు తెలిస్తే నష్టమేమీ లేదు. రెండవది: వాస్తవాలను దాచిపెట్టినా, అసత్యాలు ప్రకటించినా కేవలం చిన్నపాటి పొరపాట్లకే రిటర్నింగ్ అధికారులు నామినేషన్ తిరస్కరిస్తారేమోననే శంక పార్టీలను, నాయకులను తొలుస్తోంది. వాస్తవానికి అలా ఏకపక్షంగా జరిగే అవకాశం లేదు. ఎన్నికల సంఘం గతంలో అలా నామినేషన్లను నిష్కారణంగా తిరస్కరించిన సంఘటనలు దాదాపు లేవు. ఎన్నికల సంఘం 2002 జూన్ 28వ తేదీన జారీ చేసిన ఆదేశంలో 14 (4)వ పేరా ప్రకారం అభ్యర్థులు వాస్తవాలను దాచి పెట్టినా, అసత్య ప్రకటన చేసినా, అది మౌలికమయిన, కీలకమయిన లోపమయినట్లయితే, అది అప్పటికప్పుడు నిర్ద్వంద్వంగా రుజువుకు అనువయినదయితే, సాక్ష్యాధారాలతో సహా రుజువయినట్లయితే మాత్రమే

నామినేషన్‌ను తిరస్కరించే ఆలోచన చేయవచ్చును. కాబట్టి నిష్కారణంగా, పక్షపాతంతో అధికారులు నామినేషన్‌ను తిరస్కరిస్తారనే భయానికి ఆస్కారం లేదు. సందేహ నివృత్తి కోసం మరిన్ని ముందు జాగ్రత్తలు తీసుకుని, అవసరమైతే అలాంటి నామినేషన్ తిరస్కరణపై తక్షణం పైస్థాయిలో అప్పీలు చేసుకునే అవకాశాన్ని కల్పించవచ్చు. అసలు అలా నామినేషన్‌ను తిరస్కరించే అధికారాన్ని తొలగించాల్సిందిగా 'లోక్‌సత్తా' ఎన్నికల సంఘాన్ని కోరింది. బుద్ధిపూర్వకంగా తప్పు అఫిడవిట్‌ను దాఖలు చేస్తే ఎన్నికయ్యాక పదవిని తొలగించేందుకు, కోర్టులో శిక్ష వేసేందుకు, భవిష్యత్తులో అనర్హులను చేసేందుకు ఏర్పాట్లు చేయవచ్చు. కాబట్టి ఈ అంశంపై అందరికీ ఆమోదయోగ్యమయిన పరిష్కారాన్ని కనుక్కోవడం సాధ్యమే. ఎన్నికల సంఘం కూడా ఈ విషయంలో చొరవను ప్రదర్శించి, పార్టీలలో నెలకొన్న భయాందోళనలను తొలగించడం అవసరం.


### రాజకీయ ప్రమాణాలు పెరగాలి

ఈ తీర్పు కారణంగా అపశ్రుతులు దొర్లకుండా జాగ్రత్తలు తీసుకోవటం అవసరం. మన పోరాటం మంచి రాజకీయం కోసమేగాని, రాజకీయానికి వ్యతిరేకంగా కాదు. ఇది ప్రజలకు, పార్టీలకు మధ్య పోరాటంగా మారరాదు. రాజకీయం ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమయిన ప్రక్రియ. అది లేనిదే స్వేచ్ఛమనలేదు. రాజకీయంలోని లోపాలకు విరుగుడు మరింత ఎక్కువ, స్వచ్ఛమయిన రాజకీయం మాత్రమేనని మనమంతా గుర్తించాలి. పార్టీలు, నాయకులు కూడా వ్యవస్థ ప్రక్షాళనకు దీనినొక సువర్ణావకాశంగా భావించాలి తప్ప ఉపద్రవంగా బెంబేలెత్తటం అవివేకం. పార్టీలు, నాయకులు ప్రస్తుత ఎన్నికల వ్యవస్థలో ఓ విషవలయంలో బందీలుగా చిక్కుకున్నారు. ఎందరో నిజాయతీపరులు, జనహితాన్ని కోరేవారు రాజకీయంలో విలువల కోసం అవిశ్రాంత పోరాటం చేస్తున్నారు. ఎన్నికలలో అక్రమాలు, అపారంగా నల్లధనం ఖర్చు, నేరస్తుల ప్రమేయం రాజకీయాలను అప్రతిష్ఠపాలు చేస్తున్నాయి. అలాంటి వాటన్నింటినీ దూరంగా పెడితే ఓడిపోతామేమోననే భయంతో, గెలుపు మీద ఆశతో పార్టీలు నేరచరితులను, అక్రమార్జనపరులను అక్కున చేర్చుకోవలసి వస్తోంది. ఇలా అభ్యర్థుల వివరాలను బయటపెడితే నేరచరితులను, అవినీతిపరులను ఎన్నికలకు దూరంగా ఉంచటం సులభమవుతుంది. కాబట్టి రాజకీయాలను ప్రక్షాళన చేసి ప్రజలలో ప్రజాస్వామ్యం పట్ల విశ్వాసాన్ని పెంచటానికి ఇదో మహదవకాశం. ఈ అంశాన్ని కోర్టులకు, చట్టసభలకు మధ్య అధికారాల విషయంలో వివాదంగా పరిగణించటం అవివేకం. ప్రజలెన్నుకున్న చట్టసభకు శాసననిర్మాణంలో తుది నిర్ణయాధికారం ఉంది. రాజ్యాంగానికి భాష్యం చెప్పటంలో, ప్రాథమిక హక్కులను రక్షించటంలో న్యాయస్థానాలకు బాధ్యత ఉంది. ఎవరి పరిధులలో వారు నిర్ణయాలు చేసినప్పుడే వ్యవస్థ సజావుగా నడుస్తుంది. ఈ కేసులో కోర్టు తీర్పు పూర్తిగా న్యాయవ్యవస్థ పరిధికి లోబడినదే. మరికొన్ని ఇతర అంశాలలో న్యాయస్థానాల తీరు వివాదాస్పదంగా మారిన మాట వాస్తవం. న్యాయమూర్తుల నియామకంలో ప్రభుత్వానికేమీ ప్రమేయం ఉండరాదంటూ సుప్రీంకోర్టు గతంలో అసంబద్ధమయిన తీర్పులను ఇచ్చింది. ప్రపంచంలో మరే ప్రజాస్వామ్యంలోను ఇలాంటి విడ్డూరం లేదు. అలాగే కేవలం ప్రభుత్వం నిర్ణయించవలసిన అంశాలలో న్యాయస్థానాలు తరచూ జోక్యం చేసుకుంటున్నాయని చాలామంది పరిశీలకుల భావన. ఈ అపసవ్య ధోరణులను సరిచేయటానికి ఏర్పాట్లు అవసరం. నిజానికి నాయకుల ప్రతిష్ఠ సమాజంలో దిగజారిన కారణంగానే అనవసర విషయాలలో జోక్యం చేసుకునే అవకాశం న్యాయవ్యవస్థకు కలిగింది. ఇప్పుడు నూటికి 98 మంది ప్రజలు సుప్రీంకోర్టు తీర్పును సమర్థిస్తున్నారు. ఇలాంటి అంశంపైన ప్రజాభిప్రాయాన్ని వ్యతిరేకిస్తే రాజకీయాల ప్రతిష్ఠ మరింత దిగజారుతుంది తప్ప పెరగదు. ప్రజాస్వామ్య ప్రక్షాళనకు మరెన్నో చర్యలు చేపట్టాలి. ఎన్నికలలో సమూల సంస్కరణలు, అధికార వికేంద్రీకరణ, సత్వర న్యాయం కోసం సమర్థ చర్యలు, ప్రజల సాధికారత కోసం, పాలకుల జవాబుదారీతనం కోసం ఏర్పాట్లు- ఇవన్నీ సంక్షోభ పరిష్కారానికి అవసరం. కేవలం అభ్యర్థుల వివరాల ప్రకటనతోనే అన్ని సమస్యలు పరిష్కారమవుతాయనుకోవటం అజ్ఞానం. ప్రజల చైతన్యం, క్రియాశీల స్వభావం, అన్యాయాన్ని నిర్భయంగా ప్రశ్నించే తత్వం- ఇవన్నీ ప్రజాస్వామ్యానికి కీలకం. అలాగే- శాంతియుతంగానే అవసరమైన మార్పులను తీసుకురావచ్చునన్న విశ్వాసం మన వ్యవస్థను రక్షిస్తుంది. ఎన్ని ఎన్నికలు వచ్చినా, ఎన్ని పోరాటాలు చేసినా- అవినీతి అంతానికి, రాజకీయ ప్రక్షాళనకు కావలసిన మార్పులు సాధ్యంకావనే నిస్పృహ ప్రజలలో పెరిగితే అది హింసకు, రక్తపాతానికి, నియంతృత్వ ధోరణులకు దారితీస్తుంది.

*(జేపీ 'భవిష్యత్ భారతం' కాలమ్‌లో భాగంగా మార్చి 17, 2003న ఈనాడులో ప్రచురితమైన వ్యాసం).* ◆

# అవినీతి అధికారులకు 'అచ్ఛే దిన్'

- నిస్సార్ ఫాతిమా




అవినీతి నిరోధక చట్టం (సవరణ) 2018 ప్రతిపక్షాల నుండి ఎటువంటి ప్రతిఘటనా లేకుండా పార్లమెంటులో ఆమోదించబడడం దురదృష్టకరం. అవినీతి అధికారులకు రక్షణ కల్పించి సామాన్య ప్రజానీకాన్ని శిక్షించడానికి అధికార, ప్రతిపక్షాలు కలిసి పనిచేశాయి. ప్రజాప్రతినిధులను ఎన్నుకున్న పాపానికి వారు ప్రజలకి వేసిన శిక్ష ఇది. ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమైన ఈ చట్టసవరణ వల్ల బాధ్యతాయుతంగా పనిచేయని అధికారులకు గతిలేక లంచం ఇచ్చిన బాధితులు (ప్రజలు) శిక్షకు గురవుతారు, లంచం తీసుకున్న దోషులైన అధికారులు స్వేచ్ఛగా తప్పించుకుంటారు.

అంతర్జాతీయ పారదర్శకత సంస్థ వారి అధ్యయనం ప్రకారం ప్రతి 10 మంది భారతీయుల్లో ఏడుగురు (69 శాతం) ప్రభుత్వ సేవలు పొందడానికి లంచం ఇస్తున్నారు, ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో, ఆస్పత్రుల్లో. దాదాపు 40 శాతం మంది ప్రజలు దేశంలో అవినీతి పెరిగింది అని విశ్వసిస్తున్నారు. ఈ నేపథ్యంలో.. బాధిత ప్రజలను ఇంకా శిక్షించే ధోరణుల్ని ఆపాలి, లంచం లేకుండా నిర్ణీత గడువులోగా ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల్లో సేవలని హక్కుగా అందించేలా వ్యవస్థని బాధ్యతాయుతంగా తీర్చిదిద్దాలి.

మొదటగా, అవినీతి నిరోధక చట్టంలో లాలూచీ – బలవంతపు అవినీతికి మధ్య స్పష్టమైన వ్యత్యాసం లేదు. అవినీతి నిరోధక చట్టం సెక్షన్ 8 లంచం ఇవ్వడాన్ని స్వతంత్ర నేరపూరిత చర్యగా పరిగణిస్తుంది. ప్రభుత్వం నుంచి అనుచిత సేవలను పొందడానికి ప్రభుత్వ అధికారులను ప్రేరేపించడాన్ని నేరంగా పరిగణిస్తుంది. ఈ చట్టంలో లంచం ఇచ్చే వ్యక్తి.. ఇచ్చే ముందు అవినీతి నిరోధక శాఖ అధికారులను సంప్రదిస్తే అతను/ఆమె శిక్షార్హులు కారు. కానీ వాస్తవికంగా చూసినట్టయితే, ఒక సామాన్య పౌరుడు ఎక్కడో దూరాన ఉన్న అవినీతి నిరోధక శాఖను ఎలా సంప్రదించగలడు? ప్రభుత్వ కార్యాలయాల్లో సర్వవ్యాప్తమయిన అవినీతిపై నిస్సహాయురాలైన సాధారణ పౌరురాలు పోలీసులను ఎలా సంప్రదించగలదు?

భారతదేశంలో అధికార వ్యవస్థ ఎంత అడ్డదిడ్డంగా, జవాబుదారీతనంలేకుండా ఉందంటే.. దీనివల్ల 90 శాతం పౌరులు బలహీనులుగాను, రక్షణలేనివారుగాను, చిన్నస్థాయి ప్రభుత్వ కార్యాలయంలో కూడా లంచం, సిఫారసు లేకుండా ప్రభుత్వ సేవలని పొందలేనివారుగాను నిస్సహాయులుగా ఉన్నారు. చట్ట సవరణనేమో అవినీతి అధికారులకు రక్షణ కల్పించి, నిస్సహాయులైన అశేష పౌరులను శిక్షించేలా ఉంది. ఇది పార్లమెంటు శాసనకర్తల, ప్రభుత్వ నైతికతకు, విశ్వసనీయతకు తీవ్రమైన దెబ్బ అనటంలో సందేహం లేదు.

బాధిత నిస్సహాయులను శిక్షించటానికి బదులు, ప్రభుత్వ అధికారులతో సమర్థవంతంగా, నిష్పక్షపాతంగా విధులు నిర్వహింప చేసేలా వ్యవస్థను చేస్తే సరైన పరిష్కారం చూపించినట్టవుతుంది. ఇంకోవైపు చూసినట్టయితే, ప్రభుత్వం ఏదో ఒక స్కీమును అమలు చేయాలనే పాతకాలపు చిట్కాతో బండి లాగించాలని చూస్తోంది తప్ప.. హక్కుగా 'పౌర సేవల' చట్టాన్ని తీసుకురావడానికి ప్రయత్నించడం లేదు.

రెండో పరిపాలనా సంస్కరణల సంఘం సూచనల ప్రకారం, లాలూచీ అవినీతి ఆరోపణల విషయంలో నిర్దోషిత్వాన్ని రుజువు చేసుకోవాల్సిన బాధ్యత నిందితుని మీద ఉండాలి. నేర నిరూపణ జరిగితే శిక్ష అనేది రెండింతలు ఉండాలి. కానీ పార్లమెంటరీ సంఘం ఈ సిఫార్సులను పరిగణలోకి తీసుకోలేదు.

అవినీతి నిర్మూలనకు ఈ చట్ట సవరణ ఏమాత్రం ఉపయోగపడకుండా, అవినీతి అధికారులు ప్రత్యేకంగా లంచం తీసుకుంటూ పట్టుబడినప్పుడు మాత్రమే వారి మీద విచారణ చేపట్టడానికి చర్యలను పొందుపరిచింది. మిగతా విషయాల్లో అవినీతి అధికారులకు రక్షణ కల్పిస్తుంది. అంతేకాకుండా, ఈ

## చట్టంలో మార్పుల క్రమం

- 1998 అవినీతి నిరోధక చట్టం ప్రకారం ఏ ప్రభుత్వాధికారిపైన ఉన్న ఆరోపణలనైనా దర్యాప్తు సంస్థలు ఎటువంటి అనుమతులూ అవసరం లేకుండానే పూర్తి స్వేచ్ఛతో విచారణ చేయవచ్చు. దర్యాప్తునకు ముందస్తు అనుమతి ప్రస్తావన ఇక్కడ లేదు. అయితే, అవినీతి నిరోధక చట్టంలోని 19 (1), సీఆర్‌పీసీ సెక్షన్ 197లు.. ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులపై దర్యాప్తునకు సంబంధించి ముందస్తు అనుమతిని ప్రస్తావించాయి.
- 2003లో సీబీఐకి సంబంధించిన ఢిల్లీ స్పెషల్ పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్, 1946లో సెక్షన్ '6 ఎ'ను చేర్చారు. ఈ సెక్షన్ ప్రకారం.. జాయింట్ సెక్రటరీ, ఆపై స్థాయి అధికారులపై అవినీతి నిరోధక చట్టం కింద దర్యాప్తు చేపట్టాలంటే.. ప్రభుత్వం నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలి.
- 2014లో సుబ్రహ్మణ్య స్వామి వర్సెస్ సీబీఐ తదితరుల కేసులో సుప్రీంకోర్టు తీర్పునిస్తూ.. 6 ఎ రాజ్యాంగ విరుద్ధం, చట్టబద్ధ పాలనకు వ్యతిరేకమని ఆ సెక్షన్‌ని కొట్టివేసింది.
- ముందస్తు అనుమతిని ప్రభుత్వ మాజీ అధికారులకు కూడా వర్తింప చేసేందుకు, అవినీతి అధికారుల ఆస్తుల జప్తునకు 2008లో పీసీ చట్టం సవరణ బిల్లును ప్రవేశపెట్టారు. కానీ ఈ బిల్లు మురిగిపోయింది.
- తిరిగి 2013లో సవరణ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టారు. ఐక్యరాజ్యసమితి 2005లో చేసిన అవినీతి వ్యతిరేక తీర్మానానికనుగుణంగా ఈ బిల్లును రూపొందించారు. ఐరాస తీర్మానంపై 2011లో భారత్ సంతకం చేసింది.
- 2014లో అవినీతి నిరోధక చట్ట సవరణ బిల్లును పార్లమెంటు స్టాండింగ్ కమిటీకి పంపారు. 2014, ఫిబ్రవరి 6న కమిటీ నివేదికను ఇచ్చింది.
- ప్రభుత్వ కలాపాల్లో సామర్థ్యాన్ని పెంచేందుకు, నిజాయతీతో కూడిన చర్యలకు రక్షణ కల్పించడం ద్వారా ఉన్నతాధికారులకు ప్రోత్సాహాన్నిచ్చేందుకు తగిన చర్యలుండాలన్న లా కమిషన్ నివేదిక మేరకు.. 2013 బిల్లులో పలు మార్పుల్ని చేశారు.
- 2015లో ఈ బిల్లును రాజ్యసభ సెలెక్ట్ కమిటీకి పంపారు. ఆగస్టు 12, 2016న కమిటీ నివేదిక ఇచ్చింది.
- ఈ పునస్సమీక్షించిన బిల్లునే 2018లో అవినీతి నిరోధక చట్టం (సవరణ), 2018గా ఆమోదించారు. కొత్త చట్టం రాజ్యసభ సెలెక్ట్ కమిటీ రిపోర్టు ఆధారంగానే వచ్చింది.

చట్టసవరణ వల్ల భవిష్యత్తులో పదుల వేల సంఖ్యలో కేసులు ముందస్తు అనుమతి కోసం పేరుకునిపోయి, దోషుల నిర్ధారణలో, ప్రభుత్వ సేవల్లో కూడా విపరీత జాప్యం జరిగే అవకాశముంది. సుమారు రెండు కోట్ల మంది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులున్న ఈ దేశంలో.. సీబీఐ, రాష్ట్రాల్లో ఏసీబీ (అవినీతి నిరోధక సంస్థ)ల నుంచి ముందస్తు అనుమతులంటే, మొత్తం అవినీతి నిరోధక వ్యవస్థంతా నిశ్చేష్టమవుతుంది.

పలు రాష్ట్రాల్లోని సమాచారం ప్రకారం, ప్రభుత్వాలు స్పష్టమైన ఆధారాలు అందుబాటులో ఉన్నప్పటికీ కేసుల విచారణకు ముందస్తు అనుమతినివ్వకుండా ప్రభుత్వాలు అభ్యర్థలను తొక్కిపడుతున్నాయి. దర్యాప్తు అనుమతికి సంబంధించిన పనిభారాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోయాలని ఆశించటం సహేతుకం కాదు. ముందస్తు అనుమతి లేకుండా, ఒక గుమాస్తా లేదా కిందిస్థాయి ప్రభుత్వోద్యోగి మీద సాధారణ దర్యాప్తు కూడా చేయడం సాధ్యం కాదంటే.. విచారణ నత్తనడకలా తయారై ప్రజలు ప్రభుత్వం మీద విశ్వాసాన్ని కోల్పోతారు. అవినీతి అధికారులు మరింత బరితెగించి చెలరేగుతారు. దర్యాప్తు సంస్థలను బలహీనపరిచి, కేంద్ర, రాష్ట్ర సంస్థలపై భారంగా తయారవుతుంది. అవినీతిపై పోరాటం కాస్తా.. అయ్యవార్ని చేయబోతే ఏదో అయినట్టవుతుంది.

అంతేకాకుండా, దేశం మొత్తమ్మీద లంచం ఇచ్చిన నిస్సహాయ ప్రజల్ని శిక్షించాలి అంటే.. మన పోలీసులు, ప్రాసిక్యూషన్, కోర్టులకు అసాధ్యమవుతుంది. దేశంలో ఉన్న 3.5 లక్షల జైలు గదులు చాలవు. మనదేశంలోని జైళ్ల సామర్థ్యం మొత్తం కలిపినా, ఒక రోజు లంచం ఇచ్చేవారి సంఖ్య కన్నా తక్కువే.

- సుమారు 6,358 అవినీతి కేసులు వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్నాయి. 178 కేసులపై 20 ఏళ్లకు పైబడి విచారణ కొనసాగుతోంది.
- 1915 కేసులు ఐదు నుంచి పది సంవత్సరాలుగా, 1425 కేసులు పది సంవత్సరాలకు పైబడి విచారణలో మగ్గుతున్నాయి.
- 1883 కేసులు మూడు సంవత్సరాలుగా విచారణలో ఉన్నాయి. 957కు పైగా కేసులు మూడు నుంచి ఐదు సంవత్సరాలుగా కోర్టుల్లో ఉన్నాయి.

రెండోది, ముందస్తు అనుమతి లేకుండా ప్రభుత్వాధికారి తన బాధ్యతల్లో భాగంగా తీసుకున్న నిర్ణయంపై ఆరోపణలు వస్తే, ఆ అధికారికి రక్షణ కల్పించాలన్న సిఫారసును పీసీ చట్టం పట్టించుకోలేదు. దీనివల్ల చిత్తశుద్ధితో తీసుకున్న నిర్ణయాలపై కూడా కక్షపూరిత విచారణలు జరిగి ఉన్నతస్థాయిలో నిర్ణయాలు తీసుకునే చొరవ కొరవడి విధానపరమైన వైకల్యం పెరిగే అవకాశముంది.

లాలూచీ అవినీతి – బలవంతపు అవినీతి మధ్య స్పష్టమైన తేడాను చూడాలని ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ఎఫ్‌డీఆర్)/ లోక్‌సత్తా తొలి నుంచీ కోరుతూ వచ్చింది. బలవంతపు అవినీతి బారిన పడి నిస్సహాయంగా లంచం ఇచ్చే సామాన్య ప్రజలకు రక్షణ కల్పిస్తూ, అవినీతి అధికారులను శిక్షించేలా న్యాయమైన నిబంధనలను సవరణల్లో చేర్చాలని విజ్ఞప్తి చేసింది. అన్నిటికంటే ముఖ్యంగా, ప్రభుత్వోద్యోగు లందరికీ అన్ని రకాల ఆరోపణల్లో గంపగుత్తగా రక్షణ కల్పించకుండా, ప్రభుత్వ విధానపరమైన అంశాల్లో, ప్రభుత్వ స్థాయి నిర్ణయాల్లో మాత్రమే తగురీతిలో రక్షణ కల్పించాలని కోరింది.

చట్టవ్యవస్థని ప్రభుత్వం, ప్రతిపక్షాలు పరిహాసం చేశాయి. ఇక దీని దుష్పరిణామాల్ని రాబోయే రోజుల్లో ఎదుర్కోవలసింది ప్రజలే. ◆

# పెట్రో ఉత్పత్తుల్ని జీఎస్‌టీ పరిధిలోకి తేవాలి




పెట్రోల్, డీజిల్‌పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దోపిడీ వ్యాపారుల్లా వ్యవహరిస్తున్నాయని, వీటి ధరల్ని ఇంకా తగ్గించాలని లోక్‌సత్తా పార్టీ ఏపీ అధ్యక్షుడు, విజయనగరం జిల్లా ప్రభుత్వ అద్దె వాహనాల డ్రైవర్ల, యజమానుల సంఘం అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ డిమాండ్ చేశారు. ఒకపక్క అడ్డగోలు ధరలు, మరోపక్క ప్రజల నుంచి పిండిన లక్షల కోట్లను దుర్వినియోగం చేయటం.. ఈ దుష్పరిపాలన దేశానికి శాపంగా మారిందన్నారు. పెట్రో ఉత్పత్తులను జీఎస్‌టీ పరిధిలోకి తేవాలని పునరుద్ఘాటించారు. పెట్రో ధరలపై ప్రభుత్వ తీరుకు నిరసనగా కలెక్టరేట్ వద్ద సంఘం ప్రతినిధులతో కలిసి ఆందోళనలో ఆయన పాల్గొన్నారు. గతంలో బీజేపీ ప్రభుత్వం ఉల్లిపాయల ధరలకవల్ల కూలిందని, ఇప్పుడు పెట్రో విధానంలో అనుసరించిన తీరు ఎప్పటికీ మాయనిమచ్చలా ఉంటుందని బాబ్జీ అన్నారు. సంఘం ప్రతినిధి వై.శ్రీకాంత్ (బుచ్చి) మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా లక్షలాది వినియోగదారులు, చిన్నవ్యాపారులు కేంద్ర ప్రభుత్వ తీరు వల్ల నష్టపోతున్నారన్నారు. నిరసన కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు రాము, ఉమా, రమేష్, సంతోష్, సీతారాం, వెంకటేష్, నాయుడు, నర్సింగ్, మురళి, అప్పారావు, సత్యనారాయణ, శ్రీను, కృష్ణ, లక్ష్మణరావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిభను దూరం పెట్టిన ప్రతిష్ఠ

**- శేఖర్ గుప్తా,** ద ప్రింట్ ఛైర్మన్, ఎడిటర్-ఇన్-చీఫ్

**తమకు అవసరమైన, తాము నమ్ముతున్న గొప్ప వ్యక్తులు తమ పార్టీలోనే ఉన్నారని నరేంద్ర మోదీ, అమిత్ షాలు ప్రగాఢంగా విశ్వసించినట్టు కనబడుతోంది. కానీ వారి వద్ద ఉన్న గొప్పతనం అనే మూలధనం పరిమితమైనదే. మోదీ ప్రభుత్వంలో మేధో పెట్టుబడి మూడో సంవత్సరానికే ఆవిరైపోయింది.**



మూడు ప్రశ్నలతో ప్రారంభిస్తాను. నరేంద్ర మోదీ సర్కారు సమర్థులకు వ్యతిరేకమా? 70 ఏళ్ల పాలనలో ఇది ప్రతిభా పాటవాలున్న వారిని అత్యంత తీవ్రంగా వ్యతిరేకించే ప్రభుత్వమా? ఈ అంశం నిజంగా మోదీకి, బీజేపీకి, ఓటర్లకూ పట్టదా? మొదటి రెండు ప్రశ్నలకూ జవాబు అవుననే చెప్పాలి. మూడో ప్రశ్నకు సమాధానం చర్చించాకే తేలుతుంది. మొదట కేబినెట్ సంగతి చూద్దాం. ఇందులో అనుభవం లేనివారే ఎక్కువమంది ఉన్నారు. బీజేపీ పదేళ్లు ప్రతిపక్షంలో ఉన్నందున వాజ్‌పేయీ మంత్రివర్గం సహచరుల్లో అత్యధికులు వృద్ధులనే సాకుతో వారిని బీజేపీ 'మార్గదర్శక మండల్'కే పరిమితం చేశారు. రాజ్‌నాథ్‌సింగ్, అరుణ్‌జైట్లీ, సుష్మాస్వరాజ్, అనంతకుమార్ వంటి యువనేతలను మోదీ మంత్రివర్గంలో చేర్చుకున్నారు. మౌలిక సదుపాయాల నిర్మాణంలో సొంత రాష్ట్రంలో అనుభవం ఉన్న నితిన్ గడ్కరీకి స్థానం లభించింది. అలాగే, పూర్తి స్థాయి కేబినెట్‌లో నాలుగైదు కీలకశాఖలు నిర్వహించే స్థాయికి ఎదిగిన పీయుష్ గోయల్ కూడా మోదీ కేబినెట్ సభ్యుడే. 70 మంది సభ్యులున్న మోదీ కేబినెట్‌లో ఇంతకుమించి చెప్పుకోదగ్గ వారెవరూ లేరు. మిత్రులను అడగకుండా మిగిలినవారి పేర్లు చెప్పడం కష్టం.

మోదీ సర్కారు ఐదో ఏట అడుగుపెట్టినప్పటి నుంచీ నేను జర్నలిజం విద్యార్థుల నుంచి బ్లూచిప్ కంపెనీల సీఈవోల వరకూ భిన్న వర్గాల వారితో మాట్లాడుతూ, 'మన దేశ వ్యవసాయ మంత్రి పేరు చెప్పగలరా?' అనే ప్రశ్న అడిగేవాణ్ని. జవాబు తమకు తెలుసని చేతులెత్తినవారు లేరు. ఒకవేళ రాధామోహన్‌సింగ్ పేరు చెబితే ఆయన ఎవరనే ప్రశ్న ఎదురవుతుంది. అయితే, ఆయన నేతృత్వంలో వ్యవసాయ రంగంలో వృద్ధి శరద్‌పవార్ నాయకత్వాన యూపీయే హయాం నాటి వృద్ధిలో కేవలం సగమే ఉన్నప్పుడు.. ఆయన ఎవరైతే ఏం? అనుకోవాల్సి ఉంటుంది. ఐదేళ్లలో వ్యవసాయ ఆదాయం రెట్టింపు చేస్తానన్న ప్రధాని మోదీ 2017 హామీ నిజం కావాలంటే హరిత విప్లవం వంటిది అవసరం. కానీ ఇండియాలో సైన్స్‌ను, వ్యవసాయ పరిశోధనను పూర్తిగా కాదనుకోవడమేగాక వాటిని అనుమానంతో చూడడం దిగ్భ్రాంతిని కలిగించే విషయం. ఇప్పుడు ఈ రంగంలో దిద్దుబాటు చర్యలు తీసుకోకపోతే వ్యవసాయ ప్రయోగశాలల నుంచి శాస్త్రవేత్తలు విదేశాలకు వలసపోయే ప్రమాదం లేకపోలేదు. ఆవు పేడ, మూత్రం, వైదిక సేంద్రియ వ్యవసాయ పద్ధతులు గొప్పవని ఇప్పుడు 'గుర్తించడం' వల్ల ప్రయోజనం లేదు. దేశంలో నవ్య విప్లవం సాధించాలనుకున్నప్పుడు ఇందిరాగాంధీ సామర్థ్యం, ప్రతిభాపాటవాలున్న సి.సుబ్రహ్మణ్యంను వ్యవసాయ మంత్రిగా నియమించారు. మరి రెండో హరిత విప్లవం సాధించడానికి నేటి సర్కారు ఎవరికి బాధ్యత అప్పగించింది?

**ఇతర రంగాలకు అద్దం పట్టే వ్యవసాయ శాఖ!**

ఇతర రంగాల పరిస్థితికి వ్యవసాయ మంత్రిత్వ శాఖ చక్కగా

అద్దం పడుతోంది. ఆరోగ్యం, రసాయనాలు–ఎరువులు, భారీ పరిశ్రమలు, సైన్స్, టెక్నాలజీ, సామాజిక న్యాయం, చిన్నతరహా పరిశ్రమల శాఖల మంత్రుల పేర్లు చెప్పాలని నేను కలుసుకున్నవారిని ప్రశ్నించాను. సమాధానం లేదు. మన దేశ చరిత్రలో అత్యంత అనామక కేబినెట్ ఇదేననడంలో ఎలాంటి సందేహం లేదు. ప్రధాని సామర్థ్యం, నైపుణ్యం ఉన్న నేతలతో తన కేబినెట్‌ను నింపి ఉండాల్సింది. ప్రధాని కార్యాలయం నుంచే పాలనకు, అమలుకు సంబంధించిన ఆలోచనలు వస్తాయి కాబట్టి అంతా మోదీ చేతిలోనే ఉంది. ప్రధాని దగ్గర సమర్థులు, అంకితభావమున్న అధికారులు ఉన్నారు. అయితే, వారి ఆలోచనల అమలుకు సృజనాత్మకత ఎక్కడి నుంచి వస్తుంది? ప్రధానమంత్రి అత్యంత ప్రతిభావంతుడే. ఆయన చెప్పినట్టు దేశంలోని అన్ని జిల్లాల్లో పర్యటించారు. అయితే, ఓ ఖండమంత ఉన్న భారీ దేశంలో ఎంతటి గొప్ప నాయకుడైనా ఆలోచనంతా ఒక్కడే చేయలేడు.

ప్రధానికి సలహాలివ్వడానికి ఇంతకుముందే ఉన్న బృందాలన్నింటినీ రద్దుచేయడం లేదా వాటి ప్రాధాన్యం తగ్గించడం కాకతాళీయం కాదు. నేడు జాతీయ భద్రతా సలహా మండలి (ఎన్ఎస్ఏబీ)లో ఐదుగురే సభ్యులు గుట్టుచప్పుడు కాకుండా పనిచేసుకుంటున్నారు. గతంలో అణుశక్తి సిద్ధాంతం సహా అనేక జాతీయ విధానాలను రూపొందించే అత్యంత శక్తిమంతమైన సంస్థగా ఇది పనిచేసేది. రక్షణరంగ నిపుణులు, ప్రజాహిత మేధావులు వంటి విభిన్న నేపథ్యాల నుంచి వచ్చిన ప్రముఖులతో ఇది పనిచేసేది. అటల్ బిహారీ వాజ్‌పేయీ, బ్రజేష్ మిశ్రా నాయకత్వాన ఎన్ఎస్ఏబీ ఎంతో సాధించింది. ప్రస్తుతం ఇది జాతీయ భద్రతా సలహాదారుకు సమాచారమందించే సలహాసంఘంగా మారిపోయింది. ప్రధానికి, కేంద్ర కేబినెట్‌కు సలహాలిచ్చే రెండు శాస్త్ర సలహా మండళ్ల పనితీరు కూడా అంతంత మాత్రమే. నిరంతర కృషి జరగడం లేదు. మోదీ ప్రభుత్వం తన ప్రధాన శాస్త్ర సలహాదారును తన ఐదో ఏడాది చివర్లో నియమించింది. ఈ పదవిలో అగ్రశ్రేణి శాస్త్రవేత్తను నియమించినా గాని, ఆ పదవి స్థాయిని సహాయమంత్రి నుంచి కార్యదర్శి హోదాకు తగ్గించేసింది. ఈ పదవికి అబ్దుల్ కలాం వారసునిగా ప్రసిద్ధ అణు శాస్త్రవేత్త ఆర్. చిదంబరం వచ్చినప్పుడు దీని స్థాయిని కేబినెట్ మంత్రి హోదా నుంచి తగ్గించారు. గతంలో కేబినెట్ శాస్త్ర సలహా మండలి భారతరత్న ప్రొఫెసర్ సీఎన్ఆర్ రావు నాయకత్వంలో నడిచేది. ఇప్పుడది దాదాపు లేనట్టే.

### నాలుగేళ్లలో ముగ్గురు ఆర్థికవేత్తలు అవుట్!

మోదీ ప్రభుత్వం తన నాలుగేళ్లలో అంతర్జాతీయ ఖ్యాతి గడించిన తన నలుగురు ఆర్థికవేత్తలలో ముగ్గురిని కోల్పోయింది. వారు: రఘురామ్ రాజన్, అరవింద్ పన్‌గడియా, అరవింద్ సుబ్రహ్మణ్యన్. నాలుగో ఆర్థికవేత్త ప్రస్తుత రిజర్వుబ్యాంక్ గవర్నర్ ఉర్జిత్ పటేల్ ఇప్పుడు తన సంస్థాగత స్వాతంత్ర్యం, వృత్తిపరమైన గౌరవం కాపాడుకోవడానికి నానా తంటాలు పడుతున్నారు. పెద్ద నోట్ల రద్దు (డీమానిటైజేషన్) విషయంలో ప్రభుత్వం చెప్పినట్టు విని తన బాధ్యత విస్మరించారనే చెడ్డపేరు తెచ్చుకున్నారు. పెద్ద నోట్ల రద్దు తర్వాత ఆర్థిక వ్యవస్థ కుంటి నడకతో ముందుకు సాగడంతో ప్రధాని ఆర్థిక సలహా మండలిని ఆర్భాటంగా పునరుద్ధరించారు. అయితే, ఏం జరుగుతోందో తెలుసా? మండలితో సమావేశం కావడం లేదు. ప్రభుత్వంలో అంతర్భాగమైన ఇద్దరు అధిపతులతోనే ఆయన భేటీ అవుతున్నారు. వారు: ఆర్థిక శాస్త్రవేత్త బిబేక్ దేబ్‌రాయ్, మాజీ ఐఏఎస్ అధికారి, వ్యయ విభాగం కార్యదర్శి రతన్ వాటాల్. ఈ సలహా మండలిలోని మిగిలిన నలుగురు పేరు గొప్పేగాని ప్రయోజనం లేకుండా కొనసాగుతున్నారు. ప్రధాని పరిశీలనకు అత్యధిక నివేదికలను రూపొందించేది దేబ్‌రాయ్, వాటాల్ మాత్రమే. కనీసం ఈ నివేదికల ప్రతులను కూడా మిగిలిన నలుగురికి చూపిస్తారా? అంటే నాకు అనుమానమే. ఈ ప్రభుత్వంలో లోపలివారికే ప్రాధాన్యం. బయటివారి పాత్ర అలంకారప్రాయమే. ఇదంతా చూస్తే పాండిత్యమంటే సర్కారుకున్న చీకాకు స్పష్టమౌతోంది. కిందటేడాది ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో 'కష్టపడి పనిచేస్తే హార్వర్డ్‌ని అధిగమించవచ్చు' అని ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యను బట్టి ఈ విషయం అర్థమయింది. మొదట విపరీతంగా కష్టపడితేనే ప్రపంచ ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీ (అమెరికా)లో సీటు లభిస్తుంది. భిన్నాభిప్రాయాలకు చోటు కల్పించేలా ప్రభుత్వం ఉంటే– గొప్ప విద్యాసంస్థలైన హార్వర్డ్, ఎంఐటీ, యేల్, జేఎన్‌యూలోని అత్యుత్తమ ప్రతిభావంతులను పిలిచి పదవులు ఇవ్వవచ్చు. అరవింద్ సుబ్రహ్మణ్యన్ తన పదవి నుంచి వెళ్లిపోగానే ప్రధాన ఆర్థిక సలహాదారు (సీఈఏ) పదవిలో నియామకానికి కనీస అర్హతల్లో ప్రభుత్వం ముఖ్యమైన మార్పులు చేయడం ఆశ్చర్యం కలిగించడం లేదు. కొత్త సీఈఏకు ఆర్థికశాస్త్రంలో డాక్టరేట్ అవసరం లేదు. కేవలం 'కష్టపడి పనిచేసినట్టు' సాక్ష్యాధారాలు చూపిస్తే చాలనుకుంటాను.

వాజ్‌పేయీ నేతృత్వంలోని మునుపటి ఎన్డీయే మంత్రివర్గం బీజేపీ అనుకూల ధోరణితో లేదని నరేంద్రమోదీ, అమిత్ షా ఇద్దరూ బలంగా విశ్వసించారు. ఇప్పుడు తమకు మెజారిటీ ఉంది కాబట్టి బయటి వ్యక్తులకు ఎవరికీ చోటు ఇవ్వడానికి వీరు సిద్ధపడలేదు. వాళ్లకు ఏ విశిష్ట ప్రతిభలు ఉన్నప్పటికీ బయటివారికి చోటు ఇవ్వలేదు.

ఇది మూడో ప్రశ్నను మళ్లీ చర్చకు తీసుకొస్తుంది. ఇదంతా ఓటర్లకు పట్టదా? మంచి నేతలు గొప్ప మనసు కలిగి ఉంటారు. కానీ గొప్ప నేతలు విశాల హృదయాలను కలిగి ఉంటారు. ఇందిరాగాంధీ కూడా తన ప్రభుత్వాన్ని తన కార్యాలయం నుంచే నిర్వహించారు. కానీ తన చుట్టూ ఉన్న ప్రతిభావంతుల గురించి ఆమె ఆలోచించేవారు.

తమకు అవసరమైన, తాము నమ్ముతున్న గొప్ప వ్యక్తులు తమ పార్టీలోనే ఉన్నారని నరేంద్ర మోదీ, అమిత్ షాలు ప్రగాఢంగా విశ్వసించినట్టు కనబడుతోంది. కానీ వారి వద్ద ఉన్న గొప్పతనం అనే మూలధనం పరిమితమైనదే. మోదీ ప్రభుత్వంలో మేధో పెట్టుబడి మూడో సంవత్సరానికే ఆవిరైపోయింది. వైద్య విద్యా సంస్కరణ ముసాయిదా రూపొందించడానికి నీతి ఆయోగ్ నాలుగేళ్ల సుదీర్ఘ సమయం తీసుకుంది. అలాగే ప్రైవేట్ కంపెనీలకు బగ్గు గనులను అమ్మే ప్రక్రియకు కూడా సుదీర్ఘ కాలం పట్టింది. ఈ ఆలస్యానికి పేలవమైన హోమ్ వర్క్, తీవ్ర మానసిక ఒత్తిడే కారణం.

కీలక రంగాల్లో స్తబ్దత, క్షీణిస్తున్న ప్రతిష్ట, అసహనం వంటి రూపాల్లో మోదీ ప్రభుత్వం ప్రస్తుతం పడుతున్న ప్రసవ వేదనను చూస్తుంటే, జర్నలిస్టులు అడిగే హేతుబద్ధమైన ప్రశ్నలకు కూడా వారిని మందలించని, బెదిరించని కేబినెట్ మంత్రిని బహుశా నేను చూడలేదని చెప్పాలి. అందుకే మోదీ ప్రభుత్వం రెండో దఫా కూడా సులువుగా అధికారంలోకి వస్తుందని ఏడాది క్రితం ఉన్న జనాభిప్రాయం ఇప్పుడు పెద్ద సందిగ్ధావస్థలో చిక్కుకున్నట్టుంది. ◆

*సాక్షి సౌజన్యంతో...*

## యువత గాంధీజీని అధ్యయనం చేయాలి



బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా జాతిని ఏకం చేసి బాపూజీగా చరిత్రకెక్కిన మహాత్మాగాంధీ జీవితంలో మనకు ఉపయోగపడే ఎన్నో అంశాలు దాగి ఉన్నాయని, వాటిని యువత అధ్యయనం చేసి కెరీర్‌లో, కార్యక్రమాల్లో భాగం చేసుకోవాలని యువసత్తా విజయనగరం జిల్లా అధ్యక్షుడు రొక్కం గురునాథం అన్నారు. గాంధీజీ 150వ జయంతి వేడుకలు ప్రారంభం సందర్భంగా స్థానిక వి.టి అగ్రహారం వద్ద విగ్రహానికి పూలదండ వేసి నివాళులర్పించారు. యువసత్తా కార్యదర్శి లెంక లక్ష్మణరావు మాట్లాడుతూ, సమాజంలో హింస పెచ్చరిల్లకుండా మహాత్ముని మాటల్ని మనం ఆచరించగలిగితే, బాపూజీ కలలుగన్న సురాజ్యాన్ని సాధించగలమన్నారు. యువసత్తా సహాయ కార్యదర్శి పి.ఎల్.ఎన్ రాజు, పెంటబాబు, అనిల్, రాజు, త్రినాథ్, శ్రీను, నారాయణ, మధు తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యామ్నాయ రాజకీయంతోనే ఏపీకి విముక్తి

ఆంధ్రప్రదేశ్‌లో ప్రధాన పార్టీలుగా చెలామణి అవుతున్న తెలుగుదేశం, వైసీపీ వగైరాల మధ్య ఏమైనా మౌలికంగా తేడా ఉందా? అని లోక్‌సత్తా పార్టీ రాజానగర మండల అధ్యక్షుడు పెంటగట్ల మణికుమార్ ప్రశ్నించారు. కొండగుంటూరు గ్రామంలోని లోక్‌సత్తా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ, రాష్ట్రంలో వైద్యం, విద్య అధ్వాన్నంగా ఉన్నాయన్నారు. కేంద్రంలోని బీజేపీ కూడా సమస్యల్ని పట్టించుకోకుండా రాష్ట్రం పట్ల దాటవేత ధోరణితో వ్యవహరిస్తోందన్నారు. చట్టబద్ధపాలన, విద్య, వైద్యం వంటి అంశాలను సరైన విధానాలతో అమల్లోకి తేగల ప్రత్యామ్నాయ రాజకీయంతోనే ఏపీ పునరుజ్జీవనం సాధ్యమవుతుందన్నారు. లోక్‌సత్తా పార్టీ నాయకులు కోనా శ్రీనివాస్, రేలంగి దుర్గాప్రసాద్, పి.శివజ్యోతి కుమార్, గిరజాల నాగేశ్వరరావు, జి. శ్రీనివాస్, ఓరుగంటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## అన్న క్యాంటీన్లు.. ప్రచారం ఎక్కువ, నాణ్యత తక్కువ!

అన్న క్యాంటీన్లు.. ప్రచారం ఎక్కువ, నాణ్యత తక్కువగా తయారయ్యాయని లోక్‌సత్తా పార్టీ రాయదుర్గం కన్వీనర్ వెంకటరమణబాబు అన్నారు. క్యాంటీన్లలో ఆహారపదార్థాల నాణ్యతను మెరుగుపరిచి రాయదుర్గంలో, మండల కేంద్రాల్లో కూడా ఏర్పాటు చేయాలన్నారు. వేలమంది పేద కార్మికులు గ్రామాల నుంచి వచ్చి రాయదుర్గంలో గార్మెంట్ పనులు చేసుకుంటున్నారని, వారికి అన్న క్యాంటీన్లు ఉపయోగపడాలన్నారు. పట్టణంలోని శాంతినగర్‌లోనే 15 వేల మంది గార్మెంట్ దినసరి కూలీలు ఉన్నారన్నారు.

# పోలవరం ప్రధాన కాంట్రాక్టర్‌కి అనుచిత రాయితీలు -పలు లోపాలను ఆక్షేపిస్తూ కాగ్ నివేదిక-

పోలవరం ప్రాజెక్టు మందగతికి రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం కూడా ప్రధాన కారణమని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) స్పష్టం చేసింది. ప్రధాన కాంట్రాక్టర్‌కు ఒప్పంద నిబంధనలను నడలినన్నా రూ.1,853.08 కోట్ల మేర అనుచిత రాయితీలు కల్పించారని ఆక్షేపించింది. ఇన్ని రాయితీలిచ్చినా పోలవరం పనులు నిర్ణీత గడువులోగా పూర్తయ్యే పరిస్థితి కన్పించడం లేదని పేర్కొంది.

2012 ఏప్రిల్ నుంచి 2017 మార్చి మధ్యకాలంలో పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన పురోగతిపై కాగ్ సమీక్షించింది. నివేదికను ఆలస్యంగా ఇటీవల అసెంబ్లీలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టింది.

అసమగ్ర ప్రణాళిక, డిజైన్ల ఖరారు, భూసేకరణ, పునరావాసం, పునర్నిర్మాణ కార్యక్రమాల్లో జాప్యం వల్ల 2004లో ప్రారంభమైన పోలవరం పనులు అవాంతరాల మధ్య చిక్కుకున్నాయని కాగ్ పేర్కొంది. 2019 నాటికి ప్రాజెక్టును పూర్తి చేసి ఆశించిన ప్రయోజనాలు పొందడం కష్టమేనని అంచనా వేసింది. ఒప్పందపు నిబంధనల్ని పాటింప జేయడంలో రాష్ట్ర జలవనరుల శాఖ విఫలమైందని ధృవీకరించింది. పోలవరం సమగ్ర ప్రాజెక్టు నివేదికను కేంద్ర జలసంఘం ఆమోదించినా అదీ లోపాలతోనే ఉందని, ఆధునిక సాంకేతిక వ్యవస్థను ఇందులో ఉపయోగించుకోలేదని ఆక్షేపించింది. ఈ విషయాన్ని జలవనరుల శాఖ అంగీ కరించిందని తెలిపింది. ఎడమ, కుడి కాలువల్లో 15 ప్యాకేజీలకు సంబంధించి ఒప్పంద గడువులోపు భూసేకరణ

### ఐటీలో దీర్ఘకాలిక ప్రణాళికలు లేవు

ఏపీలో ఐటీ పరిశ్రమల అమలు, ఇంక్యుబేటర్ల పనితీరుపై పర్యవేక్షణ సరిగా లేదని కాగ్ అభిప్రాయపడింది. ఫలితంగా ప్రాజెక్టుల అమలులో అసాధారణ జాప్యాలున్నట్టు తెలిపింది. 2017 ఫిబ్రవరి నుంచి ఆగస్టు వరకు కాగ్ ఈ ఆడిట్‌ను చేసింది. ఇంక్యుబేషన్ కేంద్రాలను నిర్మించినా వినియోగంలోకి తీసుకురాలేకపోయినట్టు వ్యాఖ్యానించింది. ఐటీ పాలసీల్లో నిర్దేశించిన లక్ష్యాలు సాధించేందుకు దీర్ఘకాలిక వ్యూహాత్మక ప్రణాళికలు, వార్షిక కార్యాచరణ ప్రణాళికలు ప్రభుత్వం తయారుచేయకపోవడంపై కాగ్ పెదవి విరిచింది. ఉమ్మడి సేవా కేంద్రాల ద్వారా కనీసం రెండు ఎంబీపీఎస్ వేగం నెట్‌వర్క్‌ను అందించేందుకు ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో ఆంధ్రప్రదేశ్ స్టేట్‌వైడ్ ఏరియా నెట్‌వర్క్ (ఏపీస్వాన్) అభివృద్ధి పరిచింది. ఒప్పందం ముగిసిన వెంటనే బీఓఓటీ నిర్వాహకుడు ఏపీస్వాన్ ఆస్తులను కొత్త సంస్థలకు అప్పగించాల్సి ఉంది. నవంబర్ 2015లో కొత్త సంస్థ ఎఫ్ఎం అండ్ ఎఎంసీ సంస్థతో ఒప్పందం చేసుకున్నా ఆస్తులను పూర్తిగా స్వాధీనపరిచేటట్టు చేయడంలో ఏపీటీఎస్ విఫలమైనట్టు కాగ్ పేర్కొంది.

- ఒప్పందం ప్రకారం 10,809 ఉద్యోగాలు కల్పించాల్సి ఉండగా 2017 జులై నాటికి 4,326 ఉద్యోగాలు కల్పించారు.
- అర్హతలేని నెవా పవర్ లిమిటెడ్‌కు ఏపీ ఐఐసీ భూమిని కట్టబెట్టింది.
- దరఖాస్తును తిరస్కరించిన ముదునూరు హోల్డింగ్స్‌కు ఎటువంటి కారణం తెలపకుండానే మరుసటి సమావేశంలో సీసీఐటీఐ భూ కేటాయింపునకు సిఫార్సు చేసింది.
- తిరుపతిని పెట్టుబడుల కేంద్రంగా ప్రోత్సహించేందుకు ఈ రెండు యూనిట్లలో ఉద్యోగుల సంఖ్య 100 కన్నా తక్కువగా ఉన్నప్పటికీ సీసీఐటీఐ సిఫార్సు చేసినట్టు ప్రభుత్వం పేర్కొనడం ఆక్షేపణీయం.
- విశాఖ, కాకినాడ, తిరుపతిల్లోని ఇంక్యుబేషన్ కేంద్రాల్లోని మొత్తం స్థలం 79,530 చదరపు అడుగులు కాగా, ఇంకా వినియోగించకుండా ఉన్నది 23,774 చదరపు అడుగులు.
- ఇంక్యుబేటర్ల పనితీరుపైనా పర్యవేక్షణలేమి.
- అంకుర పరిశ్రమల సంఖ్యల వివరాలు లేవు.
- విశాఖ ఇంక్యుబేషన్ కేంద్రంలో మూడు సంస్థలకు అద్దె లేకుండానే స్థలం కేటాయింపు.
- మరో నాలుగు సంస్థలకు ఇతర ప్రయోజనాల్ని కేటాయించారు.

## సింగిల్ డెస్క్ మెరుగుపడాలి

పరిశ్రమల ఏర్పాటులో అనుమతుల ప్రక్రియను సులభతరం చేసే లక్ష్యంతో ఏర్పాటు చేసిన సింగిల్ డెస్క్ ఇంకా మెరుగుపడాలని కాగ్ సూచించింది. పోర్టల్ పనితీరును మెరుగుపరచి ప్రజలకు అవసరమైన సమాచారాన్ని అందుబాటులో ఉంచాలని స్పష్టం చేసింది. అనుమతుల తాజా స్థితి, యూనిట్లవారీగా అందిన దరఖాస్తులు, ఆమోదం తెలిపినవాటి వివరాలు పోర్టల్‌లో కనిపించడం లేదని వివరించింది.

- ❒ జూన్ 2016న జారీ చేసిన సవరించిన మార్గదర్శకాల ప్రకారం ఫిర్యాదులను 30 రోజులలో పరిష్కరించాల్సి ఉంది. అయినా అమల్లో జాప్యం జరుగుతోంది. ఆరు జిల్లాల్లో 50 ఫిర్యాదులు అందగా 28 ఇంకా పరిష్కరించాల్సి ఉంది. ఇవి 108 రోజుల నుంచి 606 రోజుల వరకు అపరిష్కృతంగా ఉన్నాయి. ఇందులో 27 ఫిర్యాదులు కొత్త మార్గదర్శకాలు అమల్లోకి వచ్చిన తర్వాతే అందాయి.
- ❒ పరిశ్రమల శాఖ కమిషనర్ పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొంది.
- ❒ సింగిల్ డెస్క్ పోర్టల్‌ను ప్రారంభించిన 2015 ఏప్రిల్ నుంచి 2017 మే 18 వరకు 11,297 మంది పారిశ్రామికవేత్తలు నమోదు చేసుకున్నారు.
- ❒ 6,685 మంది 19,837 అనుమతులు కోరారు. ఇందులో 2017 ఏప్రిల్ 26 నాటికి 17,787 అనుమతులిచ్చారు.

పూర్తి చేసి కాంట్రాక్టర్లకు అప్పజెప్ప లేకపోయారని పేర్కొంది. కేంద్రం జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించినప్పటికీ ఇప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అవగాహనా ఒప్పందం కుదుర్చు కోలేదని ఎత్తిచూపింది.

కాగ్ గుర్తించిన ప్రధాన లోపాలు..

- ❒ పోలవరం ప్రధాన డ్యాం పనులను 2013 మార్చిలో రూ.4054 కోట్ల ఒప్పంద విలువతో ట్రాన్స్‌ట్రాయ్-జేఎస్‌సీ యూఈఎస్ సంయుక్త సంస్థకు అప్పగించారు. 2018 మార్చి కల్లా పనులు పూర్తిచేయాలి. ఒప్పంద గడువులోపు ఏ కారణంగానూ ఒప్పంద ధరలను సవరించకూడదు. ఏ కారణంతోనైనా పనిలో జాప్యం జరిగిందని, పనికి ఆటంకం వాటిల్లిందని పరిహారాలు చెల్లించే వీలూ లేదు. భూ సేకరణ-పునరావాసంలో ఆలస్యమైందనే కారణంతో జలవనరుల శాఖ ఒప్పంద విలువను రూ.1331.91 కోట్ల మేర పెంచేసింది. ఇది పోటీతత్వపు స్ఫూర్తికి విరుద్ధం.
- ❒ ఈ పెరిగిన ఒప్పంద విలువపై రూ.66.59 కోట్ల మేర అదనపు పెర్ఫార్మెన్స్ సెక్యూరిటీ తీసుకోలేదు. కాంట్రాక్టర్ వైఫల్యాలకు రక్షణ లేకుండా పోయింది.
- ❒ ఉక్కును కాంట్రాక్టర్ కొనుగోలు చేయాలి. ఇందుకు విరుద్ధంగా జలవనరుల శాఖ రూ.25.37 కోట్లు చెల్లించింది. యంత్రాల దిగుమతి సుంకాలు కూడా రూ.7.50 కోట్ల మేర ప్రభుత్వమే చెల్లించింది. తవ్విన మట్టి పోసేందుకు డంపింగ్ స్థలాన్ని కాంట్రాక్టరే ఏర్పాటు చేసుకోవాలి. ఇక్కడ ప్రభుత్వమే రూ.32.66 కోట్లు చెల్లించి 203.74 ఎకరాలు సేకరించింది. అసలు కింద రూ.187.05 కోట్లు, వడ్డీ కింద రూ.109.28 కోట్లు ప్రభుత్వం కాంట్రాక్టర్‌కి రాయితీ ఇచ్చింది.
- ❒ పనుల వేగం పెంచేందుకు ఈ రాయితీలన్నీ ఇచ్చామని ప్రభుత్వం చెబుతున్నా జలవనరుల శాఖ నిర్దేశించిన మైలురాళ్ల ప్రకారం 76 శాతం పని పూర్తికావాల్సి ఉండగా 2017 జూన్ వరకు కేవలం 31 శాతం మాత్రమే పని చేశారు.
- ❒ పోలవరం కుడి కాలువ పనుల్లో 1, 2, 4, 5, 6, 7 ప్యాకేజీల్లో ప్రజోపయోగ నిర్మాణాలు తరలించే పేరుతో

### జీవవైవిధ్య చట్టం అమలుకు ఇంకా సంసిద్ధతే లేదు

జీవవైవిధ్య చట్టాన్ని అమలు చేయడంలో కీలక పాత్ర వహించే యాజమాన్య కమిటీల ఏర్పాటును పట్టించుకోవడం లేదని కాగ్ ఆక్షేపించింది. రాష్ట్రంలోని స్థానిక సంస్థల (ప్రభుత్వాల)కు ఈ అంశం పట్టడం లేదంది. ఏపీ జీవవైవిధ్య మండలి ఏర్పాటై దశాబ్దం గడచినా జీవవైవిధ్య చట్టం అమలుకు పూర్తిస్థాయి సంసిద్ధతను రాష్ట్రం ఇంకా అందుకోలేదని పేర్కొంది. మొత్తం 13,725 స్థానిక సంస్థలకుగాను 2017 జూన్ నాటికి కేవలం 2,908 సంస్థలు మాత్రమే జీవవైవిధ్య కమిటీలను ఏర్పాటు చేశాయని తెలిపింది.

- ❒ అనంతపురం జిల్లా చిలమత్తూరు మండలంలోని వీరాపురం చెరువు, కదిరి తాలూకా గొట్టిబయలు గ్రామంలోని తిమ్మన్న మర్రిమానును జీవవైవిధ్య వారసత్వ ప్రాంతాలుగా ప్రకటించాల్సి ఉన్నా ఇప్పటికీ ఆ దిశగా చర్యలు తీసుకోలేదు.
- ❒ జీవవైవిధ్య చట్టాన్ని, నియమాలను అమలు చేసేందుకు దోహదపడే రాష్ట్ర జీవవైవిధ్య సంరక్షణ విధానాన్ని, కార్యప్రణాళికను బోర్డు ఇప్పటి వరకూ తయారు చేయలేదు. దీనికి తగిన నిధులూ కేటాయించలేదు.

కాంట్రాక్టర్ల తరపున (ప్రధాన డ్యాం కాంట్రాక్టర్ వేరు-కాలువల కాంట్రాక్టర్ వేరు) రూ.38.12 కోట్లు ప్రభుత్వమే చెల్లించింది. వివిధ రూపాల్లో కాంట్రాక్టర్‌కి రూ.1853 కోట్ల మేర అనుచిత లబ్ధి చేకూరింది.

- ❒ పోలవరం ప్రాజెక్టును కేంద్రం జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించి మూడేళ్లయినా ఇప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అవగాహనా ఒప్పందం కుదరలేదు. 2017 మార్చి వరకు ఉన్న లెక్కల ప్రకారం పోలవరంపై రాష్ట్రం చేసిన మొత్తంలో కేంద్రం రూ.3,249 కోట్లు తిరిగి చెల్లించలేదు. భూసేకరణ, పునరావాసాలకు సంబంధించి రాష్ట్రం ఖర్చు చేసిన రూ.1,407.64 కోట్ల ఖర్చు వివరాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ (పీపీఏ)కి సమర్పించలేదు.
- ❒ పోలవరం ప్రాజెక్టు పూర్తి స్థాయి నివేదిక (డీపీఆర్)ను కేంద్ర జలసంఘం 2009లో ఆమోదించింది. ఇందులోనూ అనేక లోపాలున్నాయి. జలసంఘం సూచించినా రిమోట్ సెన్సింగ్, ఉపగ్రహ చిత్రాలు ఉపయోగించలేదు. సర్వే ఆఫ్ ఇండియా వారి పటాలు, జలవనరుల శాఖ స్వయంగా నిర్వహించిన క్షేత్ర సర్వేక్షణపై మాత్రమే ఆధారపడింది. కేంద్ర జలసంఘం మార్గదర్శకాలను పట్టించుకోలేదు.
- ❒ ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలో వివిధ మధ్య, చిన్న తరహా నీటిపారుదల ప్రాజెక్టుల కింద ఇప్పటికే సాగుబడిలో ఉన్న ప్రాంతాన్ని ఈ ప్రాజెక్టు కిందకు తీసుకురావాలని జలవనరుల శాఖ ప్రతిపాదించినా, ఆ వివరాలను నివేదికలో పేర్కొనలేదు.
- ❒ 2005లో రూ.10,154.04 కోట్లు అంచనా వ్యయంగా పేర్కొంది. 2010

### అదనపు లబ్ధి చేకూర్చలేదు: జలవనరుల శాఖ వివరణ

పోలవరం ప్రాజెక్టులో కాంట్రాక్టర్‌కు అదనపు లబ్ధి చేకూర్చలేదని రాష్ట్ర జలవనరుల శాఖ వివరణ ఇచ్చింది. ప్రాజెక్టు ప్రాంతాన్ని కాంట్రాక్టర్‌కి అప్పగించడంలో ఆలస్యం కావడం వల్లే కొత్త ధరలు వర్తింపచేయాల్సి వచ్చిందని తెలిపింది.

+ కాంట్రాక్టర్‌తో ఒప్పందం సవరించినా, ఒప్పంద విలువ పెంచినా ఆ మేరకు అదనపు డిపాజిట్ వసూలుపై నిబంధనలు పెట్టుకోలేదు. అనుబంధ ఒప్పందం కుదుర్చుకునే నాటికే కాంట్రాక్టర్ తగినంత మేర పనులు చేసినందున అదనపు డిపాజిట్ వసూలు చేయలేదు.

+ స్పిల్ వే, రేడియల్ గేట్లకు భారీ మొత్తంలో ఉక్కు అవసరమైందని, కాంట్రాక్టర్ ఆర్థిక ఇబ్బందులున్నాయని చెప్పడంతో పనులు నిరాటంకంగా సాగాలనే ఉద్దేశంతో ఉక్కు కొనుగోలుకు ప్రభుత్వం సహకరించింది. ఈ మొత్తం రికవరీ చేస్తూ ఉన్నాం.

+ కేంద్రం నుంచి రూ.2918.38 కోట్లు రావాల్సి ఉంది. ఇంతవరకు మొత్తం మీద 58.38 శాతం పనులు పూర్తయ్యాయి.

## పోలవరం జాప్యం పాపం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలదే: లోక్‌సత్తా




పోలవరం ప్రాజెక్టును, ప్రత్యేక హోదా ద్వారా రావాల్సిన పారిశ్రామిక రాయితీల్ని వెంటనే సాధించుకుంటేనే ఆంధ్రప్రదేశ్ వృద్ధి సుస్థిరంగా సాధ్యమవుతుందని లోక్‌సత్తా 2014-15 నుంచి గట్టిగా కోరినా, పలు కార్యక్రమాల్ని నిర్వహించినా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేదని లోక్‌సత్తా పార్టీ ఏపీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. చంద్రబాబు చాలా ఆలస్యంగా మేలుకొన్నారన్నారు. పోలవరం జాప్యానికి రాష్ట్ర, కేంద్ర పాలకులదే ప్రధాన బాధ్యతని ఆయన విజయనగరంలో మీడియాతో మాట్లాడుతూ అన్నారు. పోలవరం కాంట్రాక్టుల చెల్లింపులో కాగ్ లేవనెత్తిన అభ్యంతరాలు సహేతుకమేనని, మసి పూసి మారేడుకాయ చేయకుండా వాటిపై చర్చ చేసి వాస్తవాల్ని అంగీకరించాలన్నారు. వేల కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ తప్పుల్ని దిద్దుకోకుండా దబాయిస్తుంటే ప్రజలు ఎల్లకాలం సహించరన్నారు. సమావేశంలో లోక్‌సత్తా పార్టీ నేతలు నాగభూషణం, భూడి సన్యాశినాయుడు, పతివాడ చంద్రరావు, పి.ఎల్.ఎన్ రాజు, చిన్నారావు, ఎర్నిబాబు, రాజారావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నాటికి రూ.16,010.45 కోట్లుగా ఇది సవరించారు. డీపీఆర్ ఆమోదించకముందే ఏపీ ప్రభుత్వం రూ.1085.41 కోట్లు ఖర్చు చేసేసింది.

- ఈ ప్రాజెక్టు ప్రయోజనాలు పూర్తిస్థాయిలో పొందాలంటే 7.20 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందించాలి. ఇందులో 3.92 లక్షల ఎకరాలకు పుష్కర, తాడిపూడి ఎత్తిపోతల పథకాల కింద చూపారు. మిగిలిన 3.28 లక్షల ఎకరాలకు డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థ పనులను జలవనరుల శాఖ ఇంకా చేపట్టాల్సి ఉంది. ప్రాజెక్టు నుంచి పూర్తి ప్రయోజనం పొందాలంటే ఆ ప్రాజెక్టు పూర్తయ్యేనాటికి డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థ ఏర్పాటు చేసుకోవాలి. పోలవరం ప్రాజెక్టు అంచనాలు తాజా సవరణ ప్రకారం రూ.55,132 కోట్లుగా (అప్పటికి చూపిన లెక్కల ప్రకారం) చెబుతున్నా ఇందులో డిస్ట్రిబ్యూటరీల ఖర్చు కూడా చూపలేదు.
- కేంద్ర జలసంఘం డిజైన్లు ఆమోదించకముందే 2005-06 మధ్య ప్రభుత్వం టెండర్లు పిలిచి పనులు అప్పగించింది. ఆ తర్వాత 50 లక్షల క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యానికి మార్పులు చేశారు. ఆ అదనపు ఖర్చులు భరించేందుకు కాంట్రాక్ట్ సంస్థలు నిరాకరించాయి. ప్రభుత్వం మూడేళ్లు ఆలస్యం చేసి 2009 ఆగస్టులో కాంట్రాక్టులు రద్దు చేసింది. విద్యుత్తు కేంద్రం బిడ్లు ఖరారు కాకపోవడంతో పోలవరం బిడ్లు ఆలస్యమయ్యాయి. 2011లో తిరిగి టెండర్లను ఆహ్వానించారు. అప్పట్లో ఎల్1 సంస్థల అర్హతలపై ఆరోపణలు రావడంతో మళ్లీ రద్దు చేశారు. 2012 ఏప్రిల్‌లో మళ్లీ టెండర్లు పిలిచి 2013 మార్చిలో పనులు అప్పగించారు. ఆ ఆలస్యాల వల్ల రూ.2331.27 కోట్ల మేర అంచనాలు పెరిగిపోయాయి.
- 2017 జులై నాటికి కూడా నాణ్యత నియంత్రణ కోసం జలవనరుల శాఖ మూడో పక్షాన్ని నియమించలేదు. నాణ్యత ఆడిట్ కూడా సరిగా జరగడం లేదు. పోలవరం ప్రాజెక్టు అథారిటీ నాణ్యత ఆడిట్ కోసం సీఎస్ఎంఆర్ఎస్ సంస్థను నియమించింది. ఈ సంస్థను నియమించే నాటికి పోలవరం ప్రాజెక్టు పనులు 50 శాతం పూర్తయిపోయాయి.
- పునరావాసం, పునర్నిర్మాణ పనుల పర్యవేక్షణకు రాష్ట్ర స్థాయి, ప్రాజెక్టు స్థాయి పర్యవేక్షణ కమిటీలు సరిగా సమావేశం కావడం లేదు.
- పునరావాసం, భూసేకరణలో ఆలస్యం అవుతోంది. 2017 మార్చి నాటికి ఇంకా 96 శాతం ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలకు పునరావాసం కల్పించాల్సి ఉంది. ముంపునకు గురయ్యే గ్రామాలను గుర్తించడంలో అసాధారణంగా 11 ఏళ్ల జాప్యం జరిగింది.
- 2005-06 మధ్య సేకరించిన భూమిలో 492.07 ఎకరాలను ప్రభుత్వం ఇప్పటికీ ఉపయోగించుకోలేకపోయింది. ◆




# 'ఆపరేషన్ కుట్టనాడ్'.. యువ తెలుగు ఐఏఎస్ సేత్రా

**14** గ్రామాలు.. రెండు లక్షల మంది జనాభా.. ఒకట్రెండు రోజుల్లో తరలిస్తేనే ప్రాణాల్ని కాపాడే అవకాశం.

జలమార్గమే తప్ప రోడ్డు మార్గం లేకపోయినా, ప్రజలు, కొందరు సహచరులు సహకరించకపోయినా కూడా నచ్చజెప్పి, కాఠిన్యం చూపి, అడుగడుగునా పర్యవేక్షిస్తూ అంతమంది ప్రాణాల్నీ కాపాడారా అధికారి.

ముఖ్యమంత్రి, అఖిల భారత సివిల్ సర్వీసెస్ అధికారుల సంఘం, తొలుత వ్యతిరేకించిన ప్రజానీకం మన్ననల్ని పొందిన ఆ హీరో కేరళ అలెప్పి జిల్లా సబ్‌కలెక్టర్ కృష్ణతేజ.

ఈ యువ ఐఏఎస్ మన తెలుగువాడు కావడం మనందరికీ మరింత గర్వకారణం.

లోక్‌సత్తా భావజాలాన్ని ఎంతో అభిమానించడమే కాకుండా, ఆ



స్ఫూర్తిని, ప్రమాణాలను ఆచరణలో చూపడానికి ప్రయత్నిస్తుండే కృష్ణతేజ గుంటూరుజిల్లా చిలకలూరిపేటకు చెందినవారు.

ఇటీవల కేరళను వరదలు అతలాకుతలం చేసిన సమయంలో రాత్రి 10 గంటలప్పుడు కేరళ మంత్రి థామస్ ఐజాక్‌తో కలిసి సబ్‌కలెక్టర్ కృష్ణతేజ సమావేశంలో పాల్గొన్నారు. పక్క జిల్లా శబరిమలైలో డ్యామ్ నీటి మట్టం ఒకటిన్నర మీటర్లు పెరిగిందని అప్పుడే సమాచారం అందింది. అక్కడ ఒకటిన్నర మీటర్ల ఎత్తు నీటి మట్టం పెరిగిందంటే అలెప్పి జిల్లా కుట్టనాడ్‌లో ప్రమాదం పొంచి

### విమర్శలొచ్చినా ఎదుర్కోవడానికి సిద్ధపడ్డా

భౌగోళిక శాస్త్రంపై నాకున్న పరిజ్ఞానంతో స్పష్టతనేర్పరచుకుని ముందుకెళ్లా. ఎన్ని విమర్శలు వచ్చినా ఎదుర్కోవడానికే సిద్ధపడే కార్యాచరణను అమలు చేశా. ఉదాహరణకు ముట్టార్ గ్రామాన్ని మూడు గంటల్లో ఖాళీ చేయకపోతే మునిగిపోతుంది. స్థానికులకు ఈ విషయం అర్థం కాదు. అందుకే వారు ప్రతిఘటించినా.. కఠిన వైఖరి అవలంబించాం. ఆర్థిక మంత్రి థామస్ ఐజాక్ ప్రోత్సాహం, అధికారులు, ప్రజలూ, పడవల యజమానులు ఇలా పలువురి సహకారంతోనే ఈ ఆపరేషన్ విజయవంతమయ్యింది.

-కృష్ణతేజ, అలెప్పి సబ్‌కలెక్టర్




ఉన్నట్టే. ఎందుకంటే కుట్టనాడ్ సముద్ర మట్టానికంటే రెండు మీటర్ల దిగువన ఉంటుంది. 24 నుంచి 48 గంటల్లో ఆ ప్రాంతం మునిగి పోతుందని అధికారులు అంచనాకు వచ్చారు. కుట్టనాడ్ పరిధిలోని 14 గ్రామాల్లో నివసిస్తున్న 2 లక్షల నుంచి 2.5 లక్షల మందిని సురక్షిత ప్రాంతాలకు యుద్ధ ప్రాతిపదికన తరలించాలనే నిర్ణయానికొచ్చారు. జలమార్గమే తప్ప రోడ్డు మార్గం లేని ఆ గ్రామాల నుంచి అంత పెద్ద సంఖ్యలో జనాభాను తరలించడం అసాధ్య మని కొందరు అధికారులు కొట్టిపారేశారు. కానీ కృష్ణతేజ రాజీపడలేదు. వెంటనే అధికారు లతో చర్చలు ప్రారంభించి మర్నాడు తెల్లారి 5 గంటలకల్లా ప్రణాళికను సిద్ధం చేశారు.

ఒక్క రోజులో సుమారు రెండు లక్షల జనాభాను తరలించాలి. అదీ.. పడవల్లో. పైగా.. జనానికి ఇష్టం లేకుండా! సాధ్యమేనా? మునుపెన్నడూ ఇంత భారీయెత్తున ప్రజల్ని జలమార్గంలో తరలించిన దాఖలాలు లేవు. అయినా సాధ్యం చేసి తీరాలి! ఎందుకంటే అంతమంది ప్రాణాలకు ముప్పు పొంచి ఉంది కాబట్టి. కృష్ణతేజ కఠిన నిర్ణయం తీసుకున్నారు. 'ఆపరేషన్ కుట్టనాడ్'ను ప్రారంభించారు.

వరద ముంచుకొస్తున్న దాఖలాలే లేనప్పుడు సొంత ఇంటిని వదిలి వెళ్లడమేమిటని స్థానికులు ససేమిరా అన్నారు. దీంతో బలవంతంగానైనా పునరావాస కేంద్రాలకు తరలించాలని కృష్ణతేజ ఆదేశించారు. ఈ నిర్ణయాన్ని కొందరు రాజకీయ నేతలు కూడా వ్యతిరేకించారు. కొన్ని టీవీ ఛానల్స్ కూడా విమర్శించాయి. అయినా ఆయన వెనక్కు తగ్గలేదు. స్థానికంగా పంచాయతీ అధ్యక్షులకు నచ్చజెప్పారు. వారితో ప్రజలకు అర్థమయ్యేలా చెప్పి ఒప్పించారు. మొత్తానికి 48 గంటల కఠోరశ్రమ, కఠిన నిర్ణయాలతో దాదాపు 2.5 లక్షల మందిని సురక్షిత ప్రాంతాలకు చేర్చారు. తరలింపు మొదలుపెట్టిన 24 గంటల్లోపే ఆ ప్రాంతాన్ని వరదనీరు ముంచెత్తింది. రెండతస్తుల భవనాలు కూడా నీట మునిగిపోయాయి. దీంతో అప్పటివరకూ విమర్శించినవారే కృష్ణతేజను ప్రశంసలతో ముంచెత్తారు.

కార్యాచరణ ప్రారంభమైన దగ్గర్నుంచి ఆపరేషన్ కుట్టనాడ్ పూర్తయ్యే వరకూ ప్రతి పనినీ కృష్ణతేజ స్వయంగా పర్యవేక్షించారు. ఉన్నతాధికారే వరద నీటిలో నిలబడి సూచనలిస్తుండటంతో మిగిలిన యంత్రాంగం, పడవ యజమానులు, ఇతర స్వచ్ఛంద సేవకులూ శ్రమించారు. కృష్ణతేజ పర్యవేక్షణలో 700 పునరావాస శిబిరాలను ఏర్పాటు చేశారు. నాణ్యమైన భోజనం అందించేందుకు శిబిరాల్లో తానూ భోంచేయడంతో పాటు సహాయ చర్యల్లో పాల్గొంటున్న అధికారులూ అక్కడే తప్పనిసరిగా భోజనం చేయాలని ఆదేశించారు.

కృష్ణతేజ సాధించిన విజయం దేశవ్యాప్తంగా ప్రశంసల్ని అందుకోవడంతోపాటు ప్రకృతి విపత్తుల నిర్వహణలో ఒక పాఠంగా మారింది. ◆

# లోక్‌సత్తా భావజాలం దిక్సూచిలానే కొనసాగుతోంది



బాపూ, అంబేద్కర్ చూపిన బాటలోనే డా॥ జయప్రకాష్ నారాయణ్ లోక్‌సత్తా పార్టీని ఏర్పాటు చేశారని, దేశంలో ఎన్ని మార్పులొస్తున్నా లోక్‌సత్తా భావజాలం ప్రాధాన్యతను కోల్పోకుండా వేగుచుక్కలా దిక్సూచిస్తోందని లోక్‌సత్తా పార్టీ ఏపీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. మహాత్మాగాంధీ 150వ జయంతి వేడుకల ప్రారంభం, లోక్‌సత్తా పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా విజయనగరంలోని పార్టీ కార్యాలయంలో ఆయన జాతి పిత చిత్రపటానికి నివాళులర్పించి జాతీయ జెండా, పార్టీ జెండా ఎగురవేశారు. ప్రజలే కేంద్రంగా రాజకీయం చేస్తూ, పరస్పర విరుద్ధ ప్రయోజనాలను సైతం నాగరికంగా సమన్వయం చేసే జనరాజకీయాన్ని లోక్‌సత్తాయే దేశంలో ప్రారంభించిందన్నారు. గాంధీజీ, ఆయన పుట్టినరోజునే జన్మించిన లాల్‌బహదూర్ శాస్త్రి, అంబేద్కర్ తదితర మహనీయుల కలలు నెరవేర్చటం లోక్‌సత్తా భావజాలంతోనే సాధ్యమన్నారు. కిసాన్ క్రాంతి యాత్ర పేరుతో ఢిల్లీ చేరిన రైతులపై నరేంద్ర మోదీ ప్రభుత్వం దాడి చేయించటాన్ని బాబ్జీ ఖండించారు. రైతులకు ఆదాయం చుట్టూ నూతన వ్యవసాయ విధానాల్ని రూపొందించాలని డిమాండ్ చేశారు. లోక్‌సత్తా పార్టీ నేతలు నాగభూషణం, చిన్నారావు, రాజారావు, రమేష్, అప్పారావు, మధు, చంద్రరావు, సన్యాసినాయుడు, గురునాథం, పి.ఎల్.ఎన్ రాజు, రఘు, ఎర్నిబాబు తదితరులు పాల్గొన్నారు.

## లోక్‌సత్తాకు మద్దతివ్వండి - గ్రామాభివృద్ధికి కృషి చేయండి



లోక్‌సత్తా పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవాన్ని తూర్పు గోదావరి జిల్లా కొండగుంటూరులో పెంటగట్ల మణికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సీనియర్ న్యాయవాది వాడ్రేవు సత్యమూర్తి పార్టీ జెండాని ఆవిష్కరించారు. ప్రస్తుతం ప్రధాన పార్టీలుగా ఉన్నవి చేస్తున్నది అంతరించే పోయే రాజకీయమని, లోక్‌సత్తాది భవిష్యత్ రాజకీయమని మణికుమార్ అన్నారు. జనహితాన్ని కోరే లోక్‌సత్తాకు, మంచి నాయకులకు మద్దతివ్వాలని, గ్రామాభివృద్ధికి కృషి చేయాలని సత్యమూర్తి విజ్ఞప్తి చేశారు. గిరజాల నాగేశ్వరరావు, నీలం సాయి, సాయి మణికంత, పెమ్మనబోయిన ఆంజనేయులు, పీతల ప్రవీణ్, రమేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల మేనిఫెస్టో విడుదల చేస్తాం



లోక్‌సత్తా సిద్ధాంతాల్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు రానున్న ఎన్నికల్ని ఉపయోగించుకుంటామని సూర్యాపేట జిల్లా లోక్‌సత్తా పార్టీ ప్రధాన కార్యదర్శి పల్లేటి రమేష్ అన్నారు. ఎక్కడికక్కడ వికేంద్రీకరణతో ప్రజల మేనిఫెస్టోని తయారుచేస్తామన్నారు. అక్టోబర్ 2న లోక్‌సత్తా పార్టీ 13వ ఆవిర్భావం సందర్భంగా గాంధీ, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. లోక్‌సత్తా పార్టీ నాయకులు భరత్, సైదులు, విజయ్, పరమేష్, కనుకు విజయ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# (మీడియాలో) 'కీ' కామెంట్లు!

❒ 'మహిళలకు దేశంలో రక్షణ లేదు, మూడేళ్ల చిన్నారి నుంచి 70 ఏళ్ల వృద్ధురాలిపైనా అత్యాచారాలు జరుగుతున్నాయి. నిర్భయ చట్టం ఉన్నప్పటికీ అఘాయిత్యాలు ఎందుకు ఆగడం లేదు'.. భారతదేశంలో నేను ఎక్కడికెళ్లినా ఇదే ప్రశ్న అడుగుతున్నారు.

– రాహుల్ గాంధీ, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు

❒ సామాన్య ప్రజలను సతమతం చేస్తున్న సమస్యల గురించి కాకుండా రాహుల్ నాయకత్వ సామర్థ్యాలే (లేదా అవి కొరవడడం) ఎన్నికల సందర్భంగా ప్రజల మాటామంతీ కావాలనేది బీజేపీ ధ్యేయం. కాంగ్రెస్ నాయకుల తీరుతెన్నులు కూడా ఇందుకు తోడ్పడుతున్నాయి మరి. బీజేపీ ధోరణిలో కాకుండా సొంత వ్యూహాన్ని రూపొందించుకొని, తనదైన పద్ధతిలో ఆ వ్యూహాన్ని అమలుపరచడంలో కాంగ్రెస్ ఎందుకు శ్రద్ధ చూపడం లేదు?

– రాజ్‌దీప్ సర్దేశాయి, సీనియర్ జర్నలిస్టు

❒ భారత్‌లోని మూడో తరగతి విద్యార్థుల్లో 25 శాతం మంది మాత్రమే మామూలు వాక్యాలతో కూడిన చిన్న చిన్న కథలను చదివి, అర్థం చేసుకోగలుగుతున్నారు. 3వ తరగతి విద్యార్థుల్లో 75 శాతం మంది రెండంకెల సంఖ్యలను ఇతర సంఖ్యల నుంచి తీసివేయలేకపోతున్నారు.

- బిల్ అండ్ మెలిండా ఫౌండేషన్ 'గోల్‌కీపర్స్ డేటా' నివేదిక

❒ జాతి జీవనంలో అంగుష్ఠమాత్రులే వెలుగొందుతున్న కాలమిది. అందుకే నడుస్తున్న కాలాన్ని 'ఏజ్ ఆఫ్ క్రెటినిజం'గా అభివర్ణించవచ్చని ఈతరం ప్రముఖ భారత రాజనీతి శాస్త్రవేత్తలలో ఒకరైన ప్రతాప్ భాను మెహతా ఇటీవల అన్నారు. ఈ విపత్కర పరిస్థితిని దేశం అధిగమించేందుకు 'ది వైర్' ఆన్‌లైన్ న్యూస్‌పోర్టల్ చేస్తున్న కృషికి జాగృతపౌరులు తమ తోడ్పాటునందించాలి.

- జ్యోతి

❒ అమెరికా దిగ్విజయంగా చంద్రుడి మీద మనిషిని దింపిన రోజుల్లో చైనాలో సాంస్కృతిక విప్లవం మూడు కోట్ల మందిని బలిగొంది. చైర్మన్ మావో విశ్వవిద్యాలయాలను మూసివేసిన కాలంలో అమెరికా, ఐరోపా పరిశోధకులు ఇంటర్నెట్‌ను కనిపెట్టి నాలుగో పారిశ్రామిక విప్లవానికి తెరతీశారు. శాస్త్రసాంకేతిక రంగాల్లో వెనకబడటం వల్ల తమ అభివృద్ధి రథం కుంటువడిందని గ్రహించిన చైనా హుటాహుటిన ప్రగతిపథంలో పరుగు ప్రారంభించింది. చౌక బొమ్మలు, దుస్తుల తయారీ దశ నుంచి అత్యాధునిక పరిశ్రమల దశకు ఎదగడానికి 2015లో 'మేడ్ ఇన్ చైనా-2015' ప్రణాళికను ప్రకటించింది. త్రీడీ ప్రింటింగ్, ఐఓటీ, రోబోటిక్స్, క్వాంటమ్ కంప్యూటింగ్, కృత్రిమ మేధ (ఏఐ), ఎలక్ట్రిక్ వాహనాల తయారీ, ప్రత్యామ్నాయ ఇంధనాల వంటి హైటెక్ రంగాల్లో చైనాను జగజ్జేతగా నిలపడం ఆ ప్రణాళిక లక్ష్యం. వైర్‌లెస్ సెన్సర్లు-అంతర్జాల అనుసంధానంతో నడిచే తెలివైన కర్మాగారాలు, స్వయంచాలిత పరిశ్రమలను ప్రోత్సహించడానికి జర్మనీ చేపట్టిన ఇండస్ట్రీ 4.0 ప్రణాళికే దీనికి స్ఫూర్తి. చైనా జనాభాకు వయసు మీదపడటం, వారికి అధిక వేతనాలు చెల్లించాల్సి రావడంతో ప్రపంచ విపణిలో పోటీ పడే సత్తా తగ్గిపోతోంది. ఇక చౌక వస్తువుల తయారీని అల్పాదాయ దేశాలకు తరలించి హైటెక్ పరిశ్రమలపై దృష్టి పెట్టాలని చైనా నిర్ణయించింది. అంటే చైనా ఇతర దేశాలకు అన్ని రకాల ఎగుమతులు చేస్తుంది కానీ, తాను మాత్రం ఇతర దేశాల నుంచి దిగుమతులను నిరుత్సాహపరుస్తుందన్న మాట.

- ఏపీవీ ప్రసాద్

❒ సామాజిక మాధ్యమాలను బురద జల్లడానికి ఉపయోగించవద్దు. సమాజాన్ని బలోపేతం చేసే సమాచారాన్ని సోషల్ మీడియాలో పంచుకోవాలి. మొహల్లాలో రెండు కుటుంబాల మధ్య గొడవ ఈ రోజుల్లో జాతీయ వార్త అయిపోతోంది. సోషల్ మీడియా ద్వారా బురద జల్లకుండా ఎవరికివారే శిక్షణ పొందాలి, క్రమశిక్షణ పాటించాలి. ఈ అంశం ఏ రాజకీయ పార్టీ గురించి, మరే సిద్ధాంతం గురించి కాదు. 125 కోట్ల మంది భారతీయులకు సంబంధించినది.

– నరేంద్ర మోదీ, భారత ప్రధానమంత్రి

❒ *రాజకీయవేత్తలలో అత్యధికులు ప్రజల ఆశలు, ఆకాంక్షలకు ఊతమివ్వడమో లేదా ప్రజలలో గూడుకట్టుకుని ఉన్న భయాలను స్వార్థలక్ష్యాలకు ఉపయోగించుకోవడమో చేస్తుంటారు. తమ రాజకీయ జీవితమంతా ఈ రెండు ధోరణులలో ఏదో ఒకదానికి కట్టుబడి ఉంటారు. అయితే నరేంద్రమోదీ ఇందుకు మినహాయింపు. తన అవసరాలకు అనుగుణంగా ఈ రెండు ధోరణులను అనుసరించడం ఆయన ప్రత్యేకత.*

*– రామచంద్ర గుహ, చరిత్రకారులు*

❒ *నేను సాంకేతిక నిపుణుడిని కాను, మంచి మేనేజరును. నాకేం కావాలో.. దానిని ఎలా రాబట్టుకోవాలో నాకు తెలుసు.*

*– చంద్రబాబు నాయుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి*

❒ *ఓటర్లను ఆకట్టుకోవడానికి పార్టీలు ఎంత డబ్బునైనా ఖర్చు పెడతాయి. ప్రస్తుత రాజకీయాల్లో డబ్బు లేకపోతే గెలవడం చాలా కష్టం. నేటి పరిస్థితుల్లో స్వయంగా శ్రీరాముడే వచ్చి ఎన్నికల్లో పోటీ చేసినా.. డబ్బు పంచకుండా ఆయన కూడా గెలవడు.*

*– సుభాష్ వెలింకర్, గోవా ఆర్ఎస్ఎస్ మాజీ చీఫ్*

❒ *ఈ రాజకీయ నాయకులు తమ అధికారాలను న్యాయమూర్తులకు ఎందుకు అప్పగిస్తున్నారు? ఈ తరహా వ్యవహారాలు సుప్రీంకోర్టులో నిత్యకృత్యంగా మారిపోయాయి. 'ఐపీసీ సెక్షన్ 377 (స్వలింగ సంపర్కాన్ని నేరంగా పేర్కొంటోంది)పై నిర్ణయాన్ని కోర్టు విచక్షణకే వదిలేస్తున్నాం' అనడం జడ్జీలకు చాలా సమ్మోహనపరిచే మాట. పొగడ్తలు ఎన్నటికైనా చేటు తెస్తాయనీ, వాటి కారణంగా ఇబ్బందులు ఎదుర్కోకతప్పదని జడ్జీలు గుర్తుంచుకోవాలి.*

*– జస్టిస్ డీవై చంద్రచూడ్, సుప్రీంకోర్టు జడ్జి*

❒ ఒక 'అభివృద్ధి చెందిన దేశం'కు ఉన్న వనరుల సమృద్ధి భారత్‌కు లేదు. ఈ దృష్ట్యా ప్రస్తుత పరిస్థితులలో భారత్ తన అత్యంత ప్రతిభావంతులైన, అద్భుత కార్యసాధకులైన యువ వ్యవస్థాపకులు అందరూ స్వదేశంలోనే ఉండేలా జాగ్రత్త వహించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ఆ యువ వ్యవస్థాపకులు అలా స్వదేశంలో ఉన్నప్పుడు మాత్రమే భారత్ అభివృద్ధికి నేరుగా దోహదం చేయగలదు.

– డాక్టర్ ఫ్రాంక్-యుర్గెన్ రిక్టర్,

జర్మన్ పారిశ్రామికవేత్త, గ్లోబల్ బిజినెస్ థింక్ ట్యాంక్ 'హోరాసిస్' సంస్థాపకులు

*(కర్టసీ: ఈనాడు, సాక్షి, ఆంధ్రజ్యోతి, 10 టీవీ, సోషల్ మీడియా)*

# గిట్టుబాటు ధర కల్పించటం కూడా చేతగాని పాలకులు ప్రగల్భాలు పలుకుతున్నారు

దేశ జనాభాలో పెద్దసంఖ్యలో ఉన్న రైతులకు గిట్టుబాటు ధర కూడా కల్పించటం చేతగాని పాలకులు అవి చేశాం, ఇవి చేశాం అని ప్రగల్భాలు పలుకుతున్నారని జేపీ అన్నారు. గట్టిగా నిలదీస్తే తమ చేతగానితనాన్ని ప్రకృతి వైపరీత్యాల మీదకు నెడుతున్నారన్నారు. రైతులకు నష్టం చేస్తున్నది పాలకుల విధానాలే తప్ప ప్రకృతి వైపరీత్యాలు కాదని పునరుద్ఘాటించారు.

కర్నూలు జిల్లా పత్తికొండ వ్యవసాయ మార్కెట్‌ను సురాజ్య యాత్రలో భాగంగా జేపీ సందర్శించారు. టమాటా రైతులతో మాట్లాడారు.

రైతుల స్థితిగతులను తాను వరసగా ప్రతి జిల్లాలో గమనిస్తూ వస్తున్నానని, చిత్తూరు జిల్లా మదనపల్లెలో తాను టమాటా మండీని సందర్శించినప్పుడు ఉన్న ధరకు, ప్రస్తుత ధరకు పొంతన లేదని జేపీ అన్నారు. ఏరోజు ఎలాంటి ధర ఉంటుందో తెలియనంత అయోమయ పరిస్థితిలో రైతులు కొట్టుమిట్టాడుతుంటే, జోక్యం చేసుకోవాల్సిన ప్రభుత్వాలు చోద్యం చూస్తున్నాయన్నారు. ధరలు పెరిగే అవకాశమున్నప్పుడు గండికొట్టటం, మరీ గందరగోళ పరిస్థితి వస్తే కానిని తాయిలాలు ప్రకటించటం, ఎన్నికలప్పుడు రుణమాఫీలు వంటివి పోటాపోటీగా హామీ ఇవ్వటం తప్ప రైతులకు ఆదాయం పెంచటం మీద ఏ పార్టీ, ఏ పాలకుడూ దృష్టి సారించటం లేదన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సు చేసినట్టు.. సాగువ్యయానికి అదనంగా 50శాతం కలిపి రైతులకు మద్దతు ధర ఇస్తామని చెప్పిన కేంద్ర, రాష్ట్ర పాలకులు ఇప్పుడు ఏరు దాటాక తెప్ప తగలేసినట్టు వ్యవహరిస్తున్నారన్నారు. ఆ మద్దతు ధరను ఇవ్వకపోగా.. రైతులకఉత్పత్తులకు డిమాండ్ పడిపోయేలా ఎగుమతి, దిగుమతి విధానాలను అనుసరిస్తున్నారన్నారు. గత మూడేళ్లలో ఎగుమతులు తగ్గి, పప్పుదినుసులు, వంటనూనెల దిగుమతులు పెరగటం వల్ల ఏడాదికి రూ. 1,40,000కోట్లు రైతులు నష్టపోతున్నారన్నారు. పప్పుదినుసులు, వంటనూనెలు మనదేశంలోనూ



పండుతాయని, దిగుమతుల మీద 40శాతం సుంకం విధించి ఆ డబ్బును ప్రోత్సాహకంగా మన రైతులకే ఇస్తే ఈ మూడేళ్లలోనే స్వావలంబన సాధించి చూపేవారని, రైతులకూ ఆదాయం లభించి ఉండేదని అన్నారు. 2011లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆహార ధాన్యాల ఎగుమతులపై, ఇతర రాష్ట్రాల్లో అమ్మకాలపై నిషేధం విధించినప్పుడు తాను ఢిల్లీ వరకూ పోరాడి, అన్ని పార్టీలనూ, ప్రధానమంత్రిని ఒప్పించి నిషేధాన్ని తొలగింప చేశానన్నారు. దీని వల్ల భారతదేశం బియ్యం ఎగుమతుల్లో ప్రపంచంలోనే నెంబర్‌వన్ స్థాయికి ఎదిగిందని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఒక్క సీజన్‌లోనే బీపీటీ ధాన్యం రైతులకు రూ. 3,600కోట్ల లాభం చేకూరిందని వివరించారు. పాలకుల విధానాలు ఎంతలా రైతుల్ని దెబ్బతీస్తున్నాయో చెప్పటానికి ఇవి వరుస ఉదాహరణలన్నారు.

ఈ పరిస్థితిని మార్చి వ్యవసాయాన్ని లాభసాటి చేసే విధానాలను వివరించటానికే సురాజ్య యాత్ర చేస్తున్నామని, ఈ పర్యటనలన్నిటినీ క్రోడీకరించి రైతుకు ఆదాయం చుట్టూ వ్యవసాయ విధానాలతో సమగ్ర నివేదికను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అందచేస్తామని, సాధించేవరకూ ప్రజల భాగస్వామ్యంతో పోరాడతామని జేపీ అన్నారు.

లోక్‌సత్తా నేతలు రామ్మోహనరావు, భీశెట్టి బాబ్జీ, ఆనందాచారి, ప్రసాద్, జయరాముడు, ఎర్రిస్వామి, వైబీఐ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. ◆



# వ్యవస్థల వైఫల్యం వల్లే విలువల పతనం

వ్యవస్థలు విఫలమవటం వల్లే మన దేశంలో విలువలు పతనమవుతున్నాయని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. కొత్తగా ఎంపికై శిక్షణలో ఉన్న గ్రూప్-1, గ్రూప్-2 అధికారులనుద్దేశించి బాపట్లలోని ఏపీహెచ్ఆర్‌డీఐలో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్యం పేరుతో అప్రజాస్వామిక పాలన కొనసాగుతోందని, ప్రజలకు సేవకులమని ప్రభుత్వంలో ఉన్నవారు గుర్తించాలన్నారు. సంస్కరణలు తీసుకొచ్చి సమర్థ వ్యవస్థలను ఏర్పాటు చేస్తేనే సుపరిపాలన సాధ్యమవుతుందని, విలువలు పెరుగుతాయని జేపీ వివరించారు. మంచిని ప్రోత్సహిస్తూ చెడును ఖండించేలా పాలనా వ్యవస్థ నిర్మాణం, అధికారుల పనితీరు ఉండాలన్నారు. నాణ్యమైన విద్య, వైద్యం ఖరీదైనవిగా మారాయని, జనాభాలో అత్యధికులకు మేలు చేసేలా ప్రభుత్వాలు పనిచేయాలన్నారు. ప్రజాకర్షక పథకాల స్థానంలో ప్రజలకు వాస్తవంగా ఉపయోగపడే అంశాల మీద దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఆర్‌డీఐ డీజీ డి.చక్రపాణి, అధికారులు పాల్గొన్నారు.

Posting Date 22-10-2018
RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2016-18 Published on October 16th, 2018




# "సంస్కర్తకి అపారమైన సహనం ఉండాలి"

- మహాత్మాగాంధీ

| Book-Post<br>PRINTED MATTER | To |
|---|---|
| If not delivered please return to:<br><br>Lok Satta Times<br>Tulips Apartment,<br>6-3-655, Flat.No. 407,<br>Behind Civil Supplies Office,<br>Somajiguda<br>Hyderabad- 500082 | |

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad